ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శుక్రవారం 06.11.2026 | సంపుటి:13 సంచిక:107 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





పార్లమెంట్‌కు రండి..!

- బాధ్యతాయుతమైన చర్చ జరగాలంటే కూర్చుని చర్చించుకుందాం
- ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను మీరు తట్టుకోలేరు
- రాహుల్‌కు సూచించిన అమిత్‌షా

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రధాని మోదీ బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తోన్న డిమాండ్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుపట్టారు. రాజకీయ చర్చను వీధుల్లో కాకుండా పార్లమెంట్‌లో పెట్టాలని మంత్రి సవాల్ విసిరారు. ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను రాహుల్ తట్టుకోలేరని ఎద్దేవా చేశారు. "బాధ్యతాయుతమైన మిగతా 2లో..

భవనాలా?.. పేకమేడలా?

- ఢిల్లీలో కూలిన మూడంతస్తుల భవనం..
- శిథిలాల కింద పలువురు!



2లో..



డిసెంబర్‌లో బ్యారేజీ పనుల పునరుద్ధరణ

నిపుణుల సూచనమేరకే ముందుకెళతాం : సీఎం రేవంత్ రెడ్డి

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ముఖ్యమంత్రి సమీక్ష
- దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా దిగువ గోదావరి జలాల సద్వినియోగం చేసుకోవాలని సూచన

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువ చ్చేందుకు అవసరమైన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజె క్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.మేడిగడ్డ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారా న్ని తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అక్కడ కనిపించే నీటిని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు మిగతా 2లో..

గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మేడిగడ్డ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించింది. దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేశాం. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించాం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం

- కంపెనీల ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలి
- ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల ప్రక్రియ పూర్తి చేయాలి
- గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో పాల్గొనే ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రముఖ టూరిస్ట్ స్పాట్లను సమిట్‌లో ప్రదర్శించాలన్నారు. వాతావరణ మార్పులపై సదస్సులో చర్చ జరిగేలా చూడాలని, నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ ఎడ్యుకేషన్ ప్రతిబింబించేలా చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు. నవంబర్ 15 వరకు ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల మిగతా 2లో..

గల్లంతైన 11 మంది సురక్షితం

- ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ధైర్యసాహసాలకు మంత్రి పొంగులేటి అభినందన
- ప్రాణనష్టం జరగకుండా సహాయక చర్యలు చేపట్టిన అధికారులకు కితాబు
- కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయ కృషిపై ప్రశంసలు
- సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, మత్స్యకారులకు పరామర్శ
- సొంత ఇల్లు లేని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ



రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాయం కోసం ఎదురుచూశాం

తమ భయానక అనుభవాన్ని వివరించిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

2లో..

సత్తుపల్లి, (జనంసాక్షి) : మురసు తుపాను ప్రభావంతో బేతుపల్లి చెరువు అలుగు పొంగి వరద ఉద్ధృతి పెరిగిన వేళ.. ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ధైర్యసాహసాలు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయస్ఫూర్తి తో వ్యవహరించి ప్రాణనష్టం జరగకుండా బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.బుధవారం రాత్రి బేతుపల్లి చెరువు వద్ద వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించే క్రమంలో పడవ బోల్తాపడి 11 మంది వరద ఉద్ధృతిలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తీవ్రంగా శ్రమించి అందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి పొంగులేటి గురువారం పరామర్శించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, మిగతా 2లో..

అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే

24 గంటల గడువు ప్రారంభం

సుప్రీం చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ(జనంసాక్షి): అరెస్టులు, నిర్బంధాలు, న్యాయస్థానాల ముందు హాజరుపర్చే విషయంలో 24 గంటల గడువు వంటి అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే.. అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడానికి రాజ్యాంగం విధించిన 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభం అవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది అధికారికంగా అరెస్టు చేసినప్పటి నుంచి కాకుండా అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే ఆ సమయాన్ని లెక్కించాలని తేల్చిచెప్పింది. "అధికారికంగా అరెస్టు జరిగినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభం అవుతుందనే అభిప్రాయం భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లకు విరుద్ధం. మిగతా 9లో..

ఢిల్లీ నిరసనలపై నెలరోజుల్లోగా నివేదికను సమర్పించండి

ఉన్నతస్థాయి కమిటీకి సుప్రీం ఆదేశం

9లో..

ఆరోపణలు తప్ప చర్యలేవీ?

- ఆర్ఆర్ ట్యాక్స్‌పై ప్రధాని మోదీ, అమిత్‌షా మౌనమెందుకు?
- భాజపా, కాంగ్రెస్‌ల మధ్య ఉన్న అంతర్గత అవగాహనే దీనికి కారణం: కేటీఆర్



హైదరాబాద్ (జనంసాక్షి): తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించడం తప్ప ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. భాజపా, కాంగ్రెస్‌ల మధ్య ఉన్న అంతర్గత అవగాహనే దీనికి కారణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను అడిగినా ఆర్ఆర్ ట్యాక్స్ వాస్తవమేనని చెబుతారన్నారు. చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నది వాస్తవమని ఆరోపించారు.

జల సంరక్షణతో పల్లెలకు ఉపాధి భరోసా

జనవరి నుంచి జూన్ వరకు ప్రతి గ్రామంలో కార్యాచరణ

- రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యక్రమానికి సన్నాహాలు
- చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు,
- భూగర్భజల వనరుల పునరుజ్జీవానికి ప్రాధాన్యం
- నీటిపారుదల,పంచాయతీరాజ్
- గ్రామీణాభివృద్ధి శాఖల సంయుక్త అమలు
- ఇప్పటికే 355 రకాల పనుల గుర్తింపు
- అవసరమైన అదనపు నిధులను సమకూర్చనున్న రాష్ట్ర ప్రభుత్వం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): జలవనరుల పునరుద్ధరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 2027 జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర సచివాలయంలో గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో మంత్రి మాట్లాడారు. రాబోయే వర్షాకాలానికి ముందుగా ఆరు నెలలపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామస్థులను, ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు.ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సవాలును అవకాశంగా మలుచుకొని దీర్ఘకాలం ఉపయోగపడే జలవనరుల ఆస్తులను సృష్టించాలని, ఇప్పటికే ఉన్న సాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని చెప్పారు. గ్రామీణ ఉపాధి కల్పనతోపాటు భూగర్భజలాల లభ్యతను మెరుగుపరచేలా పనుల ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చేపట్టేందుకు వీలుగా ఇప్పటికే 355 రకాల పనులతో సమగ్ర జాబితా సిద్ధమైందని మంత్రి తెలిపారు. స్పష్టమైన లక్ష్యం, తగిన ఆర్థిక వనరులు, గ్రామస్థాయిలో సమర్థవంతమైన అమలు ప్రధానాంశాలుగా కార్యక్రమాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు మిగతా 2లో..

ఇరాన్‌తో యుద్ధం వల్లే మా ఓటమి

ఇజ్రాయెల్ కూడా కారణమే..

ట్రంప్ విధానాలపై జేడీ వాన్స్ విమర్శలు..





వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ పరాజయం పాలై సెనెట్, ప్రతినిధుల సభ రెండింటినీ డెమోక్రాట్లు కైవసం చేసుకోవడంతో వైట్‌హౌస్‌లో లుకలుకలు బయటపడ్డాయి. ఎన్నికల్లో ఓటమికి ట్రంప్ విధానాలే కారణమంటూ అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ఓడిపోయామన్న నిరాశావాదంతో కాకుండా.. వ్యూహాత్మకంగానే వాన్స్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు అర్థమవుతోంది. 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న జేడీ వాన్స్.. ట్రంప్ విధానాల నుంచి తనను తాను వేరు చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది.అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జేడీ వాన్స్ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇరాన్‌తో యుద్ధం చేయడం వల్లే పార్టీ ఘోరంగా ఓడిపోయిందని అందులో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడం వల్ల తాము ఓడిపోలేదని, 2024 అధ్యక్ష ఎన్నికల్లో తమకు ఓటు వేసిన చాలా మంది ఓటర్లు.. ఈసారి కోపంతో డెమోక్రాట్లకు ఓటు వేశారంటూ ఓ సర్వే నివేదికను ఉటంకించారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన జీవన వ్యయాలు, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, ఇజ్రాయెల్‌తో అమెరికాకు మిగతా 2లో..

సర్వం సమస్యల వలయం



తెలంగాణలో దాదాపు 71 లక్షల ఓట్లు పోయినట్లే!

నవంబరు 26తో ముగియనున్న అభ్యంతరాలు, ఫిర్యాదులు, నోటీసుల విచారణ గడువు

హైదరాబాద్(జనంసాక్షి): ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితాలో భాగంగా డ్రాఫ్ట్ లిస్ట్‌ను ప్రకటించిన రోజు తొలగించిన 73,39,235 ఓట్లు ఏమవుతాయన్న చర్చ ప్రస్తుతం నడుస్తోంది. చిరునామాలో లేక పోవడం, మృతి చెందడం, శాశ్వతంగా వలస వెళ్లడం, డూప్లికేట్ (ఏఎస్‌డీడీ) కారణాలను చూపుతూ ఓట్ల ముసాయిదా జాబితాలో వీరి పేర్లను జత చేయలేదు. ఏఎస్‌డీడీ జాబితాలో నిజమైన ఓటరు పేరు ఉంటే, మళ్లీ కొత్తగా ఫారం-6 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఆగస్టు 17న ఎన్నికల సంఘం ముసాయిదా జాబితా ప్రకటించింది. కొత్త ఓటు కోసం ఇప్పటివరకు 2.39 లక్షల దరఖాస్తులే వచ్చాయి. సర్ అభ్యంతరాలు, ఫిర్యాదులు, నోటీసుల విచారణ గడువు ఈనెల 26తో ముగియనుంది. నవంబరు 30న ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తారు. తొలగించిన ఓటర్లలో చాలా మంది ఫారం-6ను అప్లై చేసుకోలేదు. దీనిపై ఎన్నికల సంఘం కూడా ఎటువంటి ప్రత్యేక డ్రైవ్ చేపట్టలేదు. దీంతో దాదాపు 71 లక్షల మంది ఓట్లు తొలగిపోయినట్లే. వీరిలో అర్హులైన ఓటర్లూ మిగతా 2లో..

అంతరిక్ష పరిశోధనలకు కేంద్రంగా తెలంగాణ



- హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో స్పేస్ కంపెనీలు పని చేస్తున్నాయి.
- వీటికి ప్రోత్సహించేందుకు స్పేస్‌టెక్ పాలసీ తీసుకొస్తాం
- నిరుపయోగ శాటిలైట్లను కక్ష్య నుంచి వెనక్కి తేవడం ముఖ్యం
- దేశంలో తొలిసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ తరహా ప్రయోగం చేపట్టడం ప్రశంసనీయం: శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి): అంతరిక్షం.. పరిశోధనలకు కేంద్రంగా మారిందని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నో దేశాలు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపుతున్నాయని, పదేళ్లలో శాటిలైట్ల సంఖ్య 10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాస్మోసర్వ్ కార్యాలయాన్ని దిల్లీ నుంచి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మిగతా 2లో..



రూ. 1 లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అవినీతి అధికారి

ఏసీబీ వలలో మహబూబ్‌నగర్ జిల్లా డివైఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్

వివరాలు లోపలి పేజీల్లో..

'సర్'వం సమస్యల వలయం

ఉండే అవకాశం కూడా లేకపోలేదు. పలు సంస్థలు నిర్వహించిన సర్వేలోనూ అర్హులై ఉండి, తొలగింపునకు గురైన ఓటర్ల దృష్టాంతాలు కూడా ఉన్నాయి

రిటైర్డ్ ఎస్సై ఓటు తొలగింపు

కరీంనగర్ పట్టణ కేంద్రానికి సమీపంలోని వావిలాలపల్లిలో సుమారు ముప్పై ఏళ్లుగా నివసిస్తున్న పుల్లయ్య కాంబ్లే ఓటును ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా శాశ్వతంగా నివాసం మారినవారి జాబితాలో చేర్చి తొలగించారు. తాను ఎస్సైగా రిటైర్ అయిన తర్వాత 1983 నుంచి ఓటు వేస్తున్నట్లు పుల్లయ్య తెలిపారు. తమ కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఉన్నా, కేవలం తన ఓటు ఎలా తీసేస్తారు? అంటూ కాంబ్లే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ బూత్‌లో ఇద్దరి పేర్లు తొలగింపు

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ 39వ పోలింగ్ బూత్ పరిధిలో గంగారపు స్టీఫెన్ తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నారు. ఎస్?ఐఆర్?లో భాగంగా కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా తన పేరును ఆచూకీ లేనివారు, గైర్హాజరు అనే వంకతో తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రీతిలో పొలుమారి సిలువయ్య అనే వ్యక్తి పేరును కూడా తీసివేశారు. కూలి పనులు చేసుకుంటూ గ్రామంలోనే ఉంటున్నా తన ఓటు ఎలా తొలగిస్తారని సిలువయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవనాలా?.. పేకమేడలా..?

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీలో మూడంతస్తుల భవనం కూలిపోయింది. ఓల్డ్ ఢిల్లీలోని చావ్డీ బజార్ మెట్రో స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ భవనం లోపల నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు వెల్లడించారు. ఈ క్రమంలోనే అది కూలినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం ఇరుకైన వీధిలో ఉండటంతో సహాయ చర్యలకు ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే.. రెండు రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా చాందినీ చౌక్‌లోని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌హాల్‌లో కొంతభాగం కూలిపోయింది. ఇటీవల ఢిల్లీలోని మిలన్ గార్డెన్ ప్రాంతంలో ఒక పాత ఇంటిపై మరో అంతస్తు నిర్మాణం చేపడుతుండగా భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలోనూ ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. దేశ రాజధానిలో ఈ వరుస ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

పార్లమెంట్‌కు రండి..

చర్చ జరగాలని మీరు అనుకుంటే.. మీ ఆందోళనల్లో సత్యం, తర్కం ఉంటే.. రండి పార్లమెంట్‌లో చర్చించుకుందాం. ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకుందాం. కానీ, మా సమాధానాలను మీరు తట్టుకోలేరు. ఎప్పటలాగే పారిపోతారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుంది. బాయ్‌కాట్‌లను రాజకీయ వ్యూహంగా మార్చుకుంది. పార్లమెంట్‌లో కీలకమైన చర్చలను తప్పించుకుంటూ.. గందరగోళం సృష్టించే దుకు వీధుల్లో జనాలను సమీకరించుకుంటున్నారు" అని హరియాణాలో జరిగిన సభలో అమిత్ షా మండిపడ్డారు.

న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది

హరియాణాలోని కర్నాల్ ప్రాంతంలో అమిత్‌షా, ఇతర కీలక నేతలంతా 'లోక్‌తంత్ర బచావో, అరాజకతా హఠావో' పేరిట పాదయాత్రలో పాల్గొన్నారు. సర్‌పై చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. "2014లో సర్ ఉందా..? అయినా సరే మీ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. 2019, 2024లోనూ మీకదే పరిస్థితి. అప్పుడు కూడా సర్ లేదు. వీధుల్లో జనాలను సమీకరించే ప్రయత్నాలను రాహుల్ కొనసాగిస్తే.. భాజపా నుంచి తగిన సమాధానం వస్తుంది" అని పేర్కొన్నారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు రావాలని రాహుల్ డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే.

డిసెంబర్‌లో బ్యారేజీ పనుల పునరుద్ధరణ

ముఖ్యమంత్రి చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే..ఈ మూడేండ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్? నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు.ఈ సమావేశంలో మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూపొందించిన ప్రణాళికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని, బ్యారేజీల కుంగుబాటుకు దారితీసిన కారణాలను వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని, ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకువచ్చే అవకాశం ఉండేదని అన్నారు.మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు వివరించారు.

జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వివరించారు .మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని ముఖ్యమంత్రి సూచించారు.పునరుద్ధరణ పనులకు సంబంధించిన తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలన్నారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతో పాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు.నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం

సీఎంలను ఆహ్వానించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై చర్చించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న సదస్సుపై సమాలోచనలు చేశారు.





గల్లంతైన 11 మంది సురక్షితం

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్‌లతో కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.చాతకొండ ఆరో బెటాలియన్‌కు చెందిన ఆర్ఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుల్ నరేష్, కానిస్టేబుళ్లు వేణు, బాలాజీ, సీతయ్య, కాశీరాంతో పాటు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎస్.కే. యాసిన్ అజ్వల్, ఎన్. రాజా, నాజర్ వలీ, రామిరెడ్డిలను పరామర్శించారు. రాత్రంతా వరద ఉధృతిలో చిక్కుకున్నప్పటికీ ధైర్యం కోల్పోకుండా సహాయక చర్యల్లో పాల్గొన్న తీరు గొప్పదని ప్రశంసించారు. ఈ సందర్భంగా సిబ్బందికి శాలువాలు కప్పి సత్కరించి, పండ్లు అందజేశారు.

ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు

బుధవారం రాత్రే ఈ ఘటనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేశారని ప్రశంసించారు. ఉదయం హెలికాప్టర్ ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని భావించినప్పటికీ.. అధికారుల సమర్థవంతమైన చర్యలతో ఆ అవసరం లేకుండానే అందరినీ ఒడ్డుకు చేర్చగలిగారని పేర్కొన్నారు.బుధవారం రాత్రి 11 గంటల సమయంలో తాను సైతం వరదలో చిక్కుకున్న వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు గుర్తు చేశారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో సొంత ఇల్లు లేని వారు ఎవరైనా ఉంటే.. వారు ఏ జిల్లాకు చెందిన వారైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆపత్కాలంలో ప్రాణాలకు తెగించి సేవలం దించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి వ్యక్తిగతంగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాయం కోసం ఎదురుచూశాం

సత్తుపల్లి(జనంసాక్షి):ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తమ అనుభవాన్ని వివరించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాపాడుకున్నామని వారు తెలిపారు.ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లిలో చెరువులో గల్లంతైన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని అధికారులు సురక్షితంగా కాపాడారు. బుధవారం మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది బోటు బోల్తా పడడంతో 11 మంది గల్లంతయ్యారు. రాత్రి ఐదుగురిని కాపాడిన ఇతర సిబ్బంది, తెల్లవారు జామున మిగతా వారిని ఉదయం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నామని చెప్పారు. చెరువులో గల్లంతైన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది నిద్ర లేని రాత్రి గడిపామన్నారు. చావు అంచుల దాకా వెళ్లి వచ్చిన వారు ఆ భగవంతుడు తమకు పునర్జన్మ ప్రసాదించాడంటూ చెబుతున్నారు. 6 మంది ఎస్డీఆర్ఎఫ్, 4 మంది అగ్నిమాపక ఉద్యోగులతో పాటు ఒక స్థానికుడు సహా మొత్తం 11 మంది సురక్షితంగా బయటపడి మృత్యుంజయులయ్యారు. ఈ ఘటనలో చిక్కుకుని క్షేమంగా వచ్చిన వారిని చూసి కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. "మేం కొత్తగూడెం 6వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ టీం. వరదలో చిక్కుకున్న మత్స్యకారులను కాపాడటానికి వెళ్లినప్పుడు మా బోట్స్ వరదలో లాక్కుని వెళ్లిపోయాయి. మేం అక్కడక్కడ చెట్లను పట్టుకుని ప్రాణాలు కాపాడుకోగలిగాం. ఉదయం వరద తగ్గిన తర్వాత ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది మమ్మల్ని కాపాడారు. రాత్రి మా దగ్గర లైట్లు ఉండటంతో వారికి సిగ్నల్స్ ఇచ్చాం. దాదాపు కిలోమీటరు కంటే ఎక్కువగానే కొట్టుకుపోయాం" అని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వివరించారు."వరద ఉధృతి పెరిగిన క్రమంలో బోటు పల్టీ కొట్టక ముందే నేను, నా మిత్రుడు దూకేశాం. ఆ నీటి ప్రవాహంలోనే కిలో మీటరు వరకు కొట్టుకెళ్లాం. అక్కడ ఉన్న చెట్లను పట్టుకుని ఉన్నాం. ఉదయం మా కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం వచ్చి రెస్క్యూ చేసింది. దీంతో ప్రాణాలతో బయటపడగలిగాం" అని మరోకరు తెలిపారు

అంతరిక్ష పరిశోధనలకు కేంద్రంగా తెలంగాణ

మాట్లాడుతూ.. నిరుపయోగ శాటిలైట్లను కక్ష్య నుంచి వెనక్కి తేవడం ముఖ్యమన్నారు. దేశంలో తొలిసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ తరహా ప్రయోగం చేపడు తున్నట్లు చెప్పారు. " కాస్మోసర్వ్ కంపెనీ అంతరిక్షం నుంచి వ్యర్థాలు తెచ్చే సాంకేతికతను అభివృద్ధి చేస్తోం ది. హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో స్పేస్ కంపెనీలు పని చేస్తున్నాయి. వీటికి ప్రోత్సహించేందుకు స్పేస్‌టెక్ పాలసీ తీసుకొస్తాం. ఫ్యూచర్ సిటీలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం" అని అన్నారు.



జల సంరక్షణతో పల్లెలకు ఉపాధి భరోసా

పేర్కొన్నారు. నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, భూగర్భజల, విద్యుత్ తదితర సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు.ఉపాధి హామీ పథకాన్ని ప్రధానంగా వినియోగించుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న 60:40 నిధుల నిష్పత్తికి అనుగుణంగా పనులను రూపొందించడంతోపాటు అవసరమైన చోట రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమం అమలుకు అవసరమయ్యే అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు.ఇప్పటికే ఉన్న నీటి వనరుల పునరుద్ధరణ, పునరుజ్జీవమే కార్యక్రమానికి ప్రధాన ప్రాధాన్యంగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. చిన్ననీటి పారుదల చెరువులు, గ్రామాల్లోని కుంటలు, చెరువులకు నీటిని చేర్చే కాలువలు, సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సంప్రదాయ జలసేకరణ నిర్మాణాల పునరుద్ధరణను కూడా ఇందులో భాగం చేయాలన్నారు.దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు, పేరుకుపోయిన పూడిక తొలగింపు, పిచ్చిమొక్కలు, ముళ్లపొదల తొలగింపు, చెరువుల నిర్మాణాల మరమ్మతులు వంటి పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని చెప్పారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకునేలా పనులను ఎంపిక చేయాలని సూచించారు.నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పొలాలకు నీటిని చేర్చే పంటకాలువల నిర్మాణం చేపడితే ప్రస్తుతం ఉన్న సాగునీటి సదుపాయాల వినియోగం గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.చిన్న నదులు, వాగులు, స్థానిక జలప్రవాహాలపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణ అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాల పునర్భరణకు దోహదపడేలా, స్థానికంగా నీటి లభ్యతను పెంచేలా ఈ పనులను పరిశీలించాలని మంత్రి సూచించారు.భూగర్భజలాల పెంపుదల కోసం రాజస్థాన్, మహారాష్ట్రల్లో చేపట్టిన విజయవంతమైన కార్యక్రమాలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ పరిస్థితులకు అనువైన విధానాలను గుర్తించి కార్యాచరణలో పొందుపరచాలని చెప్పారు. భూగర్భజలాల పరిస్థితి, ప్రస్తుతం చేపడుతున్న చర్యలు, భవిష్యత్తు అవసరాలపై సమీక్షించేందుకు జిల్లా స్థాయి భూగర్భజల శాఖ అధికారులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిం చేలా ఈ కార్యక్రమానికి ఆకర్షణీయమైన పేరు సూచించాలని మంత్రి అధికారులను కోరారు. వివిధ శాఖలు చేపట్టే పనులన్నింటినీ ఒకే కార్యక్రమం కింద సమన్వయం చేసేలా ప్రణాళిక రూపొందిం చాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ డి. దివ్య, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, మిషన్ భగీరథ ఈఎన్‌సీ జి. కృపాకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, భూగర్భజల శాఖ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

డీజీపీ సి. వి. ఆనంద్

హైదరాబాద్(జనంసాక్షి):వచ్చే విద్యా సంవత్సరం నుంచే పూర్తిస్థాయిలో అకడమిక్ బ్లాక్‌- ఎ తరగతులు నవంబర్ 05, 2026: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైపీఎస్) అకడమిక్ బ్లాక్‌-1 నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిజిపి సి.వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం మంచిరేవులలో పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పలు పనులకు అనుమతులు ఇస్తూ, ఇతర అంశాల పై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అకడమిక్, మౌలిక సదుపాయాలు, సీఎస్ఆర్ , నియామకాలు, ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన తరగతి గదులతోపాటు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని డిజిపి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధన ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య, నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నారు. పోలీసు కుటుంబాల పిల్లలతోపాటు సాధారణ పౌరుల పిల్లలకూ అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించే ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్



కు భవిష్యత్తులో మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం పాఠశాలలో 345 మంది విద్యార్థులు ఆరవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 720 మంది విద్యార్థులకు ప్రవేశాలు, మొత్తం 1000 మంది విద్యార్థులకు విద్య వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిజిపి సూచించారు.సమావేశంలో డిజిపి సి. వి. ఆనంద్ తోపాటు శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్, ఆక్టోపస్ డిజి అనిల్‌కుమార్, ఐ జి పి ఎల్ గజరావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏజి అడ్మిన్ రమణ కుమార్, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, విశాల్ గోయల్ (అతీతిఎబనీని ఇనీ-ఈనీబీనిటవతీ) జఐఖా ప్రిన్సిపల్ అనితారెడ్డి, జయకుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరాన్‌తో యుద్ధం వల్లే మా ఓటమి..

ఉన్న దౌత్యపరమైన బంధంపై ఓటర్లలో ఉన్న తీవ్ర అసంతృప్తి తమ పార్టీని దెబ్బతీశాయని తెలిపారు. సెనెట్‌ను కోల్పోయినా యుద్ధం చేయడం సరైందే అని ఎవరైనా వాదిస్తే వాదించుకోవచ్చంటూ ట్రంప్‌పై పరోక్షంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. రిపబ్లికన్ పార్టీ ఓటమికి ఇజ్రాయెల్ కూడాఓ కారణమని జేడీ వాన్స్ అభిప్రాయపడ్డారు. ఇరాన్ విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పిన ప్రతి ఒక్కటీ తప్పేనని వాన్స్ ప్రైవేట్ సంభాషణల్లో అన్నట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. వాషింగ్టన్ తన విదేశాంగ విధానాన్ని ఇజ్రాయెల్‌కు తాకట్టు పెట్టకూడదన్నారు. అంతులేని విదేశీ యుద్ధాల్లో అమెరికా తలదూర్చడం సరికాదని వాన్స్ స్పష్టం చేశారు. 2024 ఎన్నికలకు ముందు ట్రంప్ కూడా యుద్ధాల్లో తలదూర్చడం సమంజసం కాదని పేర్కొనడం గమనార్హం.

లాస్ ఏంజెలెస్ మేయర్‌గా.. భారత సంతతి నిత్యా రామన్!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతికి చెందిన మరో మహిళ సత్తా చాటుతున్నారు. లాస్ ఏంజెలెస్ మేయర్ పోటీలో ఉన్న కేరళ మూలాలున్న నిత్యా రామన్ విజయం దిశగా దూసుకెళ్తున్నారు. ప్రస్తుత మేయర్ కరేన్ బాస్‌కి గట్టి పోటీ ఇస్తున్న ఆమె.. సుమారు 26 వేల ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అమెరికాలో రెండో అతిపెద్ద నగరానికి ప్రాతినిధ్యం వహించేందుకు రామన్‌కే ఎక్కువ అవకాశాలున్నాయని అమెరికా మీడియా సంస్థలు అంచనా వేస్తున్నాయి.

నిత్యా రామన్ 1981 జులై 28న కేరళలో జన్మించారు. తండ్రి వెంకటరత్నం ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి.. తల్లి సుధ బ్యాంకు ఉద్యోగి. ఆరేళ్ల వయసున్నప్పుడే తల్లిదండ్రులతో కలిసి నిత్య అమెరికాకు వలస వెళ్లారు. బోస్టన్‌లో పెరిగిన ఆమె.. హార్వర్డ్ యూనివర్సిటీలో బ్యాచిలర్ డిగ్రీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మాస్టర్స్ చేశారు. భర్త వాలీ చంద్రశేఖరన్ స్థానికంగా పేరొందిన టెలివిజన్ రచయిత, ప్రొడ్యూసర్. 2013లో లాస్ ఏంజెలెస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. వీరికి కర్ణ, కావేరి కవల పిల్లలున్నారు. హాలీవుడ్‌లో సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే నిత్య.. భారత్‌లోనూ కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేశారు. 2020లో లాస్ ఏంజెలెస్ సిటీ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన ఆమె.. ఆరేళ్లపాటు సభ్యురాలిగా సేవలందించారు. అందుబాటు ధరలో గృహాల లభ్యత, నిరాశ్రయులు, అద్దెదారుల హక్కులు, పౌరుల భద్రత, నగరంలో మెరుగైన సేవల కోసం కృషి చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తాజా ఎన్నికల్లో సత్తా చాటి లాస్ ఏంజెలెస్‌కు తొలి భారత సంతతి మేయర్‌గా సేవలందించేందుకు సిద్ధమవుతున్నారు.

మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు

ఆసియా గేమ్స్ పారా అథ్లెట్లపై ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):2026 ఆసియా పారా గేమ్స్‌లో భారత పారా అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శనపై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్ 2026లో భారత పారా అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పారా గేమ్స్?లో మన అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శన, ప్రపంచ క్రీడల్లో భారతదేశం ఒక ప్రధాన శక్తిగా ఎదుగుతోందనడానికి ఒక నిదర్శనమని కొనియాడారు. 2010లో ఒక స్వర్ణంతో సహా 14 పతకాలను సాధించిన భారత్?, ఈ ఏడాది ఏకంగా 114 పతకాలను సాధించిందని, ఈ ఘనతకు అథ్లెట్ల అంకితభావం, బలపడిన క్రీడా వ్యవస్థే కారణమని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్? కాంప్లెక్స్?లో పారా అథ్లెట్లతో కలిసి మోదీ ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. పారా గేమ్స్‌లో మహిళా అథ్లెట్ల చూపిన అద్భుత ప్రదర్శన గురించి ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్ నుంచి బరిలోకి దిగిన 56 మంది మహిళా అథ్లెట్లలో 34 మంది పతకాలు గెలుచుకున్నారని కొనియాడారు. అలాగే, క్రీడలకు రెండు నెలల ముందు మరణించిన తన తల్లికి జావెలిన్ త్రోయర్ రింకు తన బంగారు పతకాన్ని అంకితం చేస్తూ భావోద్వేగానికి గురైన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. "ఆసియా పారా గేమ్స్‌కు కేవలం రెండు నెలల ముందు రింకు తన తల్లిని కోల్పోయారు. అంతటి తీవ్రమైన దుఃఖంలో కూడా ఆయన ధైర్యం కోల్పోకుండా, స్వర్ణ పతకం గెలిచినప్పుడు తన తల్లి ఫొటోను చేతిలోకి తీసుకుని ఆ పతకాన్ని ఆమెకు అంకితం చేశారు. ఆ క్షణం దేశంలోని ప్రతి పౌరుడినీ కంటతడి పెట్టించింది" అని మోదీ పేర్కొన్నారు.భారతదేశ క్రీడా వ్యవస్థలో తగినంత వనరులు లేకపోవడం, మద్దతు, పారదర్శకత కొరవడటం వంటి సవాళ్లను ఎదుర్కోవడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపడానికి ఉత్సాహం చూపలేదని పేర్కొన్నారు.

ఇచ్చోడ బైపాస్ జాతీయ రహదారి ఘోర ప్రమాదం

□ వాహనం ఢీకొని 40 మేకలు మృతి



బజార్‌హత్నూర్ / ఇచ్చోడ (జనంసాక్షి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం లోగురువారం రోజునా ఇచ్చోడ బైపాస్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 40 మేకలు మృతి చెందగా, కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి తన జీవనోపాధి కోసం మేకల మందతో ఇక్కడికి వలస వచ్చాడు. ఈ క్రమంలో ఇచ్చోడ బైపాస్ సమీపంలో మేకలను మేపుతూ, వాటిని జాతీయ రహదారి దాటించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం రహదారి దాటుతున్న మేకల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద తీవ్రతకు 40 మేకలు రహదారిపైనే రక్తపు మడుగులో ప్రాణాలు కోల్పోయాయి. అదే సమయంలో మేకలను కాపాడుకునే ప్రయత్నంలో కాపరికి కూడా వాహనం బలంగా తగలడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే స్పందించి రక్తపు మడుగులో పడివున్న క్షతగాత్రుడిని కాపాడి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

□ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టోల్ ఫ్రీ, వాట్సాప్ నంబర్లు

□ మంత్రి దనసరి అనసూయ సీతక్క



ఏటూరునాగారం, నవంబర్ 05(జనంసాక్షి) : గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి విద్యార్థుల సమస్యలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టోల్ ఫ్రీ, వాట్సాప్ నంబర్ల సేవలను మంత్రి ప్రారంభించి, ఆయా నంబర్లతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు తమ సమస్యలను 1800-425-3369 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి లేదా o91 9493368361 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి తెలియజేయవచ్చని మంత్రి తెలిపారు. సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, మంత్రి సూచనలకు అనుగుణంగా విద్యాసంస్థల పనితీరు, విద్యార్థుల సంక్షేమం, ఉపాధ్యాయుల బాధ్యతలు, మౌలిక సదుపాయాల నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, సహాయ గిరిజన అభివృద్ధి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, ఐటీడీఏ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు

□ ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు, అనవసరపు కోతలకు తావివ్వొద్దు

□ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. గురువారం భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని నాగారం, దీక్షకుంట, ఆజంనగర్, పంబాపూర్, కమలాపూర్, నందిగామ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, అక్రమాలకు, అనవసరపు కోతలకు తావులేకుండా ప్రతి రైతుకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, ధాన్యం విక్రయించిన వెంటనే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐకేపీ, పీఏసీఎస్ తదితర కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, తేమ శాతం తదితర నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. మిల్లర్లు సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకుండా రైతులకు సహకరించాలని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటూ, పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, సంక్షేమ పథకాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి వారికి ఎలాంటి నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఓ, డీఎస్ఓ, వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచులు, మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ డీవైఎస్ఓ అరెస్ట్

కంప్యూటర్ ఆపరేటర్‌తో కలిసి వసూలు

□ రూ.3.10 లక్షల క్యాటరింగ్ బిల్లుల చెల్లింపునకు డిమాండ్



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి): రూ.లక్ష లంచం తీసుకుంటూ మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్ఓ) జక్కు రాజశేఖర్‌రెడ్డి, అదే కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ గోరె ఉమేష్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గురువారం ఏసీబీ మహబూబ్‌నగర్ రేంజ్ అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

క్రీడా శాఖ పరిధిలోని వాలీబాల్ అకాడమీ క్రీడాకారులకు 2026 ఆగస్టులో సరఫరా చేసిన ఆహారానికి సంబంధించి రూ.3.10 లక్షల క్యాటరింగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులను ప్రాసెస్ చేసి, చెక్కు మంజూరు చేయడానికి నిందితులు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన అధికారులు, లంచం తీసుకుంటున్న సమయంలో ఇద్దరినీ పట్టుకు న్నారు. డీవైఎస్ఓ రాజశేఖర్‌రెడ్డి నుంచి లంచం సొమ్ము రూ.లక్షను స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్‌తో ముందస్తు ఒప్పందం చేసుకుని ఇద్దరూ కలిసి లంచం వసూలు చేసినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. నిందితులపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు తరలించారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106ను సంప్రదించాలని కోరారు.

వ్యాపారులను బెదిరిస్తున్న కేటీఆర్

ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ విమర్శలు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రియల్ ఎస్టేట్ వ్యాపారులను డబ్బుల కోసం బెదిరిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ఆరోపించారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులు, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసేలా కేటీఆర్ బృందం వ్యవహరిస్తోందని విమర్శించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ తొలుత ఓ అంశంపై సామాజిక మాధ్యమాల్లో స్పందించడం, ఆ తర్వాత ఆయనకు అనుకూలమైన సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం పరిపాటిగా మారిందన్నారు. జేవీ రావుకు చెందిన ఎస్ఏఎస్ కంపెనీ విషయంలోనూ ఇదే జరిగిందని పేర్కొన్నారు. 2018లో కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడే ఆ సంస్థకు అనుమతులు ఇచ్చారని, బీఆర్ఎస్ నేతలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రావుకు ఆ సంస్థల్లో వాటాలున్నాయని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలు, వరంగల్ రైతు గర్జన సభ కోసం జేవీ రావును డబ్బులు అడిగారని, ఇవ్వకపోవడంతో బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. తన ఆరోపణలకు ఆధారాలున్నాయని, కేటీఆర్ సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. బీజేపీకి బీఆర్ఎస్ అండగా నిలుస్తోందని, రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. బాధితులు ఫిర్యాదు చేస్తే ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

ఎన్నికల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

□ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల బకాయిలు చెల్లించండి

□ సీఈఓను కోరిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో వివిధ ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి కోరారు. తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికలు-2023, లోక్‌సభ ఎన్నికలు-2024 సందర్భంగా రిటర్నింగ్ , సహాయ రిటర్నింగ్ అధికారులుగా చేసిన వ్యయాలు, కేటాయించిన బడ్జెట్‌ను మించిపోయాయని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి గుర్తు చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అదనపు బడ్జెట్ మంజూరు చేయాలని కోరారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రతినిధులు కలిసి ఎన్నికలకు సంబంధించిన పెండింగ్, అదనపు బిల్లులను మంజూరు చేయాలని వినతి పత్రం అందచేశారు. ఎన్నికల సమయంలో వివిధ ఖాతాల కింద కేటాయించిన బడ్జెట్ సరిపోకపోవడంతో పలు అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో అదనపు ఖర్చులు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ ఖర్చులను అప్పుల రూపంలో సమకూర్చుకోవాల్సి వచ్చిందని, సంబంధిత బిల్లుల చెల్లింపులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. బకాయిల చెల్లింపుల కోసం కొందరు రుణం ఇచ్చినవారు కోర్టులను ఆశ్రయించగా, మరికొందరు అప్పటి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, నివాసాలకు వెళ్లి ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాలు అధికారులకు ఇబ్బందికరంగా మారడమే కాకుండా వారి గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అదనపు బడ్జెట్ మంజూరు కోసం సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించినప్పటికీ, అవి వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా లేఖలో ప్రస్తావించారు. ఎన్నికల నిర్వహణలో చేసిన అదనపు వ్యయాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను తక్షణమే పరిశీలించి, అదనపు బడ్జెట్‌ను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం నాయకులు శకుంతల, లావణ్య, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, మహిళా అధ్యక్షురాలు రాధ, శ్రీకాంత్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ మహిళలకు ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగావకాశాలు

□ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్

□ తెలంగాణ మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్‌లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన మహిళలు ఈ ఉద్యోగాలకు అర్హులని, పదో తరగతి, ఇంటర్మీడియట్ లేదా నాన్‌టెక్నికల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అసెంబ్లీ హెల్పర్స్, వేర్‌హౌస్ ఆపరేషన్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.ఎంపికైన వారికి నెలకు రూ.20,283 స్థూల వేతనం, కోతల అనంతరం రూ.17,833 నికర వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అదనంగా రూ.1,500 వరకు హాజరు బోనస్, నెలకు రూ.2,000 చెల్లింపుతో వసతి, ప్రతిరోజూ రెండు ఉచిత భోజనాలు, ఏసీ బస్సు రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు తెలి పారు. రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, వారానికి ఆరు రోజుల పని, ఒకరోజు సెలవు ఉంటుందని వివరించారు. నవంబర్ 6, 7 తేదీల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళలు అవసరమైన ధ్రువపత్రాలతో హైదరాబాద్ నాంపల్లి వద్ద గల మైనారిటీ స్టడీ సర్కిల్ నందు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8520860785, 6305385949 నంబర్లకు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని,placementdrive@tgmsccc.comకు ఈ-మెయిల్ చేయాలని లేదా tgminoritiesstudycircle.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రూ:15 లక్షల విలువగల బంగారం, వెండి చోరీ నిందితుల అరెస్టు

□ మల్లికి చెందిన ముగ్గురి నిందితులను జైలుకు తరలింపు





న్యాల్‌కల్, నవంబర్ 05 (జనంసాక్షి) : 7.8 తులాల బంగారం,13.1 తులాల వెండి, రూ:60000 నగదుతో చోరీకి పాల్పడ్డ దుండగులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. దాదాపు రూ:12 లక్షల విలువగల బంగారం, రూ:3 లక్షల విలువగల వెండితో పాటు రూ:60000 నగదుతో పరారయ్యారు. ఈ చోరీ సంఘటన ఈనెల 20న రాత్రి సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మల్లీ గ్రామానికి చెందిన బాధితుడు బసవరాజు ఇంట్లో చోటు చేసుకుంది. అవటి బసప్ప ఫిర్యాదు మేరకు హద్నూర్ ఎస్సై కేసు నమోదు చేశారు. చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు త్వరితగతిలో చోరీ నిందితులను అదుపులో తీసుకోవడంలో సఫలీకృతమయ్యారు. ఎస్సై సుజిత్, పోలీస్ సిబ్బంది మహేష్, శ్రీకాంత్, రాజశేఖర్, సాయికిరణ్, అశోకుల బృందం ముమ్మర గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు ఈ నెల 4న విశ్వసినీయ సమాచారం మేరకు ఎస్సై, పోలీస్ బృందంతో కలిసి చోరీ చోటు చేసుకున్న గ్రామ శివారులో ముమ్మర తనిఖీలు కొనసాగిస్తుండగా.. ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదం, అతివేగంతో వెళ్తు.. పోలీస్ బృందాన్ని చూసి పారి పోతుండగా, అనుమానం వచ్చిన పోలీస్ బృందం వారిని వెంబడించి పట్టుకొని విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పవన్, హుస్సేన్, గుండప్పలను అదుపులో తీసుకొని విచారణ చేపట్టారు. ఈనెల 20న రాత్రి, బసవరాజ్ ఇంట్లో చోరీకి పాల్పడ్డది మేమేనని పోలీసుల ముందు అంగీకరించారు. దొంగలించిన బంగారం, వెండిని బీదర్ లో అమ్మకాలు చేపట్టేందుకు వెళుతుండగా.. వారి దగ్గర నుండి బంగారం, వెండి, నగదుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్సై సుజిత్ తెలిపారు. చోరీకి పాల్పడ్డ దుండగుల్లో ఇద్దరు వివాహితులు అవ్వగా.. ఒకరు అవివాహితుడు. చోరీ నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ బృందాన్ని ఎస్సై అభినందించారు.

చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలి

□ ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

□ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో నవంబర్ 05 (జనంసాక్షి) : చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాల వారీగా చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా జరగాలని, ఎక్కడా నీటి సమస్య రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని బోరుబావుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. జిల్లాలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు, పూర్తయినవి, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను ఈ సందర్భంగా సమీక్షించారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, సందీప్, అనిల్, డిఈఓ భోజన్న, హౌసింగ్ పిడి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
6 నవంబర్ 2026

సంపాదకీయం

అక్రమ నిర్బంధాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

అరెస్టు చేసిన సమయం కాదు.. పోలీసులు అదుపులోకి తీసుకున్న క్షణమే 24 గంటల గడువు మొదలవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన ఈ తీర్పు పౌర హక్కుల పరిరక్షణలో కీలకమైనది. పోలీసుల అక్రమ నిర్బంధాలకు అడ్డుకట్ట వేయడానికి ఇది గట్టి హెచ్చరిక. అయితే ఆచరణలో ఈ తీర్పు ఎంతవరకు అమలవుతుందన్నదే ప్రశ్న.

త్రిపురలో మాదకద్రవ్యాల కేసులో ఒక వ్యక్తిని పోలీసులు సెప్టెంబర్ 29న అదుపులోకి తీసుకున్నారు. కానీ సెప్టెంబర్ 30న అరెస్టు చేసినట్లు రికార్డుల్లో చూపించి, ఆ తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే 24 గంటల గడువు లెక్కించాలని తేల్చిచెప్పింది. కోర్టుకు ప్రయాణ సమయాన్ని కూడా మినహాయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అంటే అరెస్టు సమయాన్ని మార్చి చూపించి చట్టాన్ని తప్పించుకునే అవకాశం లేదని హెచ్చరించింది.

ఈ తీర్పు అవసరం కావడమే మన వ్యవస్థలోని వైఫల్యానికి నిదర్శనం. దేశంలో ప్రశ్నించే గొంతులే తరచూ పోలీసుల లక్ష్యంగా మారుతున్నాయి. ప్రజా ఉద్యమకారులు, రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, హక్కుల కార్యకర్తలను అధికారిక అరెస్టు లేకుండానే రోజుల తరబడి నిర్బంధిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కుటుంబాలకు సమాచారం ఉండదు. న్యాయవాదులకు అవకాశం ఉండదు. కోర్టు ముందు హాజరు ఉండదు. చివరకు తమవారి ఆచూకీ కోసం కుటుంబాలు హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేయాల్సి వస్తోంది.

హెబియస్ కార్పస్ విచారణలోనే అక్రమ నిర్బంధాల అసలు స్వరూపం బయటపడుతోంది. కొందరు తీవ్రంగా బలహీనపడి, మరికొందరు శరీరమంతా గాయాలతో కోర్టు ముందుకు వస్తున్నారు. కొందరికి సంకెళ్లు వేసి తీసుకొస్తున్నారు. నిర్బంధంలో చిత్రహింసలు, కస్టడీ మరణాలు కొనసాగుతుండటం పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం ఎంత బలహీనంగా ఉందో చూపుతోంది.

రాజ్యాంగంలోని 22వ అధికరణం అరెస్టయిన వ్యక్తికి 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరయ్యే హక్కును కల్పించింది. ఇది పోలీసులపై నియంత్రణ కోసం ఏర్పాటైన రాజ్యాంగ రక్షణ. కానీ అధికారిక అరెస్టుకు ముందు నుంచే వ్యక్తులను అదుపులో ఉంచుకోవడం, ఆ సమయాన్ని రికార్డుల్లో దాచడం ద్వారా కొందరు అధికారులు ఈ హక్కును నిర్వీర్యం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి.

అయితే తీర్పులతోనే పోలీసుల తీరు మారదు. డి.కె. బసు మార్గదర్శకాలు ఉన్నా కస్టడీ హింస ఆగలేదు. ఇప్పుడు తాజా తీర్పును అమలు చేయడంలోనూ నిర్లక్ష్యం జరిగితే దాని ప్రయోజనం శూన్యం. అదుపులోకి తీసుకున్న సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలి. మేజిస్ట్రేట్లు పోలీసుల రికార్డులనే నమ్మకుండా నిందితుడిని నేరుగా ప్రశ్నించాలి. తప్పుడు రికార్డులు సృష్టించే అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలి. అక్రమ నిర్బంధ బాధితులకు పరిహారం అందించాలి.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదు. పోలీసులకు అధికారం ఉందని పౌరుల హక్కులను కాలరాయడానికి వీల్లేదు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తే ప్రజలకు రక్షణ ఎక్కడ?

సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఇప్పుడు బాధ్యత పోలీసు శాఖది, ప్రభుత్వాలది, న్యాయవ్యవస్థది. అరెస్టు సమయాన్ని మార్చి చూపించి అక్రమ నిర్బంధాన్ని కప్పిపుచ్చే రోజులు ముగియాలి. తీర్పు కాగితాలకే పరిమితం కాకుండా పోలీస్ స్టేషన్లలో అమలైనప్పుడే పౌర హక్కులకు నిజమైన రక్షణ లభిస్తుంది.

రాజ్యాంగ విలువలు, పౌర స్పృహ ముందు బోర్లాపడిన డొనాల్డ్ ట్రంప్!

సమకాలీన ప్రపంచ రాజకీయాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన విధానాలు, ఆయన ప్రదర్శించిన శైలి ఎల్లప్పుడూ సంచలనాలకే కాక తీవ్ర వివాదాలకు కూడా కేంద్ర బిందువుగా నిలిచాయి. సంప్రదాయ రాజకీయ చట్రాలను బద్దలు కొడుతూ, ప్రజాకర్షక నినాదాలతో ఉద్భవించిన ట్రంప్ రాజకీయ శకం అంతిమంగా ప్రజాతీర్పు ముందు విఫలమవడం అంతర్జాతీ య రాజకీయ విశ్లేషకులను ఆకర్షిస్తున్న కీలక అంశం. అమెరికన్ పొలిటికల్ స్పెక్ట్రమ్‌లో ట్రంప్, ఆయన ప్రాతినిధ్యం వహించిన రిపబ్లికన్ పార్టీ తీవ్రమైన ఎదురుదెబ్బలు తినడానికి, అధికార పీఠాన్ని కోల్పోవడానికి వెనుక కేవలం ఏదో ఒక తక్షణ పరిణామం మాత్రమే కారణం కాదు. దాని వెనుక దీర్ఘకాలికంగా పేరుకుపోయి న ఆర్థిక అసంతృప్తి, పౌర హక్కుల విధ్వంసం, రాజ్యాంగ వ్యవస్థల పట్ల వ్యక్తమైన ఉదాసీనత, ఏకపక్ష విదేశాంగ ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

డొనాల్డ్ ట్రంప్ రాజకీయ ప్రయాణం అంతా "అమెరికా ఫస్ట్" అనే భావోద్వేగపూరిత నినాదం చుట్టూనే తిరిగింది. అమెరికన్ శ్రామిక వర్గానికి మళ్లీ పాత వైభవాన్ని తీసుకువస్తానని, దేశ సరిహద్దులను కట్టుదిట్టం చేసి అక్రమ వలసదారుల నడుము విరుస్తానని, ఇతర దేశాల నుంచి భారీ పెట్టుబడులను రప్పించి స్థానికులకు కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తానని ఆయన ఇచ్చిన హామీలు నాటి ఎన్నికలలో అమెరికన్ సామాన్యుడిని ఆకట్టుకున్నాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ఆచరణలో పెట్టేందుకు ఆయన ఎంచుకున్న మార్గాలు దేశీయంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి.

సరిహద్దు భద్రత, ఇమ్మిగ్రేషన్ నిరోధక చర్యల పేరుతో దేశంలోని ప్రధాన నగరాల్లో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ICE) వంటి ఫెడరల్ వ్యవస్థలను విచ్చలవిడిగా రంగంలోకి దించారు. ఇది అక్రమ వలసదారులను అడ్డుకోవడానికి బదులుగా, దశాబ్దాలుగా అక్కడే నివసిస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్న సాధారణ ప్రజల్లో, ముఖ్యంగా ఆఫ్రో-అమెరికన్, హిస్పానిక్ మైనారిటీ వర్గాలలో తీవ్రమైన భయాందోళనలను, అభద్రతా భావాన్ని కలిగించింది. సాయుధ బలగాలు నగర వీధుల్లో మోహరించడం పౌర స్వేచ్ఛకు, అమెరికా రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులకు భంగకరంగా పరిణమించింది. అదే సమయంలో, ప్రపంచవ్యాప్తంగా వ్యాపార వేత్తలను, విదేశీ ప్రభుత్వాలను ఒత్తిడి చేసి అమెరికాలో పెట్టుబడులు పెట్టించేలా చేసినప్పటికీ, ఆ పెట్టుబడులు తక్షణమే దిగువ స్థాయి శ్రామిక వర్గానికి ఉపాధి అవకాశాలుగా మారలేకపోయాయి. సాంకేతిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి పునాది కార్యక్రమాలను విస్మరించి కేవలం కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇవ్వడం వల్ల నిజమైన శ్రామికులకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. నినాదాలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య ఏర్పడిన ఈ అగాధం ట్రంప్ ఓటు బ్యాంకును ప్రాథమికంగానే దెబ్బతీసింది.

సామాన్యుడిపై ఆర్థిక భారం, పెరిగిన ద్రవ్యోల్బణం

ఏ దేశంలోనైనా ఓటరు ప్రభుత్వాన్ని అంచనా వేసే ప్రధాన కొలమానం తన రోజువారీ జీవితంలోని ఆర్థిక స్థితిగతులే. ట్రంప్ హయాంలో తీసుకున్న కొన్ని వివాదాస్పద ఆర్థిక నిర్ణయాలు, సంరక్షణవాద (గ్రతీశీవవ్‌ఱశీఅఱర) వాణిజ్య విధానాలు చివరికి అమెరికన్ సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై విపరీతమైన సుంకాలు (ఖీఅటటం) విధించడం ద్వారా అమెరికా ఉత్పత్తులను ప్రోత్సహించాలని చూసినప్పటికీ, అది అంతిమంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటేలా చేసింది. వంటగ్యాస్ ధరలు, నిత్యావసర సరుకులు, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు నిత్య జీవితంలో ఊపిరాడని ఆర్థిక ఒత్తిడికి గురయ్యారు. కార్పొరేట్ కంపెనీలకు, అతిపెద్ద ధనవంతులకు పన్ను రాయితీలు కల్పిస్తూ, సామాన్యుడి జేబుకు చిల్లులు పొడిచే విధానాలను అనుసరించారనే విమర్శలు తీవ్రమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించే గణాంకాలకు, సామాన్యుడు రోజువారీ మార్కెట్‌లో ఎదుర్కొంటున్న ధరల మంటకు పొంతన లేకపోవడంతో శ్రామిక వర్గం, నిరుద్యోగ యువత, స్థానిక వ్యాపారులు రిపబ్లికన్ పాలన పట్ల తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ ద్రవ్యోల్బణ వ్యతిరేక అలలు ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థుల ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచాయి.



శాంతికి విఘాతం కలిగించిన ఏకపక్ష విదేశాంగ ధోరణులు

అమెరికన్ సమాజం ఎప్పుడూ కూడా తమ పన్నుల సొమ్మును, తమ దేశ సైనికుల ప్రాణాలను విదేశీ యుద్ధాలలో బలిపెట్టడాన్ని నిరసిస్తూనే ఉంటుంది. విదేశీ రణరంగాల నుంచి తమ సైన్యాన్ని వెనక్కి రప్పిస్తానని, "శాశ్వత యుద్ధాలకు" స్వస్తి పలుకుతానని ప్రచారం చేసుకున్న ట్రంప్, తన పాలనా కాలంలో దానికి పూర్తి భిన్నమైన రీతిలో ప్రవర్తించారు.

మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో, ముఖ్యంగా ఇరాన్ వంటి దేశాలతో అనవసర సైనిక ఉద్రిక్తతలను పెంచడం, కాంగ్రెస్ (అమెరికన్ పార్లమెంట్) అనుమతి లేకుండా ఏకపక్షంగా క్షిపణి దాడులు, సైనిక చర్యలకు ఆదేశించడం అమెరికన్ విదేశాంగ విధానంలోని నిలకడ లేమిని ఎత్తిచూపింది. ఈ ఏకపక్ష నిర్ణయాలు అంతర్జాతీయంగా ఇంధన ధరల పెరుగుదలకు కారణమవ్వడమే కాకుండా, అమెరికాను మరో సుదీర్ఘమైన అనవసర యుద్ధంలోకి నెట్టివేస్తున్నాయనే భయాన్ని ప్రజల్లో కలిగిస్తాయి. దౌత్యపరమైన సంప్రదింపులను పక్కనపెట్టి దూకుడు వైఖరిని ప్రదర్శించడం వల్ల అంతర్జాతీయంగా అమెరికా విశ్వసనీయత దెబ్బతిన్నదని, దేశీయంగా భద్రత క్షీణించిందని ఓటర్లు భావించారు.

వ్యవస్థల నిర్వీర్యం, ప్రజాస్వామ్య విలువల పతనం

డొనాల్డ్ ట్రంప్ పాలనా శైలిలో అత్యంత తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్న అంశం అమెరికా చట్టబద్ధమైన రాజ్యాంగ వ్యవస్థలను చులకన చేయడం. ప్రజాస్వామ్యంలో కీలకమైన శాసన సభలు, స్వతంత్ర న్యాయస్థానాలు, నిఘా వ్యవస్థలు తన వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాలకు లోబడి పనిచేయాలని ఆయన భావించడం తీవ్ర దుమారాన్ని రేపింది. భిన్నాభిప్రాయాలను ఏమాత్రం సహించకపోవడం, తన విధానాలను ప్రశ్నించే స్వపక్ష నేతలను లేదా అధికారులను బహిరంగంగా అవమానించడం వంటి చర్యలు అమెరికన్ డెమొక్రసీకి ముప్పుగా పరిణమించాయి.

అధికారాన్ని తన చేతిలోనే కేంద్రీకృతం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలు, రాజ్యాంగబద్ధమైన 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' (అధికార సమతుల్యత) వ్యవస్థను దెబ్బతీయడం పట్ల అమెరికాలోని విద్యావంతులు, మేధావులు, పౌర సమాజం తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. దేశంలో అవినీతి పెరిగిపోతోందని, ఫెడరల్ నిర్ణయాలు ప్రజాసంక్షేమం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగపడుతున్నాయని ప్రజలు విశ్వసించారు.

సమాజంలో పెరుగుతున్న వైవిధ్యం, మారిన జనాభా సమీకరణాలు

అమెరికా జనాభా స్వరూపం రోజురోజుకూ వేగంగా మారుతోంది. ఆఫ్రో-అమెరికన్లు, హిస్పానిక్కు, ఆసియన్లు, ఇతర వలస వర్గాల సంఖ్య పెరగడమే కాకుండా, పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులైన యువ ఓటర్ల సంఖ్య పెరిగింది. అయితే ట్రంప్ రాజకీయాలు ఎప్పుడూ తెల్లజాతి శ్రామిక వర్గం (White Working-class), సంప్రదాయవాదుల చుట్టూనే కేంద్రీకృతమయ్యాయి. అమెరికన్ సమాజంలోని వైవిధ్యాన్ని గౌరవించకపోవడం, వర్ణ వివక్ష పూరిత వ్యాఖ్యలు, శ్వేతజాతి ఆధిపత్య ధోరణులకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో మద్దతు ఇవ్వడం వల్ల యువత, మహిళలు, మైనారిటీలు ఆయనకు పూర్తిగా దూరమయ్యారు. ముఖ్యంగా 30 ఏళ్లలోపు ఉన్న యువ ఓటర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ట్రంప్ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించడంలో ట్రంప్, ఆయన పార్టీ విఫలం కావడం వారి ఓటమిని స్పష్టం చేసింది.

విపక్షాల ఐక్యత, వ్యూహాత్మక ప్రజా సమీకరణ

డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన ఏకపక్ష వైఖరి ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీకి ఒక పెద్ద అవకాశంగా మారింది. ట్రంప్ నుంచి ఎదురవుతున్న రాజ్యాంగ ముప్పును ఎదుర్కొనేందుకు డెమొక్రాట్లు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నియోజకవర్గాల్లో ప్రత్యర్థుల పట్టును తగ్గించేందుకు రిపబ్లికన్లు చేసిన ప్రయత్నాలను దాటుకుంటూ, డెమొక్రాట్లు క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించడంలో విజయం సాధించారు. అధికారం ఒక్కరి చేతిలోనే ఉంటే దేశ ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందనే సందేశాన్ని డెమొక్రాట్లు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. ఫలితంగా, స్వతంత్ర ఓటర్లు, రిపబ్లికన్ పార్టీలోని మితవాద విభాగాలు కూడా అధికారంలో సమతుల్యత కోసం విపక్ష అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. పర్యవసానంగా, ప్రతిపక్షాలు ప్రతిష్టాత్మక స్థానాలను గెలుచుకుని అధికార పీఠాన్ని కైవసం చేసుకున్నాయి.

అమెరికా ప్రజాస్వామ్యంపై ట్రంపిజం చూపిన సుదీర్ఘ ప్రభావం

డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయన ప్రవేశపెట్టిన "ట్రంపిజం" అనే రాజకీయ సిద్ధాంతం అమెరికా సమాజంపై, అక్కడి పరిపాలనా వ్యవస్థలపై చెరిగిపోని ముద్ర వేసింది. సంప్రదాయ రాజకీయాల్లో ఉన్న హుందాతనాన్ని, రాజ్యాంగపరమైన నిబంధనలను ధిక్కరించడమే ఒక రాజకీయ వ్యూహంగా మార్చుకోవడం ట్రంప్ శైలిలోని ప్రధానమైన అంశం. ఇది కేవలం ఒక వ్యక్తి పాలన మాత్రమే కాకుండా, అమెరికన్ సమాజంలో దశాబ్దాలుగా ఉన్న సామాజిక విచ్ఛిన్నతను, భావజాల పూరిత విభజనను ప్రపంచానికి స్పష్టంగా చూపించింది.

1. వాణిజ్య యుద్ధాలు, గ్లోబల్ సప్లై చైన్ చిన్నాభిన్నం

ట్రంప్ అనుసరించిన సంరక్షణవాద వాణిజ్య విధానాలు కేవలం అమెరికా అంతర్గత మార్కెట్‌కే పరిమితం కాలేదు. చైనా, ఐరోపా సమాఖ్య , మెక్సికో, కెనడా, చివరికి భారతదేశం వంటి భాగస్వామ్య దేశాలపై కూడా అధిక సుంకాలు విధిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ వ్యాపార రంగాన్ని తీవ్ర అస్థిరతకు గురిచేస్తాయి. అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటి ప్రపంచ నియంత్రణ వ్యవస్థలను పక్కనపెట్టి, ద్వైపాక్షిక ఒత్తిళ్లకు దిగడం వల్ల ప్రపంచ సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతిన్నది. ఫలితంగా అమెరికన్ తయారీ రంగం ఆశించిన స్థాయిలో పుంజుకోకపోగా, అమెరికాలోని రైతు వర్గం, ఆటోమొబైల్ పరిశ్రమ తీవ్ర నష్టాలను చవిచూశాయి. విదేశీ మార్కెట్లలో అమెరికా ఉత్పత్తులపై ప్రతికార సుంకాలు పడటంతో, అమెరికా వ్యవసాయ ఎగుమతులు దారుణంగా పడిపోయాయి. దీనికి పరిహారంగా ప్రభుత్వం బిలియన్ల కొద్దీ డాలర్ల రాయితీలను రైతులకు ప్రకటించాల్సి వచ్చింది, ఇది చివరకు పన్ను చెల్లింపుదారుల సొమ్ముపై తీవ్ర భారంగా మారింది.

2. పర్యావరణ పరిరక్షణ పట్ల నిర్లక్ష్యం, పారిస్ ఒప్పందం నుంచి నిష్క్రమణ

ట్రంప్ పాలనలో జరిగిన మరొక తీవ్రమైన నష్టం పర్యావరణ రక్షణ రంగంలో చోటుచేసుకుంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు అయిన వాతావరణ మార్పులను ఒక కల్పిత కథగా కొట్టిపారేస్తూ, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికాను ఏకపక్షంగా తొలగించడం అంతర్జాతీయ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. శిలాజ ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించడం, బొగ్గు, చమురు పరిశ్రమలపై ఉన్న పర్యావరణ నిబంధనలను ఎత్తివేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో అమెరికా వహించాల్సిన నాయకత్వ పాత్రను ఆయన నీరుగార్చారు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

రాజ్యాంగ సమానత్వమే నల్ల నర్సింహులు పోరాటానికి నిజమైన నివాళి!

తప్పిన ప్రాణాపాయం

1949 ఫిబ్రవరి 26న పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో గునుగుంట్ల వీరయ్య ఇంట్లో ఉన్న దర్శ్యా నాయక్, నర్సింహులును మంచుప్పుల క్యాంపునకు చెందిన మిలటరీ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి సైనిక బెటాలియన్ కార్యాలయానికి తరలించారు. ఫిబ్రవరి 27న కేంద్ర హోంశాఖ ద్వారా అందిన ఆదేశాల మేరకు పట్టుబడిన కమ్యూనిస్టులను కాల్చిచంపాలని కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ప్రకటించినట్లు చారిత్రక కథనాల్లో ఉంది. అయితే ఫిబ్రవరి 26నే అరెస్టయిన నర్సింహులుకు ఆ ఉత్తర్వు వర్తించదని సైనిక అధికారులు భావించడంతో ఆయనను కాల్చిచంపలేదు. మార్చి 2న జనగాం పోలీసులకు అప్పగించారు. జనగాం తాలూకాకు చెందిన కొంతమంది భూస్వాములు రూ.10 వేలు వసూలు చేసి ఉన్నతాధికారికి లంచంగా అందజేసి నర్సింహులును చంపాలని ప్రాధేయపడ్డారు. లాకప్‌లో నిర్బంధించినప్పటికీ నర్సింహులును చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోలీసులు లాఠీచార్జి చేసినా ప్రజలను అదుపు చేయలేకపోయారు. ప్రజల్లో ఆయనకున్న ఆదరణను చూసి పోలీసులు నర్సింహులును చంపే సాహసం చేయలేదు. అయితే ఆయనను అన్ని రకాల చిత్రహింసలకు గురిచేశారు. అనంతరం నల్లగొండ జైలుకు తరలించారు. అక్కడ కూడా ఆయనను చంపాలని కలెక్టర్ జోగప్ప నిర్ణయించినట్లు చెబుతారు. అయితే ఎస్పీ ధనరాజు అందుకు అంగీకరించకపోవడంతో మరోసారి ఆయనకు ప్రాణాపాయం తప్పింది.

మూడు కేసుల్లో ఉరిశిక్షలు


అరెస్టయిన నల్లా నర్సింహులును నల్లగొండ, హైదరాబాద్ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా సెంట్రల్ జైళ్లకు తరలించారు. అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా, జైలు నుంచి తప్పించుకున్న ఖైదీగా ముద్రవేసి ఆయన కాళ్లకు గొలుసులు, ఇనుప కడ్డీలు వేశారు. అయినప్పటికీ అవేవీ ఆయన పోరాట స్ఫూర్తిని అణచలేకపోయాయి. జైళ్లలో కనీస సౌకర్యాల కోసం ఆందోళనలు నిర్వహించి వాటిని సాధించుకున్నారు. ఆయనపై నాలుగు కేసుల్లో విచారణ జరిపారు. ఒక కేసులో మూడేళ్ల జైలు శిక్ష, మిగతా మూడు కేసుల్లో ఉరిశిక్షలు ఖరారయ్యాయి.

జైలులో ఎర్రజెండా ఎగురవేత

జైలు గోడల మధ్య కూడా నర్సింహులు విప్లవ స్ఫూర్తిని వదులుకోలేదు. చైనా విప్లవ విజయోత్సవ సభను జైలులోనే నిర్వహించారు. ఎర్రటి వస్త్రంపై సున్నంతో సుత్తి, కొడవలి గుర్తు గీసి ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ ఘటనతో జైలు అధికారులు ఉలిక్కిపడ్డారు. జెండాను తొలగించేందుకు ప్రయత్నించగా ఖైదీలు తీవ్రంగా ప్రతిఘటించారు. వారి పట్టుదలను చూసి అధికారులు బిత్తరపోయారు. చివరకు ఎర్రజెండాను ముట్టుకునే సాహసం చేయలేకపోయారు.

12 మంది విప్లవకారుల ఉరిశిక్షల నిలుపుదల

1950 జనవరి 22, 23 తేదీల్లో 12 మంది విప్లవకారులను ఉరితీయడానికి అధికారులు ప్రయత్నిస్తున్న విషయం నర్సింహులు బయటకు చేరవేశారు. హైకోర్టుకు విచారణ నిమిత్తం వెళ్లిన సందర్భంలో ఒక కానిస్టేబుల్ ద్వారా పార్టీ నాయకులు ఎస్వీకే ప్రసాద్, దేవులపల్లి వెంకటేశ్వరరావులకు ఆ 12 మంది పేర్లతో సహా సమాచారాన్ని చేరవేశారు. ఈ సమాచారం బొంబాయి ట్రేడ్ యూనియన్ నాయకులకు, బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ నాయకులకు చేరింది. దీంతో ఉరిశిక్షలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనలు, పోరాటాలు, నిరసనలు వెల్లువెత్తాయి. ఫలితంగా ఉరిశిక్షలు అమలు కావడానికి కేవలం 12 గంటల ముందు ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. 12 మంది విప్లవకారుల ప్రాణాలు కాపాడటంలో నర్సింహులు పోషించిన పాత్ర చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది.



హైకోర్టు నుంచి పరారీ

1950 మే 3న విచారణ నిమిత్తం హైకోర్టుకు తీసుకొచ్చిన నర్సింహులు మరో కామ్రేడ్‌తో కలిసి అక్కడి నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనతో ఆనాటి ముఖ్యమంత్రి వెల్లోడి స్వయంగా స్పందించారు. వందమందికి పైగా పోలీసు బలగాలు, ఉన్నతాధికారులు హైకోర్టును సందర్శించి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నల్లా నర్సింహులు తప్పించుకున్న తీరుపై ఆరా తీశారు. ఈ ఘటనకు సంబంధించి 30 మందిని బాధ్యులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు.

టైగర్ ఆఫ్ ది తెలంగాణ

నల్లగొండ జిల్లా ఎస్పీ ధనరాజు జైలులో సైనిక గవర్నర్ జె.ఎస్. చౌదరికి నర్సింహులును పరిచయం చేస్తూ 'టైగర్ ఆఫ్ ది తెలంగాణ'గా అభివర్ణించారు. దీంతో నర్సింహులు గురించి సైనిక గవర్నర్ ప్రత్యేకంగా వివరాలు అడిగి తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఆయనను 'టైగర్ ఆఫ్ ది తెలంగాణ'గా పిలుచుకోవడం విశేషం.

వడ్లకొండలో అరెస్టు

హైకోర్టు నుంచి తప్పించుకున్న నర్సింహులు నల్లమల అడవుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. అనేకమంది ముఖ్య నాయకులతో కలిసి పోరాటాలను నిర్మించారు. ఆయన భార్య నల్లా వజ్రమ్మ కూడా సాయుధ పోరాటంలో పాల్గొని అజ్ఞాత జీవితం గడిపారు. నల్లమల అడవుల నుంచి తిరిగి జనగాం ప్రాంతానికి వచ్చిన నర్సింహులు 1955 మార్చి 5న స్థానిక నాయకులు ఏసిరెడ్డి నరసింహారెడ్డి, ముకుందారెడ్డితో కలిసి వడ్లకొండ గ్రామంలో పోలీసులకు పట్టుబడ్డారు. అరెస్టు చేసిన పోలీసులు జనగాం నుంచి సికింద్రాబాద్‌కు తరలించారు. నర్సింహులు విడుదల కోసం హైకోర్టులో బొంబాయికి చెందిన న్యాయవాదులు డేనియల్ లతీఫ్, గణేశ్‌తో పాటు పుచ్చలపల్లి సుందరయ్య తీవ్రంగా కృషి చేశారు. మూడు కేసుల్లో రెండు కేసులను రద్దు చేసినప్పటికీ ఒక కేసులో ఉరిశిక్ష ఖరారైంది. ఈ కేసులో సుప్రీంకోర్టుకు అప్పీలు చేయగా, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

ఉరిశిక్ష రద్దు.. విడుదల

దాదాపు ఏడాది తర్వాత బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం నర్సింహులుకు విధించిన ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్వయంగా జామీను ఇచ్చి నర్సింహులును పెరోల్‌పై విడుదల చేయించారు. సుమారు మూడు సంవత్సరాల జైలు జీవితం తర్వాత ఆయన బయటకు వచ్చారు. 1959 జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నర్సింహులు విడుదలయ్యారు. ఆయనకు విధించిన 23 ఏళ్ల 15 రోజుల జైలు శిక్ష రద్దయింది. 67 ఏళ్లు జీవించిన ఈ ఆదర్శమూర్తి తన జీవితంలో దాదాపు 50 ఏళ్లపాటు ఉద్యమ జీవితాన్నే ఆచరించారు. విప్లవాగ్ని నల్లా నర్సింహులు 1993 నవంబర్ 5న తుదిశ్వాస విడిచారు.

నల్లా నర్సింహులు జీవితం ఒక వ్యక్తి సాహసగాథ మాత్రమే కాదు. భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరీకి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ పల్లెల్లో రగిలిన తిరుగుబాటు చరిత్ర. ప్రజల విముక్తి కోసం జీవితాన్ని అంకితం చేసిన విప్లవకారుడి పోరాట ప్రస్థానం. ఉరిశిక్షలు, జైలు గోడలు, సంకెళ్లు, చిత్రహింసలు ఆయన సంకల్పాన్ని ఏమాత్రం బలహీన పరచలేకపోయాయి. అందుకే ఆయన పేరు ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో జానపద గీతమై వినిపిస్తోంది. తరతరాలకు పోరాట స్ఫూర్తిని అందిస్తోంది.

ఏ సంస్కృతిని ఈ దేశంలో వీళ్ళు పెంచి పోషిస్తున్నారు? ఆలోచించండి. సమాన హక్కులు ఇచ్చిన రాజ్యాంగం స్థానంలో, అసమానతలను పెంచే మనుస్మృతిని ఎందుకు తీసుకు రావాలని అనుకుంటున్నారు వీళ్ళు? ఆలోచించండి. ఇదంతా చేస్తున్నదీ.. హిందూ రాజ్యం పేరుతో ఈ దేశంలో మళ్లీ చాతుర్వర్ణ వ్యవస్థను నిలబెట్టడానికే! మళ్లీ మనల్ని బానిసలుగా మార్చడానికే! అందుకే ఇకనైనా కళ్ళు తెరవండి! దళిత బహుజన శ్రామిక వర్గాల ప్రజల మీద జరుగుతున్న, ఈ కుట్రలు కుతంత్రాలను అర్థం చేసుకోండి! భవిష్యత్ తరం బాగు కోసమైనా మేల్కోండి! గొర్రె కసాయోడ్ని నమ్మినట్టుగా, ఈ మత ఉన్మాదులను నమ్మకండి! ప్రజలంతా సమానమే అని చెప్పిన, అందరికీ సమానత్వ హక్కులు ఇచ్చిన రాజ్యాంగాన్ని రక్షించుకోండి! మతాలకు అతీతంగా అన్ని మతాలను ఆదరించండి! మతం పేరుతో మంచి ఎవరు చేసినా, వాళ్లను గౌరవించండి! అంతిమంగా సమాజం నడుస్తున్నది మతాలతో దేవుళ్ళతో కాదు, మానవ శ్రమలతో అని తెలుసుకోండి!



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, తెలంగాణ.



పదునైన "సజీవ" సందేశం

రాప్తాడు ఉదంతంలో తదనంతర పరిణామం పదునైన సందేశమే ఇస్తోంది. మతిలేని చేష్టకు తక్షణ మూల్యంగా అవిటితనం ప్రాప్తించింది. దర్యాప్తు, విచారణ, శిక్ష వంటి మున్ముందు ఉండబోయే కదలికలకు ముందే వైకల్యం అదనమైంది. కారాగారంలో ఉన్నప్పుడు, బయటకు వచ్చినప్పుడు ఎప్పుడైనా జీవితాంతం వెంటాడే కాలు లేని వెలితి, స్వయంకృతాపరాధం నీడలా తోడుంటుంది. ఆరు రుతువుల్లో అయిదవది అయిన హేమంత రుతువు అంటే ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. చలి కాలపు రుతువు. అంతటి చక్కని పేరు గల హేమంత్ ఈ చలికాలపు హేమంత రుతువులో వేడి నెత్తురు చదువుల తల్లి ఒడిలో పారించి తన పేరులోని పరమార్థానికి పూర్తి భిన్నంగా తెగబడ్డాడు.

హేమం(త్) అంటే హిమం (మంచు) కరిగినట్లు మానవత్వం, విచక్షణా జ్ఞానం, నిగ్రహం, భయ భక్తులు తనలో కరిగిపోయాయి. ఎవరి ఊహకూ అందనంత విపరీత ధోరణితో చెలరేగిపోయాడు. నేరమయ దృష్టాంతాల్లో ఏనాడూ చోటుచేసుకోని, ముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో దుస్సాహసానికి ఒడిగట్టాడు. పుస్తకాలు, పాఠాలు, చదువులు, ఆటపాటలు మాత్రమే ఉండే సరస్వతీ నిలయంలోకి చెట్లు, కొమ్మలను కోసే యంత్ర రంపంతో ఆకస్మికంగా చొరబడ్డాడు. పువ్వులాంటి పదో తరగతి బాలిక దేహ భాగాలను తరగతి గదిలో ఆటవికంగా కోసేశాడు. అడ్డొచ్చిన మరో విద్యార్థినిపైనా రంపంతో విరుచుకుపడ్డాడు. క్రూరత్వం ఆవహించి ఘోరమైన దుశ్చర్యకు పూనుకొన్నాడు. ప్రశాంతమైన పాఠశాలల్లోనూ రక్షణ ప్రశ్నార్థకం చేశాడు. ప్రాణాలకు ఈ తరహా ముప్పు తెచ్చే నేరాలకు ఆస్కారం ఉంటుందని ఎవరూ అంచనా వేయని ప్రదేశంలోనూ ఉన్మాదపు జాడకు కారకుడయ్యాడు. తెలుగు రాష్ట్రాలనే కాదు, యావత్ లోకాన్నే భీతిగొల్పాడు. పుట్టి పెరిగిన స్థితిగతులు, నడవడిక, చెడు సావాసాలు, దుర్బుద్ధి, దురలవాట్లు, దురాలోచన వంటివి ఏవేవో హేమంత్‌ను ఎంతలా పురిగొల్పినప్పటికీ ఏకంగా యంత్ర రంపాన్నే ఎంచుకోవడంలోని తెగింపు నివ్వెరపరిచింది. బాధ్యుడిని భౌతికంగా లేకుండా చేయడమే తక్షణ చర్య కావాలనీ, అదే తగిన శాస్తి అనే అభిప్రాయాలు పోటెత్తాయి. ఆత్మరక్షణ కోసం, పట్టుకోవడం కోసం సంభవించిన పోలీసు కాల్పుల వల్ల ఆ యువ"కుడి" కాలు చికిత్సలో భాగంగా తీసివేయడం అనివార్యమైంది. ఇద్దరు అమ్మాయిలను ఏ విధంగానైతే రంపంతో కోశాడో ఆ విధంగా కాకపోయినా అంతేలా "చికిత్స కోత"తో కాలును శాశ్వతంగా కోల్పోవాల్సి వచ్చింది.

బాలికలు, యువతులు, మహిళల పట్ల నేరాలకు పాల్పడే ప్రబుద్ధులకు అదే చివరి రోజు అవుతుందనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానానికి అనుగుణంగా తగిన అంతర్లీన జవాబే అయింది. సమాజంలో నాణేనికి ఒక వైపు గట్టిగా కోరుకున్నట్టుగా భౌతికంగా ఏరివేతే జరిగితే అది అక్కడితో ముగిసిపోతుంది. కాలక్రమంలో మరిచిపోతారు. కానీ, అంతకుమించి...హేమంత్ తనను తాను చూసుకున్నా, నేరమయ ఆలోచనలు, ఆ మనస్తత్వం కలిగిన దుర్మార్గులు చూసినా పట్టే గతికి ఇది పదునైన సందేశం కాగలదు. భయభక్తులకు, వొళ్ళు దగ్గర పెట్టుకోడానికి, సద్బుద్ధితో మెదలడానికి, పరివర్తన పొందడానికి "సజీవ" తార్కాణమే అవుతుంది. నేరం జరిగినప్పటికంటే తదుపరి ఈ విధంగా మూల్యం చెల్లించుకున్నవే పది కాలాలపాటు బాగా గుర్తుండిపోయేలా ప్రచార, ప్రసార, బహుళ మాధ్యమాలు ప్రతి ఒక్కరి మదిలో నిలిచేలా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వ్యాప్తిలోకి తేవాలి.

-ఇల్లెందుల దుర్గాప్రసాద్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ 9440850384

గంజాయి స్వాధీనం ఇద్దరిపై కేసు

- మండల కేంద్రంగా గంజాయి విక్రయం
- నెల రోజుల్లో రెండు కేసులు నమోదు
- కర్ణాటక నుంచి రవాణా జరిగినట్లుగా గుర్తించిన పోలీసులు

మర్పల్లి నవంబర్ 5 (జనంసాక్షి): మర్పల్లి మండల కేంద్రం గంజాయి విక్రయ కేంద్రంగా మారబోతుందా... అంటే అవుననే చెప్పాలి. నెల రోజుల్లో రెండు గంజాయి కేసులు నమోదు కావడం కలవర పెడుతుంది. తాజాగా మండల కేంద్రంలోని భుచన్ పల్లి గ్రామంలో మర్పల్లి పోలీసులు గురువారం గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోఒక గుర్తు తెలియని వ్యక్తి అనుమానస్పదంగా భూచనపల్లి గ్రామ శివారులో పొలాల వద్ద తిరుగుతూ గంజాయి తీసుకొని వస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందగా ఎస్సై తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఇట్టి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తి నీ తనిఖీ చేశారు. అతని వద్ద ఒక ప్లాస్టిక్ కవర్లో 20 గ్రాముల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇట్టి వ్యక్తిని విచారించగా ఇతడు భూచన్పల్లి గ్రామానికి చెందిన జైపాల్‌గా గుర్తించి అతను అదే గ్రామానికి చెందిన మల్ రెడ్డి దగ్గర నుండి గంజాయి కొన్నాడు. ఈ విషయమై ఇద్దరు వ్యక్తుల పైన కేసు నమోదు చేశారు.

ఉద్యమకారుల గుర్తింపునకు త్వరలో ఆన్‌లైన్ దరఖాస్తులు

- ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా వివరాల సేకరణ
- జాబితా ప్రభుత్వానికి అందజేత: ప్రొఫెసర్ కోదండరాం



అల్వాల్, నవంబర్ 5 (జనంసాక్షి): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి, త్వరలో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తామని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హుల జాబితాను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని వెల్లడించారు. అల్వాల్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 50 రోజులు పూర్తిచేసుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి కోదండరాం హాజరై దీక్షా శిబిరంలో ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. వారి పోరాటాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారుల గుర్తింపు అంశంపై కమిటీ ఇప్పటికే పలువురితో సంప్రదింపులు జరిపి, తదుపరి కార్యాచరణపై అవగాహనకు వచ్చిందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం వెబ్‌సైట్ రూపకల్పన జరుగుతోందని, త్వరలోనే ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు కమిటీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యమకారులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ పోరాటం కొనసాగించాలని సూచించారు. ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని, ఉద్యమకారులకు న్యాయం జరిగే విషయంలో కమిటీ వెనక్కి తగ్గదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అల్వాల్ జేఏసీ నాయకులు, వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యమకారులు పాల్గొన్నారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 'ఏ ప్లస్' ఇష్యూయర్ రేటింగ్



శేరిలింగంపల్లి, నవంబర్ 05 (జనంసాక్షి) : ప్రతి యేటా నిర్వహించే ఇండియా రేటింగ్స్ సంస్థ నుంచి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఏ ప్లస్ రేటింగ్ లభించింది. ఈ సందర్భంగా పలువురు కార్పొరేషన్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. పటిష్టమైన ఆర్థిక స్థితిగతులు, ఆదాయ అంచనాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రణాళికలకు ఈ గుర్తింపు లభించినట్టైందని కార్పొరేషన్ ఉన్నత స్థాయి అధికారులు వివరించారు. ఇష్యూయర్ రేటింగ్‌తోపాటు స్థిరమైన భవిష్యత్ అంచనాను ప్రకటించింది. కార్పొరేషన్ యొక్క బలమైన సంస్థాగత వ్యవస్థ, పటిష్టమైన ఆర్థిక స్థితిగతులు మరియు సమర్థవంతమైన ఆదాయ నిర్వహణకు ఈ రేటింగ్ గుర్తింపుగా నిలుస్తుందని అధికారులు అభివర్ణించారు. కార్పొరేషన్ ఆర్థిక మరియు పరిపాలనా పనితీరును సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఇండియా రేటింగ్స్ తన అధికారిక వెబ్‌సైట్‌లో సిఎంసి ఇష్యూయర్ రేటింగ్‌ను ప్రచురించింది. ఈ రేటింగ్ మదింపులో ప్రధానంగా కింది అంశాలను పరిగణనలోకి తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంయొక్క తాత్కాలిక ఆర్థిక లెక్కల్లో భాగంగా అర్ధవార్షిక ఆర్థిక లెక్కలు, రాబోయే ఐదేళ్లలో కార్పొరేషన్‌కు సమకూరే ఆదాయ వనరులు, ఆదాయ వృద్ధి అంచనాలు మరియు ఆర్థిక సుస్థిరత ప్రధాన అంశంగా ఉండడం గమనార్హం.

బొమ్మలు ఇస్తానని నమ్మించి..

మైనర్ బాలిక పట్ల అసభ్య ప్రవర్తన .. నిందితుడిపై కేసు నమోదు

చేవెళ్ల, నవంబర్ 05 (జనంసాక్షి) : చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో మైనర్ బాలికను బొమ్మలు ఇస్తానని నమ్మించి వెంట తీసుకెళ్లి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీ ఉదయం బాలిక తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో చిన్నారి తన తమ్ముడితో కలిసి ఇంటి వద్ద ఉంది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో అదే కాలనీకి చెందిన వీరముష్టి నరేష్ (45) బొమ్మలు ఇస్తానని నమ్మించి చిన్నారులను తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం బాలికను బలవంతంగా పట్టుకుని ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బాలిక ప్రతిఘటించగా, అదే భవనంలోని పై అంతస్తులో ఉన్న ఓ మహిళ ఈ విషయాన్ని గమనించి నిందితుడిని మందలించింది. దీంతో అతను బాలికను వదిలిపెట్టడంతో చిన్నారులు అక్కడి నుంచి ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయాన్ని వివరించింది. దీంతో బాధితురాలి తల్లి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల భద్రత పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా వదిలే పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి సూచించారు.

గంగపుత్ర ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్ల నిధులు

రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లకు పెంపు.. త్వరలో నిధుల విడుదల



హైదరాబాద్ సిటీ, నవంబర్ 05 (జనం సాక్షి) : గంగపుత్రుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. గతంలో ఈ భవన నిర్మాణానికి కేటాయించిన రూ.3 కోట్లను రూ.5 కోట్లకు పెంచుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జీవో ఎంఎస్ నంబర్ 34ను విడుదల చేశారు. నిధులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిధుల పెంపుపై గంగపుత్ర సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. నిధుల పెంపు కోసం ప్రత్యేకంగా కృషి చేసిన ఫిషర్మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిషర్మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్ బాబు, గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంగిలిపల్లి శంకర్, సభ్యులు మంగిలిపల్లి రాజు, కంటె రామచందర్, కైరంకొండ నర్సింగ్ రావు, అంబటి సుధాకర్, పూస రవి, సింగారం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో వివాదాలకు శాశ్వత పరిష్కారం

భూ హక్కుల స్పష్టతే ప్రధాన లక్ష్యం

- డీజీపీఎస్ సాంకేతికతతో భూముల ఖచ్చితమైన కొలతలు
- మనోరాబాద్‌లో భూ రీసర్వేపై గ్రామసభ, అవగాహన సదస్సు
- రైతులు పాత భూ రికార్డులు సిద్ధం చేసుకోవాలి: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 05 (జనంసాక్షి): భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి తెలిపారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా మంచాల మండలం మనోరాబాద్ గ్రామంలో గురువారం భూ రీసర్వే గ్రామసభ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల ఆధునికీకరణ, భూముల కొలతల్లో ఖచ్చితత్వం, సరిహద్దు వివాదాల పరిష్కారం, యాజమాన్య హక్కుల నిర్ధారణే రీసర్వే ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఆధునిక డీజీపీఎస్ సాంకేతికతతో భూములను ఖచ్చితంగా సర్వే చేసి డిజిటల్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. దీనివల్ల భూముల విస్తీర్ణం, సరిహద్దులపై స్పష్టత రావడంతోపాటు పాత రికార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల ఆక్రమణల గుర్తింపు, సబ్‌డివిజన్ వివరాల నమోదు కూడా సులభమవుతుందని వివరించారు. ఖచ్చితమైన రికార్డులతో రైతులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడం సులభతరమవుతుందని తెలిపారు. గ్రామసభలో మనోరాబాద్ భూ వివరాలను వెల్లడించారు. గ్రామ మొత్తం విస్తీర్ణం 288 ఎకరాల 07 గుంటలు కాగా, 48 సర్వే నంబర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల 16 గుంటలు, ప్రభుత్వ భూమి 18 ఎకరాల 35 గుంటలుగా గుర్తించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 05 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా వివరించారు. రీసర్వే చేయాల్సిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు. రైతులు రీసర్వేలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని, పాత భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో భూముల సరిహద్దులు, విస్తీర్ణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్ రామారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వి. ప్రసాద్‌రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, మండల సర్వేయర్ ధనశ్రీ, సర్పంచ్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఫొటో తీశారని ఇరువర్గాల ఘర్షణ.. పోలీసు పికెట్ ఏర్పాటు

మల్కాజిగిరి నవంబర్ 5 (జనంసాక్షి) : మహిళ ఫొటో తీశారన్న కారణంతో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగిన సంఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కేపురంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆర్కేపురానికి చెందిన మిథిలేశ్ వర్గానికి చెందిన ఓ మహిళను ముఖేశ్ వర్గీయులు ఫొటో తీశారు. దీంతో ఇరువర్గాల మధ్య తొలుత మాటామాటా పెరిగి స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. కొద్దిసేపటికే అది పరస్పర దాడులకు దారితీసి తీవ్ర ఘర్షణగా మారింది. సమాచారం అందుకున్న నేరెడ్‌మెట్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఆర్కేపురంలో ముందస్తుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. రూ.48 లక్షల పనులకు శంకుస్థాపన

అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్ల, నవంబర్ 05 (జనంసాక్షి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. గురువారం చేవెళ్ల మండలం బస్తేపూర్‌లో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం చేవెళ్ల మున్సిపాలిటీ 9వ వార్డు దామరగిద్దలో రూ.48 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింహులు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే దామరగిద్దలో రహదారి, డ్రైనేజీ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాణసంచా బాధిత చిన్నారులకు 'వాసన్' అభయం

15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నేత్ర వైద్యం..నవంబర్ 14 వరకు అత్యవసర చికిత్సలు



కాప్రా, నవంబర్ 05 (జనంసాక్షి): దీపావళి సందర్భంగా బాణసంచా కాలుస్తూ కంటి గాయాలపాలైన చిన్నారులకు వాసన్ ఐ కేర్ ఉచిత వైద్య సేవలు అందించనుంది. 'సేఫ్ ఐస్.. సేఫ్ దీపావళి' కార్యక్రమంలో భాగంగా 15 ఏళ్లలోపు పిల్లలకు ఈ సేవలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఏఎస్ రావునగర్‌లోని వాసన్ ఐ కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సుధీర్ చీమకుర్తి, డాక్టర్ సౌమ్య ఐఆర్, బ్రాంచ్ మేనేజర్ ఫాతిమా అంజుమ్ వివరాలు వెల్లడించారు. నవంబర్ 4 నుంచి 14 వరకు వాసన్ ఐ కేర్, ఏఎస్‌జీ ఐ హాస్పిటల్స్ కేంద్రాల్లో అత్యవసర చికిత్స, ప్రథమ చికిత్స, ఉచిత మందులతోపాటు అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. వైద్య సహాయం, సమీప కేంద్రాల వివరాల కోసం 1800 5713 333 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. గతేడాది 500 మందికి పైగా చిన్నారులకు సేవలు అందించినట్లు తెలిపారు. బాణసంచా కాల్చేటప్పుడు తగిన దూరం పాటించాలని, రక్షణ కళ్లద్దాలు ధరించాలని సూచించారు. కంటికి గాయమైతే రుద్దకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో పాఠశాలకు వస్తున్న హెచ్ఎం

- విద్యార్థులను దూషిస్తూ విధుల్లో నిర్లక్ష్యం.. చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్



బోడుప్పల్-జనంసాక్షి : కమలానగర్‌లోని పీఎం శ్రీ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, మద్యం మత్తులో విద్యార్థులను దూషిస్తున్నారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు ఆరోపించారు. ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలకు మద్యం మత్తులో వస్తూ, విద్యార్థుల పట్ల అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని, తరగతి గదిలోనే నిద్రిస్తూ విధులను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాలతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.
ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అనుభవజ్ఞుడైన మరో ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు హరీష్, జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ వారెంట్‌పై నిందితుడి అరెస్టు

కోర్టులో హాజరుపరిచిన మేడిపల్లి పోలీసులు

బోడుప్పల్-జనంసాక్షి పలు కేసుల్లో నిందితుడిగా ఉండి, పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) నుంచి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని మేడిపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోడుప్పల్ ద్వారకానగర్‌కు చెందిన కడమంచి శివ (28)పై పలు కేసులు ఉండటంతోపాటు, అతడిపై సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. పెండింగ్‌లో ఉన్న వారెంట్ అమలులో భాగంగా అతడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు మేడపల్లి సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.



- రూ.1.78 కోట్ల నిధుల ఆడిట్‌కు పీఆర్ శాఖ అడ్డంకులు..
- ఉపాధి కూలీలే "ఆడిట్" టార్గెట్
- వారు చేసిన రూ.6 కోట్ల 56 లక్షల పనులపైనే ఆడిట్
- నేడే ఇబ్రహీంపట్నం మండల 18వ తనిఖీ సభ

"ఉపాధి"లో రికార్డుల 'గారడీ'

కిందిస్థాయి సిబ్బందిపైనే కొరడా..

ఉపాధి హామీ పథకం ఆడిట్‌లో అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని వ్యవసాయ కూలీలు చేసిన పనులపై అణువణువూ ఆడిట్ చేస్తూ, ఏ చిన్న లోపం ఉన్నా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలపై రికవరీలు విధిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. కానీ, లక్షల రూపాయల ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ కోట్ల రూపాయల ప్రజాధనానికి సంబంధించిన రికార్డులను ఆడిట్‌కు ఇవ్వని పంచాయతీరాజ్ అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

రికార్డులు ఇవ్వని పంచాయతీరాజ్

రంగారెడ్డి, నవంబర్ 5 (జనంసాక్షి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 6.56 కోట్లతో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నివేదికలు అధికారుల జవాబుదారీతనాన్ని వేలెత్తి చూపుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ చేసిన చేసిన రూ. 1.78 కోట్ల నిధుల ఆడిట్ పై అడ్డంకులు వ్యక్తం అవుతున్నాయి. ఆ శాఖ రికార్డులు అందజేయడం లేదు. దాంతో సామాజిక తనిఖీపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. శుక్రవారం మండల స్థాయి ఓపెన్ ఫోరం జరగనున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తూతూమంత్రంగా గ్రామసభలు..

గత నెల 24 నుండి నవంబర్ 5వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరిపాయి. అయితే, గ్రామసభలకు నిబంధనల ప్రకారం జిల్లా స్థాయి అబ్జర్వర్లను కేటాయించకపోవడంతో ఆ సభలు తూతూమంత్రంగానే సాగాయి. మండల స్థాయి ప్రోగ్రామ్ అధికారి సైతం ఒక్క గ్రామసభకు కూడా హాజరుకాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే మండల ఓపెన్ ఫోరంలోనైనా పంచాయతీరాజ్ అధికారుల అక్రమాలు బహిర్గతమవుతాయా లేదా అన్నది వేచి చూడాలి.

రికార్డులు కనుమరుగేనా?

గడిచిన ఆర్థిక సంవత్సరం 2025 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 వరకు ఇబ్రహీంపట్నం మండలంలో మొత్తం రూ.6,56,05,573 విలువ చేసే ఉపాధి హామీ పనులు చేపట్టారు. అందులో కూలీల ద్వారా రూ.6.28 కోట్ల విలువైన 696 పనులను పూర్తి చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాలకు కాంపౌండ్ వాల్స్ వంటి 26 రకాల పనుల నిర్మాణం కోసం పంచాయతీరాజ్ శాఖకు రూ.1,78,87,319 కేటాయించారు. అయితే, ఈ పనులకు సంబంధించి మొత్తం 42 వర్క్ ఐడీలు ఉండగా, పీఆర్ అధికారులు కేవలం 7 ఐడీల రికార్డులను మాత్రమే సామాజిక తనిఖీ బృందానికి అందజేశారు. మిగిలిన రూ. కోటిన్నరకు పైగా పనుల రికార్డులను అధికారులకు అప్పగించకుండా తొక్కిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మహిళల సాధికారతే లక్ష్యం : సెర్ప్ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వర్

లబ్ధిదారుల జీవనోపాధి యూనిట్లను తనిఖీ



రంగారెడ్డి, నవంబర్ 5 (జనంసాక్షి): మహిళల సాధికారతే లక్ష్యంగా ఐకేపీ వ్యవస్థ పని చేస్తుందని సెర్ప్ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి, పోల్కంపల్లి, దండుమైలారం గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఎల్ఎమ్ ఫండ్ ద్వారా మంజూరైన గొర్రె పొట్టేళ్ల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం రుణాలను పొందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ రుణాలు పొంది మహిళలు నిర్వహిస్తున్న జీవనోపాధి యూనిట్లు ఏ రీతిలో లాభసాటిగా సాగుతున్నాయో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. గొర్రెల పెంపకం పెరటి కోళ్ల పెంపకం చేపట్టే విధంగా లబ్ధిదారులకు రుణాలు అందజేస్తుందని తెలిపారు. వాటి స్థితిగతులు తెలుసుకొనే క్రమంలోనే ఇలాంటి తనిఖీలు చేపడుతున్నామని సూచించారు. లబ్ధిదారులు తీసుకున్న యూనిట్ల ద్వారా కుటుంబానికి జీవనాధారంగా ఉండాలని మృతి చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అధికారులైన డాక్టర్ సతీష్, డాక్టర్ నేహా, రాజేందర్, జిల్లా ఫామ్ డిపిఎం నరసింహ, మండల సీసీలు సత్తయ్య, మల్లేశ్, ఆనంద్, జంగమ్మ, గ్రామ సంఘం అసిస్టెంట్లు కవిత, జయలక్ష్మి, అనితలతో పాటు గ్రామ సంఘాల పాలకవర్గ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి 'పిల్లల ప్రజావాణి'

- నవంబర్ 16న ప్రత్యేక కార్యక్రమం, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా చొరవ



హైదరాబాద్ సిటీ, నవంబర్ 05 (జనం సాక్షి) : జిల్లాలో బాలల హక్కుల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించా రు. నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించను న్న బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 16న ప్రత్యేకంగా 'పిల్లల ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలల హక్కులపై సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేం దుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూని సెఫ్ భాగస్వామ్యంతో పనిచేస్తున్న అలయన్స్ ఫర్ చైల్డ్ రైట్స్(ఏసీఆర్), రాష్ట్ర నోడల్ సంస్థ మహిత సహకారంతో ఈ కార్యక్రమం జరగనుంది. సాధార ణ ప్రజావాణి నిర్వహించే ప్రాంగణంలోనే పిల్లల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదికపై పిల్లలు తమ విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను అధికారులకు నేరుగా వివరించవ చ్చు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, వేధిం పులు, దోపిడీ వంటి సమస్యలపై కూడా వినతి పత్రాలు సమర్పించే అవకాశం కల్పించనున్నారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత శాఖల సమన్వ యంతో తగిన చర్యలు తీసుకోనున్నారు. పిల్లల సంక్షేమం, సంరక్షణ, సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి హక్కుల పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొం దించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 'పిల్లల ప్రజావాణి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కోరింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06 నవంబర్ 2026

వనపర్తిలో ఆధునిక న్యాయ వసతులకు శ్రీకారం

- రూ.80 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ పనులు తుది దశకు
- వచ్చే ఏడాది ఆగస్టు నాటికి ప్రజలకు అందుబాటులోకి కోర్టు సేవలు
- నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి) : జిల్లా కేంద్రంలో రూ.80 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ పనులను గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ఆర్అండ్బీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన కోర్టు కాంప్లెక్స్‌లో మొత్తం 12 రకాల కోర్టులకు అవసరమైన ఆధునిక భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలకు ఒకే ప్రాంగణంలో మెరుగైన న్యాయసేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల్లో మొదటి, రెండో అంతస్తుల స్లాబ్ పనులు పూర్తయ్యాయని, మరో అంతస్తు స్లాబ్ పనులు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతోందని, కొన్ని కారణాల వల్ల పనుల్లో స్వల్ప జాప్యం జరిగిందని తెలిపారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.వనపర్తి జిల్లా న్యాయవ్యవస్థకు ఆధునిక మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ప్రజలకు సౌకర్యవంతమైన న్యాయసేవలు అందించడంలో ఈ ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్అండ్బీ శాఖ ఎస్ఈ, ఈఈ, ఇతర అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



బాలానగర్, నవంబర్ 5 (జనం సాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని, పనుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట నష్టాల పరిశీలన



కల్వేర్, నవంబర్ 5 (జనం సాక్షి) : కల్వేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో ఎల్‌నినో ప్రభావంతో పత్తి పంటలకు వాటిల్లిన నష్టాలను అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పంట నష్టాల గణన కార్యక్రమాన్ని నారాయణఖేడ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రవీణ్ చారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలను సందర్శించి, పంట నష్టం వివరాలను పరిశీలించారు. పంట నష్టాలను క్షేత్రస్థాయిలో నమోదు చేసే ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం కృష్ణాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి. వెంకటేశం మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకొని రాబోయే యాసంగి సీజన్‌లో అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలైన శనగ, కుసుమ, ఇతర అపరాలు, చిరుధాన్యాలు మరియు కూరగాయల సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రవీణ్ చారి, మండల వ్యవసాయ అధికారి వి. వెంకటేశం, వ్యవసాయ విస్తరణ అధికారి పి. సాయిలు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలకు ఈ-హెచ్ఆర్ఎంఎస్ కీలకం

- ప్రతి ఉద్యోగి పోర్టల్ వినియోగంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



వనపర్తి, నవంబర్ 5 (జనం సాక్షి) : ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన అన్ని వివరాలు, సెలవుల మంజూరు, బిల్లులు, ఇతర ఉద్యోగ సేవలను ఆన్‌లైన్‌లో సులభంగా నిర్వహించేందుకు ఈ-హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్ ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఈ పోర్టల్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గురువారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, శాఖాధిపతులు, ఉద్యోగులకు ఐఎఫ్ఎంఐఎస్ ఈ-హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన కార్యకలాపాలను పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలో నిర్వహించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని తెలిపారు. పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సేవలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని, తమకు సంబంధించిన పనులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో నిర్వహించుకునేలా అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ట్రెజరీ శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ-హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లోని సేవలు, విధివిధానాలు, వాటిని వినియోగించుకునే ప్రక్రియపై ఉద్యోగులకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రాంరెడ్డి, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఏటీఓ హరికృష్ణ, ఎస్టీఓలు రాందాస్, రాజేష్ కన్నా, వివిధ శాఖల జిల్లా అధికారులు, శాఖాధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కారు ఛార్జింగ్

- ప్రభుత్వ విద్యుత్ దుర్వినియోగం అవుతోందని ఆరోపణ



నిజాంపేట్, నవంబర్ 5 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా, మండల కేంద్రమైన నిజాంపేట్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ విద్యుత్ ను ఉపయోగించి కారు ఛార్జ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ తరుణి తన కారుకు అనునిత్యం పీహెచ్‌సీ భవనం నుంచి విద్యుత్ సరఫరా చేసి ఛార్జ్ చేస్తున్నారని అందిన సమాచారం మేరకు వెళ్లి ఫోటోలు తీయగా, అధికారులతో, నాయకులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై స్థానిక విద్యుత్ ఏఈ శృతి గారికి సమాచారం ఇవ్వగా, పై అధికారులకు సమాచారం అందించి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారని సమాచారం.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే విద్యుత్ ను వ్యక్తిగత అవసరాలకు వాడటం సరికాదని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీటి లభ్యతపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి



జగదేవ్‌పూర్, నవంబర్ 5 (జనం సాక్షి) : ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి లభ్యతపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి చెప్పారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలో అలి రాజపేట తిమ్మాపూర్ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అలిరాజపేట గ్రామంలో బాపురెడ్డి అనే రైతు తన భూమిలో సాగు చేస్తున్న అధిక సాంద్రత పత్తి సాగును (హెచ్‌డిపిఎస్) రాశి స్విఫ్ట్ రకం పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించి, వాటి నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతుకు సూచించారు. అనంతరం అదే గ్రామంలో పి ఆర్ జి -176 రకం కందిపంట పూత, కాయ ఏర్పడే దశలో ఉన్న క్షేత్రాన్ని సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. కాగా తిమ్మాపూర్ గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించి రైతులతో కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, రానున్న యాసంగి సీజన్‌లో నీటి లభ్యత సరిగా లేని కారణంగా వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరం కలిగిన పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, అలిరాజ్‌పేట సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్, తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు వ్యవసాయ విస్తరణ అధికారులు శరణ్య, కిరణ్, ఆత్మ కమిటీ సభ్యులు బ్రహ్మచారి, రైతులు కిష్టయ్య, రమేష్, మల్లేష్, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 5 (జనం సాక్షి) : మహిళా పొదుపు సంఘాల సభ్యులు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) ఉమాహారతి ఐఏఎస్ సూచించారు. సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య 110వ సమావేశం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు యోగేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమాహారతి మాట్లాడుతూ, మహిళా సమాఖ్యలు రుణాల పంపిణీ సంస్థలుగానే కాకుండా వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందాలన్నారు.ప్రతి మండల సమాఖ్య ఆదాయం సమకూర్చే కార్యక్రమాలను చేపట్టాలని, ఇందుకు అవసరమైన శిక్షణ, పెట్టుబడి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వచ్చే నెల సమావేశానికి వ్యాపార అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రతిపాదనలతో రావాలని సూచించారు. ఈ బాధ్యతను డీపీఎంలు తీసుకోవాలన్నారు. అలాగే అన్ని మండల సమాఖ్యలకు మంజూరైన భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వీబీ-జీ రామ్‌జీ పథకం ద్వారా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, అవకాశం ఉన్నవారు నీటి కుంటలను నిర్మించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డీపీఎంలు సెర్ప్ కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించారు. సమావేశానికి అదనపు డీఆర్డీఓతో పాటు జిల్లాలోని 23 మండల సమాఖ్యల అధ్యక్షులు, డీపీఎంలు హాజరయ్యారు.

కాళ్లకల్ ఎండు గంజాయి పట్టివేత

- బీహార్‌కు చెందిన యువకుడు అరెస్ట్



తూప్రాన్, నవంబర్ 5 (జనం సాక్షి) : మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ పరిధిలోని కేఎల్ఆర్ గ్రీన్ వెంచర్‌లో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీ మొత్తంలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో బీహార్ రాష్ట్రానికి చెందిన జ్యోతిష్ కుమార్ (22) వద్ద 956 గ్రాముల ఎండు గంజాయిని గుర్తించి పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ సీఐ జె. గోపాల్ వెల్లడించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చంద్రయ్య గౌడ్, సూపరింటెండెంట్ ఎల్. నరసింహారెడ్డి ఆదేశాల మేరకు డీటీఎఫ్ సీఐ జె. గోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కాళ్లకల్‌లోని కేఎల్ఆర్ గ్రీన్ వెంచర్‌లో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న జ్యోతిష్ కుమార్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 956 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని సీఐ గోపాల్ పేర్కొన్నారు. నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని, ఎక్కడైనా గంజాయి వంటి మాదకద్రవ్యాల సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. పట్టుబడిన జ్యోతిష్ కుమార్‌తో పాటు స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయిని తదుపరి చర్యల నిమిత్తం నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి అప్పగించినట్లు అధికారులు వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పుండరీకం, వహీద్, ప్రవంతి, షాహిద్ తదితరులు పాల్గొన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాల నియంత్రణకు ఎక్సైజ్ శాఖ తనిఖీలు, నిఘా చర్యలను కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- 10 ఏళ్ల విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం



శ్రీరంగాపూర్, నవంబర్ 5 (జనం సాక్షి) : కంబాలాపూర్ గ్రామ పంచాయతీ 8వ వార్డులో, గత 10 సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ పోల్ వైరింగ్ సమస్యను, ప్రస్తుత వార్డు సభ్యులు కాట్రావత్ కృష్ణ నాయక్ విజయవంతంగా పరిష్కరించారు. ఎన్నికల సమయంలో తను ప్రజలకు ఇచ్చిన హామీకి కట్టుబడి, తన సొంత నిధులతో ఈరోజు విద్యుత్ వైరింగ్ పనులను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బుడ్డయ, ఎల్లస్వామి, శేఖర్ మరియు మేకల ఈశ్వర్ పాల్గొని, త్వరగా పనులు పూర్తి అయ్యేటట్లు సహకరించారు. తనపై నమ్మకంతో గెలిపించిన 8వ వార్డు ప్రజలకు నిరంతరం సేవ చేస్తానని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా కృష్ణ నాయక్ పునరుద్ఘాటించారు.

అరెస్టులతో ఉద్యమకారుల గొంతు నొక్కలేరు

- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



బెజ్జంకి, నవంబర్ 5 (జనం సాక్షి) : తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరసనలకు పిలుపునిచ్చిన ఫోరం నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టియుఎఫ్)బెజ్జంకి మండల అధ్యక్షుడు మ్యాకల శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.అరెస్టులతో ఉద్యమకారుల గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఏళ్ల పాటు పోరాడి,త్యాగాలు చేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరమనీ అన్నారు.అర్హులైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు,నెలవారీ గౌరవ పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు వారి కుటుంబాలకు విద్య,వైద్యం,ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఇటీవల ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందని,ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.ఉద్యమకారులను అరెస్టు చేయడం కాకుండా వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని,అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు చింతకింది శ్రీనివాస్ గుప్తా,లింగాల లక్ష్మణ్,ముక్కీస తిరుపతిరెడ్డి, చెరుకూరి నరసయ్య,బొడిగె అనిల్,శానగొండ శరత్,జేరిపోతుల మధు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో కుడా ఉపాధి పనులు కల్పించాలి



అమరచింత, నవంబర్ 5 (జనం సాక్షి) : అమరచింతలో కరపత్రాల విడుదల. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎస్ అజయ్ మాట్లాడుతు ఆయా గ్రామాలు మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో విలీనం తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ల పట్టణ ప్రాంతాల్లోనూ వివిజి రామ్‌జి పథకం కింద ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6న హైదరాబాద్ కమిషనరేట్ సి ఆర్ డి ఆఫీస్ ఎదుట జరుగు ధర్నాకు వనపర్తి జిల్లాలోని మున్సిపాలిటీలోని ప్రజలు మరియు మున్సిపాలిటీలలో విలీనమైన ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇట్టి ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు .ఏడాదికి 200 రోజుల పని రోజు కూలి 800 ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత ఎల్నీనో వర్షా బావ కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లోని ఉపాధి హామీ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.వర్షాలు లేక పంటలు పండక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడడంతో ఎటువంటి ఉపాధి పనులు లేక ప్రజలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని విమర్శించారు. ఇటువంటి పరిస్థితిలో పేదలను కూలీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఉపాధి పనులు కల్పించడంలో విఫలం చెందారని ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పనులు ఏడాదికి 100 రోజులు కల్పిస్తామని రోజు కూలి 400 ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ పార్టీ హామీని అమలు పరచాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో పంట నష్టపోయిన రైతన్నకి వెంటనే ఎకరాకు 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కే శంకర్ ఎన్.రాజు. రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందని ప్రమాద బీమా పరిహారం

- పట్టించుకోని ఇన్సూరెన్స్, లేబర్ అధికారులు!



సారంగాపూర్, నవంబర్ 5 (జనం సాక్షి) : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దండుగుల ఎల్లయ్య భవన నిర్మాణ రంగంలో స్టోన్ కట్టర్, కూలి గా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఆయన తెలంగాణా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో కార్మికుడిగా 120 రూపాయలు చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. దురదృష్టవశాత్తు, 31.10.2025న వ్యవసాయ బావి వద్ద జరిగిన ప్రమాదంలో ఎల్లయ్య పడి మరణించారు. దీంతో ఆయన భార్య వెంకటనర్సమ్మ, కుటుంబ సభ్యులు జీవనాధారం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్లయ్యకు దీంజెౌ కార్మికుల సంక్షేమ బోర్డులో రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ, ప్రమాద మరణానికి సంబంధించిన బీమా పరిహారం, ఇతర సంక్షేమ ప్రయోజనాలు ఇప్పటివరకు కుటుంబానికి అందలేదు. ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, రాష్ట్ర నోడల్ అధికారి శ్రీ కె. విద్యాసాగర్ గారికి కూడా సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులో నమోదు చేసుకున్న కార్మికుడు ప్రమాదంలో మరణించినప్పుడు, అతని కుటుంబానికి సకాలంలో పరిహారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. కార్మికుడు జీవించి ఉన్నప్పుడు సంక్షేమ బోర్డులో నమోదు చేసుకుని, మరణించిన తర్వాత అతని కుటుంబం పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, దండుగుల ఎల్లయ్య కుటుంబానికి అర్హమైన ప్రమాద మరణ పరిహారం, అంత్యక్రియల ఖర్చులు మరియు ఇతర సంక్షేమ ప్రయోజనాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక శాఖ కార్యాలయాన్ని, హైదరాబాద్‌లోని సంబంధిత కార్మిక శాఖ కార్యాలయాలను సంప్రదించినప్పటికీ, కార్మికుడికి సంబంధించిన బీమా వివరాలు అందుబాటులో లేవనే సమాధానాలు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని ప్రవాసి మిత్ర కార్మిక సంఘం అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల దృష్టికి మృతుని అల్లుడు ఈడగొట్టు మోహన్ తీసుకరాగ, కలిసి హైదరాబాద్ వెళ్లి ముఖ్యమంత్రి ప్రజావాణి

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు
'ఉన్నతి విద్య' దోహదం

- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



మావల, నవంబర్ 06 (జనంసాక్షి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు సర్వతోముఖాభివృద్ధికి 'ఉన్నతి విద్య' కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మసూద్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలక్‌మందిర్) పీఎం శ్రీ పాఠశాలలో 'ఉన్నతి విద్య' కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఉన్నతికి బాట.. విద్యతో ప్రయాణం – అభ్యసనం, అభివృద్ధి, విజయం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పటిష్టమైన విద్యా పునాది కల్పిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించడంతో పాటు బోధనా విధానాలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, సెక్టోరల్ అధికారులు లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రైస్ డిపోలపై తూనికలు కొలతల శాఖ సర్జికల్ స్ట్రైక్

- ఆకస్మిక దాడుల్లో ఎనిమిది మందిపై కేసులు నమోదు

ఖానాపూర్ నవంబర్ 05 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావం సాకుతో బియ్యం ధరలకు రెక్కలు పుట్టించిన వ్యాపారులపై పౌరసరఫరాలు, తూనికలు కొలతల శాఖలు మూకుమ్మడిగా సర్జికల్ స్ట్రైక్ నిర్వహించారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని పలు రైస్ డిపోలతో పాటు వ్యాపార సముదాయాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని, ధరల పట్టిక ఏర్పాటు చేయని వ్యాపారులపై ఎనిమిది మంది వ్యాపారులను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తూనికలు కొలతల ఇన్స్పెక్టర్ శంకర్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలని నిక్కచ్చిగా చెప్పారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. తాము తనిఖీలకు వచ్చిన సందర్భంగా వ్యాపారాలను మూసి వంచి వెళ్లిన వారిపై ప్రత్యేక కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఎల్నినో ప్రభావం సాకుతో వినియోగదారులను దోచుకుంటే సహించేదే లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ దాడులలో ఎన్ఫోర్స్మెంట్ డీటీ రవీందర్, తూనికలు కొలతల టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ లు ఉన్నారు.

బియ్యం ధరల నియంత్రణ

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 5 (జనంసాక్షి) : ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 482 రూపాయలు, పాత బియ్యం 1 వేయి 638, హెచ్.ఎం.టి. పాత రకం బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, నవంబర్ 05, (జనంసాక్షి) : రానున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాసరతో పాటు జిల్లాలోని పుష్కర ప్రాంతాల్లో భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతంగా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని, స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల వద్ద నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడంతో పాటు, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు అవసరమైన చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో పాటు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి కూడా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కర ప్రాంతాల్లో అవసరమైన అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ ఈఈలు సందీప్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో సత్తా చాటిన భైరగూడ ఉపరితల గని

- బెల్లంపల్లి ఏరియాకు అరుదైన గుర్తింపు
- ఐదు నక్షత్రాల రేటింగ్‌తో ప్రతిష్ఠాత్మక అవార్డు

రెబ్బెన, నవంబర్ 5 (జనంసాక్షి) : సింగరేణి సంస్థ మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకుంది. బెల్లంపల్లి ఏరియాలోని భైరగూడ ఉపరితల గని ప్రతిష్ఠాత్మక ఐదు నక్షత్రాల రేటింగ్ అవార్డును సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం అత్యుత్తమ పనితీరు కనబరిచిన బొగ్గు గనులకు ఐదు నక్షత్రాల రేటింగ్‌ను అందజేస్తుంది. ఈ రేటింగ్ కోసం గనుల పనితీరు, భద్రతా చర్యలు, నిర్వహణ, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, కార్మిక సంక్షేమం తదితర 84 అంశాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తారు. మొత్తం 100 మార్కులకు గాను 91కు పైగా మార్కులు సాధించిన గనులకు ఐదు నక్షత్రాల రేటింగ్‌తో పాటు అవార్డును అందజేస్తారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ మాట్లాడుతూ, భైరగూడ ఉపరితల గని ప్రతిష్ఠాత్మక అవార్డును సాధించడం బెల్లంపల్లి ఏరియాకు ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో బొగ్గు ఉత్పత్తి, భద్రత, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎం. నరేందర్, భైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ప్రత్యేక అధికారి ఇ. స్వామిరాజు, ఏరియా ఇంజనీర్ బి. వీరన్న, ప్రాజెక్టు మేనేజర్ జె. శంకర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు ఎరువుల కొరత

- వెయ్యి టీఎంసీల నీటిని సముద్రం పాలు చేసిన ఘనత రేవంత్ రెడ్డిది
- క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



కమలాపూర్ (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యంలో తరుగు పేరుతో అధికంగా కోతలు విధించకుండా, నిబంధనల ప్రకారం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. రైతులను కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలంతో పాటు ఐదు మండలాలు, రెండు పట్టణాల్లో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నీళ్లు లేక పదికరాలు ఉన్న రైతులు ఐదెకరాలు,నాలుగెకరాలు మాత్రమే సాగు చేస్తున్నారని,ఐదెకరాలు ఉన్న రైతులు రెండు ఎకరాలు,ఎకరం మాత్రమే సాగు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులు పంటలు వేసుకోలేని పరిస్థితి రావడం అత్యంత బాధాకరమన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 25 వేల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నా కాళేశ్వరం నీటిని ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నించారు. ఈ లెక్కలు తన సొంతంగా చెబుతున్నవి కావని,కేంద్ర జల సంఘం గణాంకాల ప్రకారం ఇప్పటికీ అన్‌లైన్‌లో 25 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం కనిపిస్తోందన్నారు. ఆ నీటిని లిఫ్ట్ చేసి ఉంటే హుజూరాబాద్ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేటీఆర్ తో కలిసి వేలాది మంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి లక్ష క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే నీటిని లిఫ్ట్ చేసి రైతులకు అందించాలని కోరామన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా నీటిని సముద్రం పాలు చేసిందన్నారు. గోదావరి నుంచి సుమారు 750 టీఎంసీలు,కృష్ణా నుంచి 250 టీఎంసీల నీటిని వినియోగించుకోకుండా సముద్రం పాలు చేసిన ఈ ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించడం లేదా ప్రశ్నించారు. కేసీఆర్ పాలనకు కాంగ్రెస్ పాలనకు మధ్య తేడా రైతులకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క రోజైనా రైతులకు సాగునీటి సమస్య వచ్చిందా? 24 గంటల ఉచిత విద్యుత్ అందకుండా పోయిందా? రైతుబంధు అందని సీజన్ ఉందా? దురదృష్టవశాత్తూ రైతు చనిపోతే ఆ కుటుంబానికి రైతుబీమా కింద రూ.5 లక్షలు అందకుండా పోయాయా? రైతులు ఒక్కసారి గుండె మీద చేయి వేసుకొని ఆలోచించాలన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పుష్కలంగా నీళ్లు వచ్చాయని,24 గంటల కరెంటు వచ్చిందని రైతుబంధు,రైతుబీమా అందాయన్నారు. కేసీఆర్ అధికారంలో నుంచి దిగిపోయిన తర్వాతే నీళ్ల సమస్యలు,కరెంటు కోతలు,యూరియా,డీఏపీ కొరతలు ఎందుకు వస్తున్నాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏ పంట పండించినా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ బోనస్ ఒక్క రైతుకు అయిన ఇచ్చిందా రైతులు ఆలోచన చేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ మాటలుగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నీళు అందుబాటులో ఉన్నప్పటికీ క్రాప్ హాలిడే ప్రకటించడం ఏంటి? రైతులు పంటలు పండించకుండా చేసే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కు రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తే సామర్థ్యం ఉందని,ఇప్పటికీ సమయం ఏం మించిపోలేదని ఈ క్షణం కూడా నీటిని లిఫ్ట్ చేసి రైతులకు అందిస్తే రైతులు మళ్లీ పంటలు వేసుకునే అవకాశం ఉందన్నారు. రైతుల విషయంలో దయచేసి రాజకీయాలు చేయడం మంచిది కాదని, రైతుల జీవితాలతో చెలగాటం ఆడటం మంచిది కాదని ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే నష్టపోయే ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. రైతుల పక్షాన, రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేడిసిసిబి డైరెక్టర్ పోరండ్ల కృష్ణ ప్రసాద్,పిఏసిఎస్ చైర్మన్ సంపత్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జాన్సీ రాణి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి,డైరెక్టర్ సత్యనారాయణ రావు, మాజీ జడ్పీటీసీ నవీన్, సర్పంచ్ ఫోరమ్ మండల అధ్యక్షుడు రాజేష్ జీ,మాజీ సర్పంచ్ లు, సింగిల్ విండో డైరెక్టర్లు,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ ఫెయిర్‌కు అభ్యాస హై స్కూల్ ఆణిముత్యాలు ఎంపిక

వరంగల్ ఎంజీఎం, నవంబర్ 5 (జనంసాక్షి): 32 వ జాతీయ స్థాయి బాలల సైన్స్ ఫెయిర్ స్థానిక బిర్లా స్కూల్ లో ఘనంగా జరిగిన సైన్స్ ఫెయిర్ లో అభ్యాస హై స్కూల్ విద్యార్థులు ఇబా ఇరహం, గంజి అక్షర టీం రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ ఫెయిర్ కు సెలెక్ట్ అయినారని స్కూల్ డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ తెలిపారు.అనంతరం సెలెక్ట్ అయిన విద్యార్థిని లను అభినందిస్తూ అభ్యాస స్కూల్ నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఇదే స్ఫూర్తి తో జాతీయ స్థాయి కి ఎంపిక కావాలని కోరుతూ ఇందుకు సంబంధించిన గైడ్ టీచర్స్ సంతోష్ సార్ సబ్బీర్ సార్ ను అభినందించారు.మా స్కూల్ విద్యార్థులు ఎంచుకున్న అంశమే జాతీయస్థాయిలో ప్రత్యేక అంశం అని ఈ రోజులలో సమాజానికి కావలసిన అంశమిది విద్యార్థులు ప్రదర్శించిన అంశం అద్భుతంగా ఉందని ప్రిన్సిపాల్ మండల శిరీష అన్నారు.ఈ అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులు అరెస్టు



నర్సంపేట, నవంబర్ 5 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి వెళు న్నారనే అనుమానంతో గురువారం ఉదయం ఉద్యమకారులు దొనాల రవి, మాదాసు శీనులను అరెస్టు చేసి సాయంత్రం విడుదల చేసినట్టు వారి పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముందస్తు అరెస్టును తోటి ఉద్యమకారులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజా సమస్యలపై గళమెత్తే వారిపై నిర్బంధాలు విధించడం, ముందస్తు అరెస్టులు చేయడం సరైంది కాదని వారు అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06 నవంబర్ 2026

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- పోలీస్ సిబ్బందికి సీఐ కృష్ణమూర్తి సూచనలు



కొల్చారం, నవంబర్ 5 (జనం సాక్షి) : మెదక్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. కృష్ణమూర్తి గురువారం కొల్చారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా నమోదైన కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది విధుల తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం పెరిగేలా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్, ఏఎస్సై లక్ష్మిరెడ్డి, పోలీస్ సిబ్బంది ప్రవీణ్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జలవిలయంపై గెలిచారు.. ప్రాణాలు నిలిపారు

- బేతుపల్లి చెరువులో అర్ధరాత్రి సాహసోపేత ఆపరేషన్
- 16 మంది సురక్షితం
- రక్షక దళాల సేవలకు మంత్రి తుమ్మల సలాం..
- జిల్లా కలెక్టర్‌కు ఆత్మీయ ఆలింగనం
- స్పాట్‌లోనే ఉండి నడిపించిన ఎమ్మెల్యే రాగమయి..
- అండగా నిలిచిన ప్రజలు

సత్తుపల్లి, నవంబర్ 5 (జనంసాక్షి) : నడిరేయి వేళ.. ఉవ్వెత్తున విరుచుకుపడుతున్న కెరటాల హోరు.. చూస్తుండగానే అగాధంలోకి లాగేస్తున్న నీటి సుడిగుండాలు.. బేతుపల్లి పెద్ద చెరువు నిన్నటి రాత్రి ఓ భీకర యుద్ధరంగాన్ని తలపించింది.. చేపల వేటకు వెళ్లి చిక్కుకుపోయిన మత్స్యకారులు ఒకవైపు.. వారిని రక్షించేందుకు వెళ్లి అలల తాకిడికి గల్లంతైన సహాయక సిబ్బంది మరోవైపు.. మొత్తం 16 మంది ప్రాణాలు గాల్లో దీపాల్లా కొట్టుమిట్టాడుతున్న వేళ రక్షక దళాలు కదనరంగంలోకి దూకాయి.. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బలగాలు సాగించిన ఈ అపర సాహస పోరులో మృత్యువు ఓడిపోయింది.. మానవ సంకల్పం గెలిచింది.. ప్రాణాలను పణంగా పెట్టి గండం గట్టెక్కించిన రెస్క్యూ సిబ్బందిని స్థానిక అటవీశాఖ విశ్రాంతి గృహంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సముచిత రీతిలో సత్కరించారు.

మీ సాహసానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా "కళ్లెదుట భయంకరమైన ప్రవాహం ఉన్నా లెక్కచేయక, స్వంత ప్రాణాలను సైతం పణంగా పెట్టి 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మీ ధైర్యసాహసాలు అద్వితీయం. మీ రుణం తీర్చుకోలేనిది. ఈ జిల్లా ఉన్నంతకాలం మీ పోరాటం ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది" అంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సన్మాన వేదికపై ప్రసంగించారు. ప్రభుత్వం తరఫున, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల తరఫున రక్షక సిబ్బందికి చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు..

కలెక్టర్ అంకితభావానికి నిండు మనసుతో ఆలింగనం

అర్ధరాత్రి క్షణక్షణం ఉత్కంఠ రేపుతున్న వేళ అణువణువునా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌ను మంత్రి తుమ్మల ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. క్లిష్ట సమయంలో ఏమాత్రం తొణకకుండా, ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని సమీక్షిస్తూ సహాయక చర్యలను సమన్వయం చేసిన కలెక్టర్ పనితీరును మంత్రి మనసారా ప్రశంసించారు.

కట్టపైనే జాగారం చేసిన ఎమ్మెల్యే రాగమయి

ఈ ఆపరేషన్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ చూపిన తెగువ, బాధ్యత



ప్రశంసనీయంగా నిలిచాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఆమె, ఏ క్షణంలోనూ చెరువు కట్టను వీడలేదు. సహాయక సిబ్బందికి అవసరమైన సామగ్రిని సమకూరుస్తూ, బాధితుల కుటుంబాలకు ధైర్యం చెబుతూ తెల్లవార్లూ అక్కడే నిలబడ్డారు. ప్రజాప్రతినిధిగా ఆమె చూపిన చొరవను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

తోడుగా నిలిచిన ప్రజలు

ఈ మహా సంక్షోభ సమయంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, స్థానిక యువకులు, పార్టీ యంత్రాంగం ఏకతాటిపై నిలిచారు. బోట్లు దించడానికి, లైటింగ్ ఏర్పాట్లకు, అధికారుల ఆదేశాలను అమలు చేయడానికి గ్రామస్థులు అందించిన సహాయ సహకారాలు వెలకట్టలేనివని మంత్రి పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల ఐక్యతే నిండు ప్రాణాలను కాపాడిందని కొనియాడారు.

టేకుల చెరువు పంచాయతీ కార్యాలయంలో చోరీ

- తాళం పగలగొట్టి రికార్డులు చిందరవందర.. కీలక పత్రాలే లక్ష్యమా..?
- నగదు లేని కార్యాలయంలో దొంగతనం వెనుక మర్మమేంటి?
- భద్రతను కట్టుదిట్టం చేయాలని సర్పంచ్ బోళ్ళ సైదమ్మ విజ్ఞప్తి



బూర్గంపహాడ్, నవంబరు 5 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం టేకుల చెరువు గ్రామపంచాయతీ కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కార్యాలయ తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు రికార్డులు, దస్త్రాలను చిందరవందరగా పడవేశారు. కొన్ని ముఖ్యమైన పత్రాలు కనిపించకుండా పోయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో పెద్ద మొత్తంలో నగదు ఉండదనే విషయం తెలిసినప్పటికీ దుండగులు కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకోవడం పలు సందేహాలకు తావిస్తోంది. కేవలం నగదు కోసమే చోరీకి పాల్పడ్డారా? లేక ఏవైనా కీలకమైన పంచాయతీ రికార్డులను లక్ష్యంగా చేసుకున్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో భద్రపరిచే రికార్డులు గ్రామాభివృద్ధి, ప్రజా పరిపాలనకు సంబంధించిన కీలక ఆధారాలు కావడంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమైన పత్రాలు మాయమయ్యాయా? లేక వాటిని దెబ్బతీసే ఉద్దేశంతోనే దుండగులు కార్యాలయంలోకి ప్రవేశించారా? అనే కోణంలోనూ విచారణ జరగాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని టేకుల చెరువు గ్రామ సర్పంచ్ బోళ్ళ సైదమ్మ ఉన్నతాధికారులను కోరారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి పట్టుకుని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యాలయంలోని రికార్డులు, దస్త్రాలను పరిశీలించి ఏవైనా కీలక పత్రాలు కనిపించకుండా పోయాయా అన్నది నిర్ధారించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామపంచాయతీ కార్యాలయంలో భద్రతను కట్టుదిట్టం చేయాలని సర్పంచ్ సూచించారు. దుండగుల ఉద్దేశాన్ని వెలుగులోకి తీసుకొచ్చి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

- తక్షణమే పంట నష్టం సర్వే చేపట్టి రైతులకు పరిహారం అందించాలి

కల్లూరు, నవంబర్ 5 (జనం సాక్షి) : మురసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కల్లూరు మండలంలో తీవ్రంగా దెబ్బతిన్న పంట పొలాలను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరిశీలించారు. చండ్రుపట్ల, గ్రామంలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి, పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోత దశకు చేరుకున్న వరి పంటలు భారీ వర్షాలకు నీట మునిగి, నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికే వివిధ రకాల ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు మురసు తుఫాను రూపంలో మరో ఎదురుదెబ్బ తగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరితో పాటు పత్తి పంట కూడా వర్షాల కారణంగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులను క్షేత్రస్థాయికి పంపించి



పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతు వివరాలను నమోదు చేసి, సర్వే నివేదికలను ప్రభుత్వానికి పంపించి తగిన నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోవడం బాధాకరమని, ప్రభుత్వం ఆలస్యం చేయకుండా రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాలెపు రామారావు,మాజీ జడ్ పీ టీ సీ సభ్యులు కట్టా అజయ్ కుమార్ , డాక్టర్ లక్కినేని రఘు, మేకల కృష్ణ,నాయకులు పెద్దబోయిన మల్లేశ్వరరావు, కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, కనపర్తి శ్యామల రాజ్ కుమార్, సయ్యద్ రేష్మ ఇంతియాజ్, బిఆర్ఎస్ నాయకులు దేవరపల్లి భాస్కరరావు, జక్కంపూడి కిషోర్, కాటమనేని రామారావు, చండ్రుపట్ల మాజీ సర్పంచ్ గొల్ల మందల ప్రసాద్,, కొరకొప్పు ప్రసాద్, మోర్తాల పిచ్చిరెడ్డి, కళ్యాణ్ కిషోర్, వల్లభనేని రవి, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి పుల్లారావు, ఛీలంశెట్టి కిరణ్ కుమార్, బిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

బేతుపల్లి చెరువు వద్ద సహాయక చర్యలు

- మృత్యుంజయులై తిరిగొచ్చిన భద్రాచలం అగ్నిమాపక సిబ్బంది
- 11 గంటల పాటు చెట్టును పట్టుకొని ప్రాణాలు కాపాడుకున్న వెంకట్రామిరెడ్డి



భద్రాచలం, నవంబర్ 5 (జనంసాక్షి) : సహాయక చర్యల్లో భాగంగా చెరువులో చిక్కుకున్న వారిని కాపాడేందుకు వెళ్లి, తామే మృత్యువుతో పోరాడిన భద్రాచలం అగ్నిమాపక సిబ్బంది వెంకట్రామిరెడ్డి, నాజర్‌లు ప్రాణాలతో బయటపడ్డారు. పడవ బోల్తా పడటంతో చెరువులో కొట్టుకుపోయిన ఫైర్‌మెన్ వెంకట్రామిరెడ్డి చెట్టును పట్టుకొని సుమారు 11 గంటల పాటు ప్రాణాలను కాపాడుకున్నారు. గురువారం ఉదయం సహాయక సిబ్బంది వారిని గుర్తించి ఒడ్డుకు చేర్చడంతో ఊపిరి పీల్చుకున్నారు. సత్తుపల్లి మండలం బేతంపూడి చెరువులో పది మంది గల్లంతైన ఘటనలో భద్రాచలం అగ్నిమాపక శాఖకు చెందిన వెంకట్రామిరెడ్డి, డ్రైవర్ నాజర్ కూడా చిక్కుకున్నారు. అత్యవసర విధుల్లో భాగంగా అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం వెళ్లిన వీరు బుధవారం సాయంత్రం బేతంపూడి చెరువు వద్దకు చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి తొలుత ఐదుగురిని రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం మరో ముగ్గురిని రక్షించేందుకు వెళ్లిన సమయంలో పడవ బోల్తా పడటంతో పది మంది సిబ్బంది గల్లంతయ్యారు. వారిలో వెంకట్రామిరెడ్డి, నాజర్ కూడా ఉన్నారు. పడవ నుంచి కొట్టుకుపోయిన నాజర్ బోటును పట్టుకొని నీటిలోనే ఉండిపోయారు. గురువారం తెల్లవారుజామున ఆయనను గుర్తించిన అగ్నిమాపక, సహాయక సిబ్బంది ఒడ్డుకు చేర్చారు. మరోవైపు వెంకట్రామిరెడ్డి చెరువులోని ఓ చెట్టును పట్టుకొని రాత్రంతా గడిపారు. సుమారు 11 గంటల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నీటిలోనే ఉన్న ఆయనను గురువారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. మృత్యువును జయించి తిరిగి వచ్చిన తమ సహచరులను చూసి భద్రాచలం అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. పట్టణవాసులు సైతం వెంకట్రామిరెడ్డి, నాజర్‌ల ధైర్యసాహసాలను అభినందించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని కొనియాడారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (జనంసాక్షి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ,అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.. వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



శంషాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల, మదనపల్లి పాత తండా, పిల్లోని గూడ గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.3 కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మదనపల్లి పాత తండాలో పి1 రోడ్డు నుంచి మదనపల్లి తండా వరకు హెచ్ఎండీఏ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, పాలమాకుల గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాలమాకుల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కె. కోటేశ్వర్ గౌడ్, మదనపల్లి పాత తండా సర్పంచ్ మోహన్ నాయక్, సీనియర్ నాయకులు నీరటి రాజు, చంద్రారెడ్డి, ఎం. లక్ష్మీ లింగం, ప్రభాకర్ గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ. శ్రీకాంత్ గౌడ్, ప్రభాకర్ యాదవ్, రమేష్ పటేల్, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి

- కాలుష్య కోరల్లో మన్సూరాబాద్ ప్రజలు
- డంపింగ్ యార్డ్ తరలింపునకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ పాదయాత్ర
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు
- బొంగు వెంకటేష్ గౌడ్

హయత్‌నగర్, నవంబర్ 5 (జనం సాక్షి) : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలిసి గురువారం ఉదయం మన్సూరాబాద్ చౌరస్తా నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డ్ వరకు పాదయాత్ర నిర్వహించారు. డంపింగ్ యార్డ్ వద్దకు చేరుకున్న ఫెడరేషన్ నాయకులు అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చెత్త నిల్వ, వ్యర్థ పదార్థాల నిర్వహణ, దుర్వాసన, పొగ, కాలుష్య సమస్యలను పరిశీలించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, ఆటోనగర్ డంపింగ్ యార్డ్ కారణంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల



ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగ, గాలి కాలుష్యం, వ్యర్థాల వల్ల నీటి కాలుష్యం వంటి సమస్యలు ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. వందలాది కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో డంపింగ్ యార్డ్ కొనసాగడం వల్ల స్థానిక ప్రజలు నిత్యం ఆందోళనకు గురవుతున్నారని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై పడే ప్రభావాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించాలని కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని, పరిసర ప్రాంతాల్లో గాలి, నీటి నాణ్యతను పరీక్షించాలని, పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను పూర్తిస్థాయిలో తరలించే వరకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో బీసీ నాయకులు జలమోని రవీందర్ ముదిరాజ్, కొంగరి కృష్ణ, బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కే. గాంధీ నాయక్, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు చిప్పలపల్లి యాదగిరి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు నకిరేకంటి శ్రీకాంత్, చిప్పలపల్లి నరేందర్, చిప్పలపల్లి సురేష్, చేగూరి పరమేష్, జై భారత్ జాతీయ ఉపాధ్యక్షులు వంశీ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజు, సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదయ్య, జై భారత్ సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది గణేష్ గల్లా, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మధు మాదిగ, జై భారత్ ఎస్సీ, బీసీ, ఎస్టీ పోరాట వేదికల నాయకులు పాండు, గురువయ్య, శ్రీనివాస్ పిట్ల తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సీపీ తక్షణ స్పందన

- వినతి ఇచ్చిన 24 గంటల్లోనే చర్యలు..
- తాత్కాలిక ట్రాఫిక్ నియంత్రణ

కరీంనగర్ లీగల్, నవంబర్ 5 (జనంసాక్షి) : కరీంనగర్ కోర్టు సముదాయం ప్రధాన ద్వారాల వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తక్షణమే స్పందించారు. ఈ సమస్యపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ బుధవారం పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించగా, 24 గంటల్లోనే స్పందించి గురువారం ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు సిబ్బందిని పంపించారు. ట్రాఫిక్ సిబ్బందితో కలిసి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ సుంకె దేవకిషన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్, సీనియర్ న్యాయవాది పూరెల్లి రాములు తదితరులు కోర్టు వద్ద ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐలు బి. సంజీవ్, కే. అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తాత్కాలిక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. వినతిపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ట్రాఫిక్ సిబ్బందికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06.11.2026



ఈవీఎం గోదాంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు ఉండాలి

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వా,

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం నెలవారీ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనంతరం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎం గోదాం భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట నిఘా కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఎంతో ముఖ్యం

అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
అర్బన్ నియోజకవర్గంలో కొనసాగుతున్న పనుల్లో నాణ్యత ఎంతో ముఖ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 22, 25, 35వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు 20 లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డివిజన్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. అలాగే డివిజన్కు కోటి రూపాయల పనులు కూడా కొన్ని డివిజన్లో ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు.అమృత్ 2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అయితే పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి సూచించడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, కావున పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రధానంగా అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పడం జరిగిందన్నారు. అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర గల అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుందన్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన అధికారులు, కంపెనీ ప్రతినిధులు సందర్శించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 22వ డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి సుధా, 25వ డివిజన్ కార్పొరేటర్ చింతకాయల రాజేందర్, 35వ డివిజన కార్పొరేటర్ ఎర్రం సుధీర్, బీజేపీ నాయకులు పవన్ ముందడ , శ్రీనివాస్, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు


- పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు 15 రోజుల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు
- వారం రోజుల్లో గ్రామాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట(జనంసాక్షి):జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి నవంబర్ నెలలోనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు.తాగునీటి సరఫరాతో పాటు నీటి శుద్ధి, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలు, ఆవాసాల వారీగా తాగునీటి పరిస్థితిని అంచనా వేసి గ్రీన్, ఎల్లో, రెడ్ కేటగిరీలుగా విభజించాలని తెలిపారు.గురువారం కలెక్టరేట్ లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రత్యేక ప్రొఫార్మా ద్వారా వివరాలు సేకరించినట్లు తెలిపారు.మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా వ్యవస్థల ద్వారా నీటి సరఫరా, స్థానిక నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలన్నారు.నీటి సమస్యలు లేని ప్రాంతాలు, కొంత ఇబ్బంది ఉన్న ప్రాంతాలు,తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు.మండలాలు, గ్రామాల వారీగా అవసరమైన పనులు, వాటి అంచనా వ్యయాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకు 15 రోజుల్లోగా మిషన్ భగీరథ కనెక్షన్లు అందించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా తాగునీరు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో సుమారు 20 నుంచి 25 శాతం వరకు వృథా అవుతున్నట్లు తన పరిశీలనలో గుర్తించానని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అంచనాపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితిని వారం రోజుల్లో నివేదించాలని అధికారులను కోరారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి పైపులైన్ల ద్వారా నీరు వృథాగా డ్రైనేజీల్లోకి వెళ్తున్న ప్రాంతాలను గుర్తించి లీకేజీలను అరికట్టాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరాకు ప్రతి గ్రామ పంచాయతీలో ట్రాక్టర్, ట్యాంకర్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.భూగర్భ జలాల పరిస్థితిపై ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.నీటి వనరుల లభ్యత, బోర్‌వెల్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు.మిషన్ భగీరథ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రౌండ్ వాటర్ శాఖలు సమన్వయం తో పనిచేయాలని సూచించారు.విద్యుత్ సరఫరా అంతరాయాల వల్ల నీటి పంపింగ్ నిలిచిపో కుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న సీఐటీయు, హెచ్ఎంఎస్

- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు చందా రికవరీ ఉంటుంది
- ఏఐటీయుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్..



గోదావరిఖని, జనంసాక్షి: సింగరేణిలో కార్మికుల నుంచి రూ.50 చందా రికవరీని నిలిపివేయాలని సీఐటీయు యాజమాన్యానికి లేఖ రాయడాన్ని ఏఐటీయుసి తీవ్రంగా ఖండిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు.గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటీయుసి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ చందా రికవరీపై అక్కసుతో సీఐటీయు, హెచ్.ఎం.ఎస్ లు ఏఐటీయుసిపై కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గుర్తింపు సంఘంగా గెలిచిన ఏ యూనియన్ కైనా మళ్ళీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు చందా రికవరీ ఉంటుందన్న విషయం ఆ యూనియన్లకు తెలియదా అని ప్రశ్నించారు. గతంలో గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఉన్న హెచ్.ఎం.ఎస్ లకు చందా రికవరీ కాలేదా అని నిలదీశారు.సింగరేణి పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తున్న ఏఐటీయుసికి కార్మికులు సంతోషంగా చందా ఇస్తున్నారని, దీనిని నిలిపివేయాలని సిఐటియు లేఖ రాయడం కార్మిక వ్యతిరేక చర్య అని, దుర్మార్గమైన ఆలోచన అని పేర్కొన్నారు.కార్మికులను బతిమిలాడి, అధికారులను గడ్డం పట్టుకుని చందా రికవరీ చేస్తున్నారని హెచ్.ఎం.ఎస్ సోషల్ మీడియాలో పోస్టర్ పెట్టి ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. చందా విషయంలో అధికారులను గడ్డం పట్టుకునే అవసరం ఏఐటీయుసికి లేదన్నారు. చందా డబ్బులతోనే యూనియన్లు నడుస్తాయన్న సోయి వారికి లేదని, కేవలం కార్మికులను, అధికారులను బ్లాక్ మెయిల్ చేసి హెచ్.ఎం.ఎస్ డబ్బులు వసూలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంపై, ప్రభుత్వంపై పోరాటాలు చేయకుండా ఏఐటీయుసిపై అనవసరపు, అవగాహన లేని విమర్శలు చేయడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్ల ఉపయోగం లేదని, ఇది కేవలం కార్మికులను తప్పుదోవ పట్టించడమే అవుతుందన్నారు.ఏఐటీయుసి పోరాటాల ఫలితంగానే సింగరేణిలో అనేక హక్కులు సాధించడం వల్ల నేడు కార్మిక వర్గం వాటిని అనుభవిస్తుందన్నారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినా తిరిగి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు చందా రికవరీ ఉంటుందన్న విషయం సీఐటీయు, హెచ్.ఎం.ఎస్ లకు తెలియకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏఐటీయుసి నాయకులు సిద్దమల్ల రాజు, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, బలుసు రవి, దాసరి అనిల్, ప్రకాష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.





'జనంసాక్షి' ఎఫెక్ట్

ఆక్రమణపై కొరడా..

రోడ్డును ఆక్రమించి
పండ్ల దుకాణాలను తొలగించిన అధికారులు

కమాన్‌పూర్ (జనంసాక్షి):పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలో "రోడ్డును ఆక్రమిస్తున్న పండ్ల షాపు వ్యాపారులు.. పొంచి ఉన్న రోడ్డు ప్రమాదాలు..పట్టించుకోని అధికారులు" అనే శీర్షికతో ప్రచురితమైన "జనంసాక్షి" కథనానికి కమాన్ పూర్ మండల ప్రత్యేక అధికారి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి, ఎంపీడీవో సాదినేని ప్రియాంక స్పందించారు. వారి ఆదేశాల మేరకు కమాన్ పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తుడిచెర్ల రాము గ్రామపంచాయతీ సిబ్బందితో హుటాహుటిన కలిసి పండ్ల షాపుల వద్దకు వెళ్లి రోడ్డును ఆక్రమించి పెట్టిన పండ్ల ట్రే లను తొలగించి లోపల పెట్టించారు. మరోసారి రోడ్డుపై పండ్ల ట్రేలను పెడితే పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి రాము పండ్ల వ్యాపారులను నోటీసులు జారీ చేసి హెచ్చరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కా రం కోసం కృషి చేస్తున్న "జనంసాక్షి"కి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే

24 గంటల గడువు ప్రారంభం

అదుపులోకి తీసుకోవడానికి, అరెస్టుకు మధ్య వ్యత్యాసాన్ని చూపించి న్యాయపర మైన విచారణను ఆలస్యం చేయడానికి అది, కారులకు అనుమతిలేదు. ప్రాథమిక హక్కు లను తాత్కాలికంగా నిలిపివేయడం, ఆల స్యం చేయడం రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో చెల్లదు. వ్యక్తులను కోర్టులో హాజరుపర్చినప్పుడు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్లు కచ్చితంగా నమోదు చేయాలి. 24 గంటల నిబంధన పాటించారో లేదో పరిశీలించాలి" అని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది (రాబీజూతీవవఎ అనీబీతీబి). 24 గంటల డెడ్‌లైన్ విషయంలో ఒరిస్సా హైకోర్టు, మద్రాస్ హైకోర్టు, కేరళ హైకోర్టు వెలువరించిన అభిప్రాయాలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అధికారిక అరెస్టుకు ముందు నిర్బంధంలో ఉన్న కాలాన్ని మినహాయించడానికి ఆయా న్యాయస్థానాలు గతంలో అనుమతించాయి. దీన్ని అత్యున్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి కోర్టు వరకు ప్రయాణానికి పట్టే సమయాన్ని మినహా ఇంకే మినహాయింపులు ఉండకూడదని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణ సందర్భంగా సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది.

కేసు ఏంటంటే..?

త్రిపురలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో గతేడాది సెప్టెంబర్ 29న మధ్యాహ్నం సమయంలో నిందితుడు సుజిత్‌దాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే సెప్టెంబర్ 30 ఉదయం మాత్రమే అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. అయితే ఉద్దేశపూర్వకంగానే రికార్డుల్లో అరెస్టు సమయాన్ని ఆలస్యంగా చూపించారని నిందితుడి తరఫు న్యాయవాదులు వాదించారు. ఇది రాజ్యాంగంలోని నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందంటూ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. కానీ, అధికారికంగా అరెస్టు చేసిన సమయం నుంచే 24 గంటల గడువు వర్తిస్తుందని దర్యాప్తు సంస్థలు కోర్టుకు విన్నవించాయి. దీన్ని న్యాయస్థానం తోసిపుచ్చింది. అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డెడ్‌లైన్ వర్తిస్తుందంటూ తాజాగా తీర్పునిచ్చింది.

ఢిల్లీ నిరసనలపై నెలరోజుల్లోగా నివేదికను సమర్పించండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ నిరసనలపై దర్యాప్తు చేస్తున్న ఉన్నతస్థాయి కమిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నెలరోజుల్లోగా ప్రాథమిక వాస్తవ నిర్ధరణ నివేదికను సమర్పించాలని కోరింది.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో జరిగిన నిరసనల సమయంలో పోలీసుల బలప్రయోగంపై విచారణ జరుపుతున్న ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌పీసీ)కి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌పీసీ తన ప్రాథమిక వాస్తవ నిర్ధరణ నివేదికను నెలలోగా సమర్పించాలని కోరింది. మరిన్ని ఫిర్యాదుల కోసం ఎదురుచూస్తూ కమిటీ తన పనిని నిరవధికంగా వాయిదా వేయకూడదని పేర్కొంది. ఉన్నత స్థాయి కమిటీ వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారంతో ముందుకు సాగాలని స్పష్టం చేసింది. సంబంధిత అధికారుల నుంచి సమాధానాలను కోరాలని, అలాగే కోర్టు గుర్తించిన రెండు ప్రాధాన్యత అంశాలపై తన నివేదికను సమర్పించాలని చెప్పింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.


ఆ రెండింటి మధ్య చాలా వ్యత్యాసం ఉంది : సుప్రీంకోర్టు

పిటిషనర్లు, ఇతర సంబంధిత వ్యక్తుల తరఫు న్యాయవాదులను వారి వద్ద ఉన్న ఫిర్యాదులు, వీడియోలు, ఇతర సాక్ష్యాలను ఉన్నత స్థాయి కమిటీ పంపాలని సుప్రీంకోర్టు కోరింది. పిటిషనర్లు సమర్పించామని చెబుతున్న సమాచారానికి, కమిటీకి వాస్తవంగా చేరిన సమాచారానికి మధ్య వ్యత్యాసం ఉందని పేర్కొంది. కమిటీకి దాని పోర్టల్ ద్వారా, ప్రత్యక్షంగా చాలా తక్కువ ఫిర్యాదులు అందాయని వెల్లడించింది. బాధితులు స్వయంగా కమిటీని ఆశ్రయించకపోయినప్పటికీ, వారి తరఫున న్యాయవాదులు, ప్రజాహితం కోసం చేసే పనిచేసే వ్యక్తులు పంపిన సమాచారాన్ని కూడా పరిశీలించాలని హెచ్‌పీసీని సూచించింది. ఢిల్లీ నిరసనల్లో పోలీసుల బలప్రయోగంపై ఉన్నత స్థాయి కమిటీ అక్టోబర్ 31న సమర్పించిన నివేదిక కేవలం స్టేటస్ రిపోర్ట్ మాత్రమేనని తెలిపింది. అందులో ఎలాంటి నిజ నిర్ధరణలు లేవని స్పష్టం చేసింది. గోప్యతను పాటించాల్సిన అసాధారణ కారణాలు ఉంటే తప్ప, కమిటీ సాధారణంగా సంబంధిత నిర్ధరణలను ఇరుపక్షాలతో పంచుకోవాలని అభిప్రాయపడింది.

సిపిఐ నేతల అక్రమ అరెస్టులు సరికాదు

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్..సీఐ ఇంద్రసేనారెడ్డి నియంత పోకడలపై
- ముఖ్యమంత్రి సమగ్ర విచారణ చేపట్టాలి..
- సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి ధ్వజం..


గోదావరిఖని, జనంసాక్షి :



భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తిలక్ నగర్, ఎల్బీనగర్ శాఖ ఆధ్వర్యంలో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పేరుతో స్థానిక రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ చిరు వ్యాపారులను ఇబ్బందుల గురిచేస్తూ కూల్చివేతల ప్రారంభించి నెలలు, సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకుండా చిరు వ్యాపారం వీధిన పడేయడం వల్ల ఆర్థిక నష్టం జరుగుతుందని సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ చౌరస్తాలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపే కార్యక్రమం నిర్వహిస్తే స్థానిక ఎస్హెచ్ఓ ఇంద్రసేనారెడ్డి కార్యక్రమం వద్దకు వచ్చి సిపిఐ నాయకుల పై విచక్షణ రహితంగా ప్రవర్తించి సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఒక ప్రజా ప్రతినిధి అనే గౌరవం లేకుండా ఆ గౌరవంగా చేయి వేసుకొని, మెడపై దెబ్బలు కొట్టి షర్ట్ చింపి, అసభ్య పదజాలంతో ఇష్టానుసారంగా దూషణలు చేస్తూ, మీ సంగతి చెప్తా అని ఒక దొంగ వలె ఈడ్చికెల్లటువంటి సంఘటనపై సిపిఐ పార్టీ మాజీ శాసనసభ్యులు, జాతీయ నాయకులు చాడ వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పోరాటాలలో కమ్యూనిస్టులు ఎప్పుడు ముందుంటారని స్థానిక శాసనసభ్యులకు గుర్తు చేశారు, మీలాంటి శాసనసభ్యులు మంత్రులను ఎంతోమందిని చూశామని నీ నియంత పోకడలను తగ్గించుకోవాలని హెచ్చరించారు. ఈ పారిశ్రామిక ప్రాంతంలో ఏదైతే షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మిస్తామని స్థల పరిశీలన చేసి స్థానిక మేయర్ తోని ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తర్వాత స్థానిక రామగుండం జియం లలిత్ కుమార్ స్వయంగా వచ్చి కొబ్బరికాయ కొట్టిన తర్వాత కూడా ఎలా వాటిని నేలమట్టం చేస్తారని ఈ సందర్భంగా హెచ్చరించారు. పొట్టకూటికి బతికే దుకాణదారులపై ఎమ్మెల్యే కన్ను ఎందుకు పడిందో తెలియదు గానీ ఆయనే కట్టుకోమనడం మళ్ళీ ఆయనే కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కువ భూభాగం సింగరేణిదే ఉంటది కనుక సింగరేణి అధికారులతో ప్రొసిడింగ్ కాపీలు ఇప్పించి మున్సిపల్ అనుమతులు ఇప్పించిన అనంతరం నిర్మాణాలు చేపట్టాలని స్థానిక శాసనసభ్యుడికి హితువు పలికారు. కమ్యూనిస్టు నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని అన్యాయం జరిగితే ఖచ్చితంగా ఎదురు తిరిగి పోరాడుతామని ఈ సందర్భంగా తెలిపారు. గోదావరిఖని సీఐ విచక్షణ కోల్పోయి సిపిఐ నాయకులను ఒక ప్రజా ప్రతినిధిని ఈ విధంగా అరెస్టు చేయడానికి తీవ్రంగా పరిగణిస్తున్నామని సీఐ తన తీరు మార్చుకోకపోతే కమ్యూనిస్టు పార్టీ నుండి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా చాడ గారితో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు శనగరపు చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆరేపల్లి మానస్ కుమార్ ఉన్నారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్టు అమలుపై సమావేశం జరిగింది. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ గురించి కలెక్టర్ సమీక్షించారు.ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కింద రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ తీరు పట్ల ప్రత్యేక పర్యవేక్షణ జరుపుతూ, నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని నిబంధనలు పాటించే ఆసుపత్రులకే అనుమతులు, రెన్యూవల్స్ చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ నిబంధనలు పాటించని ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయకూడదని, నిబంధలకు అనుగుణంగా సదుపాయాలు కలిగి ఉన్న వారికి నిర్దేశిత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎవరైనా అవకతవకలకు ఆస్కారం కల్పించినట్లు ఫిర్యాదులు వస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులైన అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్నట్లు అయితే వెంటనే నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా, ప్రభుత్వం రూపొందించిన కొత్త నిబంధనలపై ఆసుపత్రుల నిర్వాహకులు అవగాహన పెంపొందించుకుని, వాటిని తుచ తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ, వైద్య వ్యవస్థ ప్రతిష్టను పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, నిజామాబాద్, బోధన్ ఐ.ఎం.ఏ శాఖల అధ్యక్షులు డాక్టర్ విశాల్, డాక్టర్ ముకరంజా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి యథేచ్ఛగా గండి..

- అన్ని షాపుల పైన తనిఖీలు నిర్వహించాలి.
- ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించని దుకాణాల యజమానులపై ప్రకారం చర్యలు తీసుకోవాలి.
- మున్సిపల్ కమిషనర్‌ను కోరిన కౌన్సిలర్ చందారాజు

జమ్మికుంట (జనంసాక్షి):
జమ్మికుంట పట్టణంలో వ్యాపార కార్యకలాపాల నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మార్వాడీలతోపాటు అన్ని షాపుల పైన తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్ రుసుములు చెల్లించని దుకాణాల యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ కు ఈ నెల రెండో తేదీన ఫిర్యాదు చేశానని జమ్మికుంట మున్సిపల్ 30 వార్డు కౌన్సిలర్ చందారాజు తెలిపారు.గురువారం చందారాజు పాత్రికేయులతో మాట్లాడుతూ తాను కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల సముదాయంలో గృహాల కొలతల ప్రకారం ప్రభుత్వానికి లైసెన్స్ రుసుము చెల్లించాల్సిన యజమానులు తప్పుడు సెల్ఫ్ డిక్లరేషన్ పత్రాలు పెట్టి లక్షలాది రూపాయల పన్నులను మున్సిపాలిటీకి చెల్లించకుండా ఎగవేస్తున్నారన్నారు.వీరికి స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయ నాయకులు అండగా నిలుస్తూ భరోసానిస్తుండడంతో గత కొన్ని సంవత్సరాలుగా జమ్మికుంట మున్సిపాలిటీకి ట్రేడ్ లైసెన్స్ ల రూపంలో రావలసిన లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు.ఈ విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని 30వ వార్డ్ పరిధిలోని దుకాణాల సముదాయాలపై విచారణ నిర్వహించి ఆయా దుకాణాల కొలతలు తీసుకొని మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా నష్టపరుస్తున్న షాపుల యాజమాన్యాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పన్నులు విధించి పెనాల్టీ ల రూపంలో మున్సిపాలిటీకి డబ్బులు కట్టించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కి ఇచ్చిన ఫిర్యాదులో కోరానన్నారు.అలాగే ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాపై పోటీ చేసి ఓడిపోయిన కొంతమంది మార్వాడీలను ప్రోత్సహిస్తూ ఒక ముఠాగా ఏర్పడి సంబంధిత వార్డు కౌన్సిలర్ లేదా అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఒక అసత్యపు ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారన్నారు.అధికారులు కానీ ఒక ప్రజాప్రతినిధిగా నేను కానీ ఒకవేళ డబ్బులు ఆశిస్తే షాపుల యజమానులకి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని,ఒక్కసారి మున్సిపల్ కార్యాలయం నుండి నోటీసులు సంబంధిత షాప్ యజమానులకు వెళితే దానికి సంపూర్ణ బాధ్యత మున్సిపల్ కార్యాలయానికి ఉంటుందన్న విషయాన్ని మీ అందరికీ తెలియజేస్తున్నానన్నారు.ఎన్నికల్లో గెలిచే దమ్ము లేక కొంతమంది పనిచేస్తున్న ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేయిస్తే ఎవరికి బెదిరేది లేదన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండా కూడా చాలామంది మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు.అలాంటి వారిని సైతం గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం మున్సిపల్ అధికారుల పైన ఉందని అన్నారు.



డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పుతున్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తుది దశ నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ధర్పల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 30 పడకల స్థాయి నుండి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆసుపత్రిగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిన నేపథ్యంలో రూ. 33.15 కోట్ల నిధులను వెచ్చిస్తూ అధునాతన వసతులతో నూతన భవన నిర్మాణం జరుపుతున్నారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే 90శాతం వరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, ఇంకనూ చేపట్టాల్సి ఉన్న తుది దశ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాలను కలెక్టర్ సందర్శించి పనుల నాణ్యతను నిశితంగా పరిశీలన జరిపారు. నాణ్యత విషయంలో ఎక్కడ కూడా రాజీ పడవద్దని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పెట్టుబడుల పేరుతో పలువురికి టోకరా ఎల్ఐసీ ఏజెంట్ అరెస్ట్

- బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు
- మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేయాలి : రూరల్ సీఐ శ్రీనివాస్

బోయిన్‌పల్లి, నవంబర్ 05 (జనంసాక్షి) : అధిక లాభాలు వస్తాయంటూ పెట్టుబడుల పేరుతో పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడిన సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ రాపెల్లి ప్రవీణ్ కుమార్‌ను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోదురుపాక, నీలోజిపల్లి గ్రామాలకు చెందిన పలువురిని అధిక లాభాల ఆశ చూపి పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేశాడు. బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా బెదిరింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో బోయిన్‌పల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్ నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరిచారు. అదేవిధంగా వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోనూ నిందితుడిపై మరో రెండు కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి చేతిలో ఇదే విధంగా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే భయపడకుండా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ సూచించారు.



నీటిలో మునిగి వ్యక్తి మృతి

వేల్పూర్ నవంబర్ 5 జనం సాక్షి :
వేల్పూర్ మండలంలోని పచ్చల నడుకుడ పెద్ద వాగులో పుట్ట మల్లేష్ అనే వ్యక్తి గణపతి ఇనుప కడ్డీల కొరకు వచ్చి నీటిలో మునిగి మృతి చెందాడు... పడకల్ గ్రామానికి చెందిన పుట్ట మల్లేష్ వయస్సు 37 సంవత్సరాలు అనే వ్యక్తి మామిడిపల్లిలో నివాసం ఉంటూ సమీప నలుగురు బంధువులతో ఈరోజు పచ్చల నడుకుడ పెద్ద వాగులో ఉన్న గణపతి ఇనుప కడ్డీల కొరకు వచ్చి నీటిలో మునిగి మృతి చెందాడు. ఇనుప పట్టీల కొరకు వచ్చిన నలుగురిలో ఇద్దరు ఆడవారు కాగా ఇద్దరు మగవాళ్లకు ఈత రాకపోవడంతో బ్రిడ్జ్ పిల్లర్ వద్ద నీటి లోతు అధికంగా ఉండటంతో మరొక వ్యక్తి చూస్తుండగానే నీటిలో మునిగి పోవడం జరిగిందని అతనితో ఉన్న వ్యక్తి తెలిపాడు. నలుగురు సమీప బంధువులు ఇనుప కడ్డీలతో కొరకు వచ్చి అందులో ఒకరు కనుల ముందే మునిగిపోవడంతో అర్ధనాదాలు చేసినప్పటికీ ఎవరు రాకపోవడంతో కళ్ళముందే నీటిలో మునిగి చనిపోవడం జరిగింది... ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేపట్టి పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందని ఎస్సై సందీప్ తెలిపారు

బిజెపి,బిఆర్ఎస్ కౌన్సిలర్ల వాకౌట్

- అవినీతి,అక్రమాలకు కేరాఫ్‌గా మున్సిపాలిటీ
- మున్సిపల్ పాలకవర్గం,అధికారులపై ఆరోపణ



ఆర్మూర్,నవంబర్ 5(జనంసాక్షి): ఆర్మూర్ మున్సిపాలిటీలో సర్వసభ్య సమావేశం కాస్త బిజెపి,బిఆర్ఎస్ కౌన్సిలర్ల వాకౌట్ కు దారితీసింది. గురువారం సర్వసభ్య సమావేశంలో 28 అంశాలను ప్రవేశపెట్టగా ఆమోదం జరిపేందుకు చర్చ జరిపారు. సమావేశం జరుగుతుండగానే బిజెపి,బిఆర్ఎస్ కౌన్సిలర్లు ముందస్తుగా మున్సిపల్ పాలకవర్గం,మున్సిపల్ అధికారులను అవినీతి అక్రమాలు,మున్సిపాలిటీలో జరుగుతున్న అవకతవకలపై చర్చకు పట్టుబట్టారు.సమావేశంలో జరుగుతున్న తీరుకు నిరసనగా బిజెపి,బిఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం మధ్య నుండే వాకౌట్ అయ్యారు.మున్సిపల్ సమావేశం నుండి బయటకు వచ్చి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

అంతా అవినీతి,అక్రమాలే..
ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మధ్య నుండి వాకౌట్ చేశారు.అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ పృథ్వి,బిజెపి కౌన్సిలర్లు ఖందేశ్ ప్రశాంత్, బొట్టు రాజు మీడియాతో మాట్లాడారు.మున్సిపల్ చైర్ పర్సన్,మున్సిపల్ అధికారులు పూర్తిగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.
అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ, ప్రభుత్వ భూములు కాజేస్తున్న మున్సిపల్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులకు అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్న మాజీ చైర్మన్ కే ఇదే పాలకవర్గం,అధికారులు న్యాయం చేయలేదన్నారు.మరి సామాన్య ప్రజల సంగతి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు.సిద్దుల గుట్టను ఆనుకుని ఉన్న పెట్రోల్ బంక్ నిర్మాణంలో నాలుగు గంటల భూమి కబ్జాకు గురైందని,ఓ వెంచర్ ఏర్పాటులో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా జరిగిందని ఆరోపించారు.ఏడో వార్డులో ప్రభుత్వ భూములకు మున్సిపల్ అధికారులు ఎలాంటి అనుమతులు ఇచ్చారో ప్రజలకు తెలియజేయాలన్నారు.23 వ వార్డులో నాలుగు సార్లు మిషన్ భగీరథ పైపులు సరి చేయించిన మళ్లీ చెడిపోతున్నాయన్నారు.మిషన్ భగీరథ అధికారులు,మున్సిపల్ అధికారులు కుమ్మక్కై సంతకాలు చేయించుకుని అదే పైపులను సరిచేస్తూ బిల్లులను తీసుకుంటున్నారని ప్రధానంగా ఆరోపించారు. ప్రజల పక్షాన వార్డుల అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతూ ప్రశ్నిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి,బిఆర్ఎస్ కౌన్సిలర్లు,నాయకులు కవిత ఈశ్వర్, పోచంపాడు శ్రీనివాస్, అజీమ్,నహీం, నదీమ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తేజస్ విద్యార్థులు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ
- విద్యార్థులను అభినందించిన చైర్మన్ సతీష్‌రావు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 05 (జనంసాక్షి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జూనియర్ కళాశాలల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తేజస్ డిఫెన్స్ అకాడమీ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్ విభాగాల్లో రాణించి పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మణిచంద్రిక, బాలుర విభాగంలో అక్షయ్ బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. సాఫ్ట్‌బాల్‌లో మాహి, అక్షిత్ తేజ, వర్షిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
ఈ సందర్భంగా తేజస్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్. సతీష్‌రావు, డైరెక్టర్ సీహెచ్. మౌనికరావు, ప్రిన్సిపల్ కిషన్‌రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చైర్మన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన బాస్కెట్‌బాల్ కోచ్ జీవన్, వ్యాయామ ఉపాధ్యాయులను యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. విద్యతోపాటు క్రీడలు, శారీరక దృఢత్వం, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 70 శాతం ప్రసవాలే లక్ష్యం

- ప్రస్తుతం 50 శాతంగా ఉన్న సంఖ్య పెంచాలి
- పెద్దపల్లి ఎంసీహెచ్‌లో నెలకు 300 ప్రసవాలు జరగాలి
- గోదావరిఖని ఆసుపత్రిలో 200 ప్రసవాలకు కార్యాచరణ
- గర్భిణులకు నిరంతర ఫాలోఅప్ చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, నవంబర్ 05 (జనంసాక్షి): జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను ప్రస్తుతమున్న 50 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గర్భిణులకు వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల పెంపుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ సదుపాయాలు, వైద్య సేవలపై వారికి వివరించి, అక్కడే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. పెద్దపల్లి మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో నెలకు కనీసం 300, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 200 ప్రసవాలు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గర్భిణులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు, ప్రసవ సేవలు సకాలంలో అందించాలని, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇదిలా ఉండగా, జాతీయస్థాయి ఎయిడ్స్ సురక్షిత కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి అవార్డులు సాధించడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. తన ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇనుప రేకులు గుచ్చుకుని యువకుడి మృతి

జవహర్‌నగర్, (జనంసాక్షి): ప్రమాదకరంగా ఇనుప రేకుల లోడుతో వెళ్తున్న ట్రాలీ ఆటో యాప్రాల్‌లో బుధవారం సాయంత్రం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఆటో వెనుక నుంచి బయటకు పొడుచుకొచ్చిన పదునైన రేకులు బైక్‌పై వెళ్తున్న యువకుడి మెడ, భుజంలోకి గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. బాలాజీనగర్‌కు చెందిన కొయ్యాడ భరత్‌గౌడ్ (29) బుధవారం సాయంత్రం బైక్‌పై యాప్రాల్ నుంచి బాలాజీ నగర్ వైపు వెళ్తుండగా నయారా పెట్రోల్ బంకు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 7.17 గంటలకు మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృ మరణాల నివారణపై వైద్య సిబ్బందికి శిక్షణ

- హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించాలి
- 12 వారాల్లోపు ప్రతి గర్భిణీకి 100 శాతం నమోదు తప్పనిసరి: రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 5 (జనం సాక్షి) : జిల్లాలో మాతృ మరణాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ సుధీర సూచించారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, నమోదు, సురక్షిత ప్రసవాలపై వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర మాట్లాడుతూ ప్రతి గర్భిణీని గర్భధారణ జరిగిన 12 వారాల్లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించడంతో పాటు కనీసం తొమ్మిది వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. రక్తహీనత, అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, సికిల్ సెల్ రక్తహీనత తదితర సమస్యలున్న వారిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రసవానికి ముందుగానే అవసరమైన వైద్య సదుపాయాలతో ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు.
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ఒక్క మాతృ మరణం కూడా సంభవించకుండా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ శిరీష, డాక్టర్ సురేఖ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డాక్టర్ సంతోషి, డాక్టర్ శర్వాణి, జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఎంపీహెచ్ఏలు పాల్గొన్నారు.

సరిహద్దుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి


- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 5 (జనం సాక్షి); భూముల రీ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సరిహద్దుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామ పరిధిలోని జవహర్ లాల్ తండాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గురువారం రెవెన్యూ, అటవీ, సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలోని పట్టా, అటవీ భూముల సరిహద్దుల వివరాలు పకడ్బందీగా సేకరించి, పారదర్శకంగా నమోదు చేయాలని, ఆ వివరాల గురించి రైతులకు, పట్టాదారులకు తెలియజేసి అవగాహన కల్పించాలని సూచించారు. భూముల హద్దులు, సర్వే నంబర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఇట్టి పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ నారాయణ రెడ్డి, అటవీ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో 64 ఉద్యోగాల భర్తీకి నవంబర్ 10న జాబ్ మేళా

సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

పెద్దపల్లి,నవంబర్ 05(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల నవంబర్ 10వ తేదీ మంగళవారం రోజున జాబ్ మేళా నిర్వహించనున్నట్లు లిజిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్‌లి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తు, గది నంబర్ 233, పెద్దకల్వల, పెద్దపల్లిలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 64 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిలో 60 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు, 4 ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలని, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పురుషులు, మహిళలు ఇద్దరూ అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 నుంచి రూ.18,000 వరకు జీతంతో పాటు (టీఏడీఏ) ఇన్సెంటివ్స్ అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు పెద్దపల్లి జిల్లా పరిధిలోనే పని ప్రదేశం ఉంటుందని వెల్లడించారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 10వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు తమ అప్‌డేటెడ్ సీవీ / రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, అప్‌డేటెడ్ ఆధార్ కార్డు జిరాక్స్,అనుభవ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళా సంఘ భవనాలకు రూ.46లక్షలు మంజూరు


- భూమి పూజ చేసిన సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్
- మహిళా సాధికారతకు బాటలు వేస్తున్న మంత్రివర్యులు
- ఉపాధి హామీ నిధులతో మూడు భవనాల నిర్మాణం
- మంత్రి పొన్నంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మహిళలు



చిగురుమామిడి నవంబర్ 05(జనంసాక్షి): చిగురుమామిడి గ్రామంలోని మహిళా వీఓ సంఘాల బలోపేతానికి రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో రూ.46లక్షల నిధులు మంజూరయ్యాయి.ఈ నిధులతో గ్రామంలో నిర్మించ తలపెట్టిన మూడు మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు గురువారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి శాస్త్రోక్తంగా ముగ్గు పోసి,కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆకవరం భవాని గారు మాట్లాడుతూ గ్రామీణ మహిళల మరియు మహిళా సంఘ సభ్యుల సర్వతోముఖాభివృద్ధికి ఈ సంఘ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.చిగురుమామిడి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, మహిళల అభ్యున్నతి కోసం నిధులు మంజూరు చేయించిన మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌కు చిగురుమామిడి గ్రామ ప్రజల తరపున, పాలకవర్గం, మహిళా సంఘాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలియజేశారు.మంత్రి సహకారంతో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా ఈ మూడు భవనాల నిర్మాణాన్ని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. మహిళలు ఒకచోట చేరి తమ సంఘాల అభివృద్ధిపై చర్చించుకోవడానికి, వ్యాపార, ఉపాధి మార్గాలను మెరుగుపరుచుకోవడానికి ఈ భవనాలు ఒక చక్కని వేదికగా మారుతాయన్నారు.ఈ భూమి పూజ,ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్,పీఆర్ ఏఈ నిరంజన్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ రెడ్డి,మహిళా సమాఖ్య మండల ఏపీఎం రజిత,వార్డు సభ్యులు పన్యాల అన్నపూర్ణ,పోతర్ల శివాంజనేయులు,పోతరవేణి అనిల్, దున్నపోతుల సౌందర్య, కనుమల్ల లావణ్య,వేల్పుల భాగ్య,చెరుకు సమ్మయ్యతోపాటు ఐకేపీ సీసీలు, సీఏలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల లచ్చిరెడ్డి,జిల్లెల్ల రమేష్,కవ్వంపల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే నిజామాబాద్ రూరల్‌కు అత్యధికంగా 128 మహిళా సంఘ భవనాలు మంజూరు

- సిరికొండ మహిళా సమాఖ్యకు రూ.2.02 కోట్ల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి



సిరికొండ, నవంబర్ 05 జనం సాక్షి: రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 128 మహిళా సంఘ భవనాలను మంజూరు చేయించామని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిరికొండ మహిళా సమాఖ్యకు రూ.2 కోట్ల 2 లక్షల విలువైన చెక్కును ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలు మరింత బలోపేతం కావడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 128 మహిళా సంఘ భవనాలు మంజూరు చేయించడం నియోజకవర్గంలోని మహిళా సంఘాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సిరికొండ మండల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు ఉమ్మాజి నరేష్, గొల్ల ఎర్రన్న, బాకారం రవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, దేగం నర్సయ్య, నర్సారెడ్డి, చందర్ నాయక్, ఆయా గ్రామాల సర్పంచులు లతా, భాస్కర్, నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

311 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- ఖరీఫ్ కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- సన్న ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్
- గన్నీ సంచులు, తాగునీరు, రవాణా సదుపాయాలు కల్పించాలి
- అధికారులకు అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశం



పెద్దపల్లి, నవంబర్ 05 (జనంసాక్షి): ఖరీఫ్ 2026 సీజన్ ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో ప్రతిపాదించిన 311 కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని, ధాన్యం నిల్వకు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే లా రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. సన్న ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రశీదులు అందించాలని, వివరాలను యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో కేంద్రాలను సందర్శిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం. శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా కోర్టు చౌరస్తా

ప్రజల సౌలభ్యానికి ఫైలాన్ తొలగించాం : నగర మేయర్ మహంకాళి స్వామి

గోదావరిఖని, జనంసాక్షి : ప్రమాదాలకు నిలయంగా కోర్టు చౌరస్తా మారిందని.. ప్రజల సౌలభ్యానికి ఫైలాన్ తొలగించాల్సి వచ్చిందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. రామగుండంలో టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని తుడిచివేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. చందర్ ఆనవాళ్లను తుడవడం మాలాంటి వారికి సాధ్యమా.. ఆయన ఆనవాళ్ళు తుడిచేస్తే చెరిగే ఆనవాళ్ల అంటూ వ్యంగంగా మాట్లాడారు. ఆర్ఎఫ్సిఎల్‌లో ఉద్యోగాల దందా పేరుతో కోట్లాది రూపాయలు వసూల్ చేసి, అనేకమంది చావుకు కారణమైన చందర్ ఆనవాళ్లను మేము ఎలా తుడిచి వేస్తామని అన్నారు. ఫైలాన్ కారణంగా ఇప్పటికే నలుగురు చనిపోవడం జరిగిందని, మరో 50 మంది వరకు అంగవైకల్యం పొందారని అందుకే ప్రజల ప్రాణాలను రక్షించడం కోసం ఫైలాన్ ను అక్కడి నుండి తీసి త్వరలో నిర్మాణం కానున్న అంబేద్కర్ పార్క్ లో పెట్టాలని ఆలోచన చేయడం జరిగిందని వెల్లడించారు. బహుశా మాజీ ఎమ్మెల్యే చందర్ కు ప్రజల ప్రాణాలు పోవడం ఇష్టంగా ఉందేమో అందుకే ఫైలాన్ అక్కడే ఉండాలని అంత రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. కౌశిక హరి రామగుండంలో హత్య రాజకీయాలకు తెరలేపిన వ్యక్తి అని నిత్యం చనిపోయిన వారి కుటుంబాల అర్ధనాదాలతో కౌశిక హరి ఆనందం పొందుతారని, కౌశిక హరి ఒక రాజకీయ వ్యభిచారి, ఎప్పుడూ ఏదో ఒక పార్టీ మారుతూ ఉంటారని మేయర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ 5 సంవత్సరాల పాలనలో రామగుండం 20 సంవత్సరాలు వెనక్కి వెళితే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వంతో మాట్లాడి వేల కోట్ల రూపాయలు తీసుకువచ్చి రామగుండాన్ని నవనిర్మాణం చేస్తూ ఉంటే కల్లులేని టిఆర్ఎస్ నాయకులు రామగుండంలో అభివృద్ధే జరగడం లేదంటూ తప్పుడు కూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం ప్రజలు కాంగ్రెస్ పాలనే కోరుకుంటున్నారని రౌడీల రాజ్యం రావద్దని ఆలోచన చేస్తున్నారని అన్నారు. మా కార్పొరేటర్ సోదరుడు మేకల సమ్మయ్య ఫైలాన్ విషయంలో తెలియకుండా కౌన్సిల్ సమావేశంలో తీర్మానం జరిగిందని ఫైలాన్ పెట్టారని మాట్లాడడం జరిగిందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు ముస్తఫా,సాంబమూర్తి,గట్ల రమేష్, దూళికట్ట సతీష్, యుగంధర్ , వెంగల బాపు పద్మ ,బాలసాని తిరుపతి గౌడ్, సాగి సంతోష్ రావు, నాయకులు మారెల్లి రాజిరెడ్డి,తిప్పారపు శ్రీనివాస్, దాసరి విజయ్,కల్వల రంజిత్, కంకణాల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యూర్ ప్రాంత అభివృద్ధికి అధికారుల సమన్వయం అవసరం



శేరిలింగంపల్లి, నవంబర్ 5 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి వ్యూహాత్మకంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతుందని, తదనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగంకూడా వివిధ విభాగాల మధ్య సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సర్ఫరాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన క్యూర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి అధ్యక్షత వహించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. కాగా క్యూర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి సమావేశానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సైతం హాజరయ్యారు. ఈ సమావేశంలో క్యూర్ చట్టం అమలు, క్యూర్ ప్రాంత పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ఏజెన్సీల మధ్య సమన్వయంవంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొని చర్చల్లో భాగస్వాములు కావడం గమనార్హం.

కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటం

- కనీస వేతనం రూ.42 వేలు చెల్లించాలి
- బీపీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జెండా ఆవిష్కరణ

చర్లపల్లి, నవంబర్ 5 (జనం సాక్షి) : కార్మిక హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలే మార్గమని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్ అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని బీపీసీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న బీపీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కోశాధికారి పి.గణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర అశోక్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. పరిశ్రమల్లో యాజమాన్యాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.42 వేల కనీస వేతనం చెల్లించాలని



డిమాండ్ చేశారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ప్రసూతి సెలవులు అమలు చేయాలని, నెలవారీ వేతనాలను ప్రతినెలా ఒకటో తేదీన బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించాలన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్మికుల శ్రమ లేకుండా పరిశ్రమల్లో ఉత్పత్తి, అభివృద్ధి సాధ్యం కాదని యాజమాన్యాలు గుర్తించాలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటితంగా ఉండాలని, యాజమాన్యాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బివి.సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమన్నారు. కార్మికులకు న్యాయంగా దక్కాల్సిన వేతనాలు, హక్కులు, సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాక్ పరిశ్రమ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.మణికంఠ, గండూరి ఫుడ్స్ ప్రతినిధి రవీందర్‌రెడ్డి, బీపీసీఎల్ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఖాజా, హార్డ్‌కేస్ ఇంజినీరింగ్ ప్రతినిధి రమేష్, బీపీసీఎల్ కాంట్రాక్టు యూనియన్ నాయకులు శంకర్, రమేష్, నరేందర్, దినేష్, రాజు, శ్రీరామ్, బాలు, కిరణ్, కార్మికులు, లారీ యజమానులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ అజయ్

ఆత్మకూర్, నవంబర్ 5 (జనం సాక్షి) : పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి హామీ పని కల్పించాలని, పని దినాలను 200 రోజులకు పెంచి రోజు కూలీ రూ.800 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలని, మేట్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6న హైదరాబాద్ సీఆర్డీ కమిషనరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ గురువారం ఆత్మకూరు మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి అనేక కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలు ఏర్పడ్డాయని, విస్తరణ పేరుతో అనేక గ్రామాలను వీటిలో విలీనం చేసి గ్రామీణ ఉపాధి హామీ పనిని రద్దు చేశారని అన్నారు. దీంతో



రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు పని లేక వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన కొత్త వీబీజీ రాంజీ చట్టంలోనైనా పట్టణ పేదలకు ఉపాధి కల్పిస్తారని ఆశించినా నిరాశే మిగిలిందన్నారు.విలీన గ్రామాలతో పాటు పట్టణ పేదలందరికీ వీబీజీ గ్రామ్ జీ పనిని విస్తరించాలని, 200 రోజుల పని, రూ.800 కూలీ ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సీనియర్ మేట్లు, మేట్లను గుర్తించి కనీస వేతనం నిర్ణయించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 150 రోజుల పని, రూ.400 కూలీ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి రెండేళ్లు కావస్తున్నా అమలు చేయలేదన్నారు. కొత్త జాబ్ కార్డులు ఇవ్వడం లేదని, ఉన్న వాటిలో కొత్త పేర్లు చేర్చడం లేదని, ఆన్ లైన్ మస్టర్, రోజూ రెండుసార్లు ఫోటోల పేరుతో కూలీలను వేధిస్తున్నారని విమర్శించారు. నెట్ వర్క్ లేని చోట ఫోటోలు అప్ లోడ్ కాక వేతనాలు రావడం లేదని, పని ప్రదేశాల్లో తాగునీరు, మెడికల్ కిట్, సమ్మర్ అలవెన్స్ వంటి కనీస సౌకర్యాలు లేవని, వారం వారం చెల్లింపులు నిలిచిపోయాయని అన్నారు. కూలీలకు గ్రామ పోస్టాఫీసుల ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు.నవంబర్ 6న హైదరాబాద్ ధర్నాలో ఉపాధి కూలీలు, మేట్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అలివేల, నర్సింహ, వెంకటేష్, సత్యమ్మ, ప్రమీల, పింకీ, బీమన్న, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

నడిగడ్డ రైతులకు ఎకరాకు రూ.లక్ష పంట నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలనరసింహ డిమాండ్



మల్దకల్, నవంబర్ 5 (జనంసాక్షి) : జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాల నరసింహ,సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు నేతృత్వంలోని సీపీఐ బృందం గురువారం మండలంలోని ఎల్కూర్, పాల్వాయి గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎం.బాల నరసింహ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు కురవక పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు సుమారు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి జోగులాంబ గద్వాల జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను అధికారికంగా గుర్తించి,నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.లక్ష చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జి.రంగన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రవీణ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు వెంకటేష్, నాగర్ కర్నూల్ జిల్లా నాయకుడు శివ, మండల నాయకులులక్ష్మయ్య, గోకారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



తాండూరు, నవంబర్ 5 (జనంసాక్షి) : విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొని, విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, నవంబర్ 5 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు కార్యకర్తలకు సూచించారు నందిగామ మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి గురువారం మంత్రి కార్యక్రమంపై సమీక్షించారు. ఈ నెల 7వ తేదీన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి నందిగామకు రానున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ భారీ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నాలుగు ప్రారంభోత్సవాలు ఒకే రోజు

ఎన్నో ఏళ్లుగా పాత భవనంలో ఇబ్బందులు పడుతున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంతో పాటు కొత్త హంగులతో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ భవనం ప్రారంభంతో నందిగామ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. నందిగామ మండలానికి



సొంత తహసిల్దార్ కార్యాలయం కల సైతం నెరవేరబోతోంది.. మంత్రి చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నారని ఎమ్మెల్యే తెలిపారు

సెంటర్ లైటింగ్ ప్రారంభం..

మండల కేంద్రంతోపాటు పాత జాతీయ రహదారిపై ఉన్న వీధిలైట్లను సైతం మంత్రి ప్రారంభించనున్నారు. “మంత్రి పర్యటన నందిగామ అభివృద్ధికి మైలురాయిగా నిలవాలి. ఒక్క లోపం కూడా లేకుండా చూడండి” అని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుమార్ గౌడ్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు జంగా నరసింహ మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా, నవంబర్ 5 (జనం సాక్షి) : ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గ లోని మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు రూ.2 కోట్ల 92 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను స్థానిక మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ప్రజలకు అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం వివిధ కాలనీల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, ఏఈ స్పందన, నాయకులు ఉల్లెం బాలరాజు, గుమ్మడి జంపాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శివరాం ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, దేవేందర్ కుమార్, నరసింహ గౌడ్, మల్లారెడ్డి, దేవి రాజ్, చారి, బాలయ్య గౌడ్, రాజు, మల్లేష్ గౌడ్, అమరేంద్రబాబు, సింగపాక లింగం, రామకృష్ణ, కిరణ్, జయపాల్, లింగం, పోచయ్య, అంజయ్య, సుధాకర్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, పూస రమేష్, కుమార్, చంద్రశేఖర్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్ తదితరులు మరియు ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి..

- నిందితుడికి 20 ఏళ్ల జైలు
- బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం

అల్వాల్, నవంబరు 5 (జనంసాక్షి) : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మేడ్చల్ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. అల్వాల్ పోలీసుల వివరాల ప్రకారం.. ఖానాజిగూడ అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఎటికెల రాజశేఖర్ అలియాస్ చిన్నా (27)పై 2019లో అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో



లైంగిక దాడి కేసు నమోదైంది. ఈ కేసులో విచారణ చేపట్టిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో పోక్సో చట్టంలోని సెక్షన్ 5 రెడ్‌విత్ 6 కింద 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధించింది. ఐపీసీ సెక్షన్ 363 కింద ఐదేళ్లు, సెక్షన్ 377 కింద ఏడేళ్లు, సెక్షన్ 506 కింద ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానాలు విధించింది. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ పి.యాదగిరి, ఏసీపీ ఏవీఆర్ నర్సింహారావు దర్యాప్తు చేయగా, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రభాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. సీడీఓలు శ్రీనివాస్, సురేశ్, లైజన్ అధికారి ఏఎస్సై కోటేశ్వరి సహకరించారు. పకడ్బందీ దర్యాప్తు, ఆధారాల సేకరణ, సమర్థవంతమైన వాదనలతో నిందితుడికి శిక్ష పడినట్లు అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత్ తెలిపారు.

విద్యార్థుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం

- ఆధునిక వసతులతో కొత్త భవనం



సనత్‌నగర్, నవంబర్ 5 (జనం సాక్షి) : సనత్ నగర్ డివిజన్ పరిధిలోని టీఆర్‌టీ 1171లో ఉన్న ప్రభుత్వ రౌండ్ టేబుల్ పాఠశాలకు మహర్దశ పట్టనుంది. పాతబడిన పాఠశాల భవనం కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో పాత పాఠశాల భవనాన్ని పూర్తిగా తొలగించి, నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సనత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన భవనానికి పునాది పనులు ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో పాఠశాలను నిర్మించి విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మెరుగైన వసతులు కలగడంతో పాటు విద్యాబోధనకు అనుకూలమైన వాతావరణం ఏర్పడనుంది. పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన ఈ చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రతినిధి అయ్యన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుమేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులను ఆదేశించిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

బొంరాస్‌పేట, నవంబర్ 6 (జనం సాక్షి) : కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌లో గురువారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ నవంబర్ 7 నుండి 9 వరకు నిర్వహించే రైతు మేళా ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రైతు మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొనే కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రైతు మేళా నిర్వహించే ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేవిధంగా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆయన తెలిపారు.వీవీఐపీ, వీఐపీ, అధికారులు, మీడియా, జనరల్ పార్కింగ్ ఏర్పాటుతో పాటు బోజన వసతులకు సంబంధించి వేరువేరుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతు మేళాకు అధికారికంగా ఇచ్చిన గుర్తిపు కార్డులు ఉన్నవారిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.రైతు మేళాకు వచ్చే వారికి సభా స్థలికి సులభంగా చేరుకునే విధంగా రహదారుల వెంబడి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతు మేళా ప్రాంగణంలో త్రాగు నీరు కొరత లేకుండా సమృద్ధిగా ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రైతు మేళా ప్రాంగణంలో టాయిలెట్లు ఏర్పాటుతో పాటు నవంబర్ 9న జరిగే బహిరంగ సభకు వచ్చే ప్రజలకు అనుగుణంగా పార్కింగ్ ప్రాంతాల్లో టాయిలెట్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.రైతు మేళా సందర్భంగా వ్యవసాయ అనుబంధ శాఖలైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలు, పశు సంవర్ధక , మత్స్య శాఖ ల ద్వారా ఏర్పాటు చేసే స్టాళ్ల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ



సాగు, రైతులకు అధిక దిగుబడి వచ్చే పంటలపై అవగాహనతో పాటు తగు సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జడ్పీ సీఈఓ సుధీర్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06 నవంబర్ 2026

7న గద్వాలలో వేదమ్మ సంస్మరణ సభ

చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి



గద్వాల నడిగడ్డ, నవంబర్ 5 (జనం సాక్షి) : కామ్రేడ్ సుగుణ వర్ధంతి సందర్భంగా వీరమాత వేదమ్మ సంస్మరణ సభ శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తాలోని మామార్ట్ ఎస్వీఎస్ బంకెట్ హాల్ లో ఉదయం 10 గంటల నుండి ఒకటి 30 వరకు సభ నిర్వహిస్తున్నట్లు చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి. జ్యోతి తెలిపారు. వేదమ్మ సంస్మరణ సభ నిర్వహణ సందర్భంగా, ఈమధ్య మరణించిన వేదమ్మను స్మరించుకుంటూ నడిగడ్డ ఎంతోమంది విప్లవ యోధులకు జన్మనిచ్చిందని, అలాంటి యోధులలో కామ్రేడ్ సుగుణను కన్న వీరమాత వేదమ్మ ఒకరనీ, కామ్రేడ్ సుగుణ వర్ధంతిని ప్రతి సంవత్సరం అప్పటి సమకాలీన అంశం పైన జరుపుకుంటున్నామని, అక్టోబర్ 23వ తేదీ కామ్రేడ్ సుగుణ వర్ధంతి, ఆమె కన్న తల్లి, అభ్యుదయ భావాలకు అండగా ఉన్న వేదమ్మను స్మరిస్తూ ఈ సందర్భంగా వేదమ్మ గురించి వచ్చిన పుస్తకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందనీ, 86 సంవత్సరాల లో సహజ మరణం పొందిన వేదమ్మ ఒక భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిందనీ, గద్వాల లో ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ గా పనిచేస్తున్న బన్నూరు రామిరెడ్డిని పెళ్లి చేసుకుని గద్వాల పట్టణానికి వచ్చిందనీ ,కమ్యూనిస్టు భావాలున్న రామిరెడ్డి ప్రభావం పిల్లల పైన పడటం 80 వ దశకం లో విప్లవ విద్యార్థి ఉద్యమాలు రావడంతో, విద్యార్థి ఉద్యమాల వల్ల వేదమ్మ పెద్ద కూతురు సుగుణ ఉద్యమంలో చేరి పూర్తి కాలశీ మావోయిస్టు పార్టీలో పనిచేసి 2003 లో ఎన్కౌంటర్ అయిందని, తన కూతురు ఉద్యమ ఆచరణ వల్లనే తను కూడా సమాజంలో అసమానతలు గుర్తించి సమాజ మార్పును కోరుకున్నదనీ,ఇంటికి వచ్చిన అందరిని ఆదరించి వారికి తిండిపెట్టి ప్రేమగా మాట్లాడటం ఆమె వ్యక్తిత్వానికి నిదర్శనం అని, కరుడుగట్టిన కుల సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన, నేటి సమాజంలో ఉన్న మార్పులకు అనుగుణంగా తన భావాలు కూడా మార్చుకుంటూ కులమత వర్గ బేధాలు లేని సమాజం రావాలని కోరుకున్న వేదమ్మ అందరికీ ఆదర్శం అని, తను మరణించిన తర్వాత కూడా తన కళ్ళను తన శరీరాన్ని గద్వాల మెడికల్ కాలేజ్ కి దానమిచ్చి అందరికీ ఇలా చేయాలని ఆదర్శంగా నిలిచిందని, ఇప్పటి కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ పాలన కుల మత భేదాలను పెంచి పోషిస్తుందనీ, దీనికి తాజా ఉదాహరణ రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండల పరిధిలో ఉన్న అల్మాస్గూడలో ఇద్దరు మహిళలపై ఫాసిస్ట్ శక్తులు జరిపిన దాడి సంఘటన చూడవచ్చు అని, ఇటువంటి పాలనను పెంచి పోషిస్తున్నది బిజెపి రాజకీయాలను ఎండబడుతూ జరుగుతున్న సభకు గద్వాల లో ఉన్న ప్రజలందరినీ రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నామని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా సిఎంఎస్ అధ్యక్షులు రేవతి,సభ్యులు సంయుక్త విజయ, భారతి, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర ప్రభాకర్,సి ఎల్ సి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు సుభాన్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మత్స్యరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకరించాలి

మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేయాలి

- చేపల ఎగుమతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి
- ఎల్నినో ప్రభావంతో నష్టపోయే మత్స్యకార కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలి
- ఎన్ఎఫ్డీబీ పాలక మండలి సమావేశంలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి



న్యూఢిల్లీ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకారుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (చీఖీణదీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. హైదరాబాద్లో గురువారం జరిగిన నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (ఎన్ఎఫ్డీబీ) పాలక మండలి సమావేశంలో మంత్రి పాల్గొని తెలంగాణ రాష్ట్ర మత్స్య రంగ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రానికి గోదావరి, కృష్ణా వంటి రెండు ప్రధాన జీవనదులతో పాటు అనేక రిజర్వాయర్లు, చెరువులు, ఇతర జలవనరులు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ జలవనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మత్స్యకార సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని, మత్స్యకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. చేపల ఉత్పత్తి పెంపుతో పాటు వాటి నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్కు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న చేపలను ఇతర రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కోల్డ్ స్టోరేజ్లు, చేపల ప్రాసెసింగ్ యూనిట్లు, ఆధునిక రవాణా సదుపాయాలు, ఎగుమతులకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు చీఖీణదీ ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దీనివల్ల మత్స్యకారులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర లభించడంతో పాటు రాష్ట్రానికి ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

ముఖ్యంగా ఈ ఏడాది ఎల్నినో ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మత్స్య రంగంపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధి, ఆదాయం కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి రాకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక సహాయక ప్యాకేజీ, తగిన పరిహారం అందించాలని కోరారు. మత్స్యకారుల సంక్షేమం, మత్స్య రంగ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం చీఖీణదీ ద్వారా అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం, మౌలిక సదుపాయాలు కల్పిస్తే తెలంగాణ మత్స్య రంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు మత్స్యకార కుటుంబాలకు స్థిరమైన ఉపాధి, మెరుగైన జీవన ప్రమాణాలు అందుతాయని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే!

- బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
- బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ. చిరంజీవులు, బీసీ ఉద్యమ నేత వట్టే జానయ్య డిమాండ్



బచ్చన్నపేట, నవంబర్ 5 (జనంసాక్షి) : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ కుటుంబ సభ్యులను గురువారం బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్) హైదరాబాద్ చైర్మన్ టీ. చిరంజీవులు ఆధ్వర్యంలో పలువురు బీసీ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ కారుడువట్టే జానయ్య, ఆర్జీవీ మీడియా రాఘవేందర్ గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకుడు బైరి శేఖర్ గౌడ్, బీసీఐఎఫ్ సభ్యులు అవ్వారు వేణు, చెన్నా శ్రీకాంత్, మామిళ్ల లింగేశ్ యాదవ్, కొండల్ గౌడ్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీ. చిరంజీవులు మాట్లాడుతూ, లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ వైఫల్యానికి, పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఇది ప్రభుత్వమే చేసిన హత్యగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఆత్మహత్యలు ఉండవని, ప్రజల కష్టాలు తీరుతాయని, బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆశించి 1,200 మందికి పైగా యువకులు ప్రాణత్యాగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని ఆయన గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ రాష్ట్రం దొరలు, ఆధిపత్య వర్గాల చేతుల్లోకి వెళ్లిందని, తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన ఉద్యమకారుల కుటుంబాలకే న్యాయం జరగని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. పన్నెండేండ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కేటాయించిన బడ్జెట్ను పక్కదారి పట్టిస్తూ, ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చని కమిషన్ల ఆధారిత ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తూ పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవహారశైలిపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లేని భూ వివాదాలను సృష్టించి లక్ష్మణ్ గౌడ్ను మానసిక ఒత్తిడికి గురిచేసినట్లు కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని, దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బాధ్యత వహించాలని వట్టె జానయ్య కోరారు. లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి కింది డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని నాయకులు కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.కోటి ఎక్స్గ్రేషియా చెల్లించాలని, మృతుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సంక్షేమ సౌకర్యాలు, గుర్తింపు, ప్రయోజనాలను లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కూడా కల్పించాలని, లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులు చిందించిన రక్తం, చేసిన త్యాగాల ఫలితంగానే నేడు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు, నాయకులు ఈ స్థాయికి చేరుకున్నారని, అలాంటి ఉద్యమకారుడి కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోకపోవడం దురదృష్టకరమని ఇతర నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా జానయ్య, బైరి శేఖర్ గౌడ్, చెన్నా శ్రీకాంత్, రాఘవేందర్ గౌడ్ తదితరులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ప్రకటించారు. చివరగా నాయకులందరూ బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, లక్ష్మణ్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రస్థాయిలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

వీబీజీ రామ్జీ అమలులో భేష్

తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రమంత్రి శివరాజ్సింగ్ చౌహాన్ ప్రశంసలు


- అన్ని గ్రామ పంచాయతీల్లో పనుల ప్రారంభంపై అభినందన
- రూ.3,825.3 కోట్ల కేటాయించినట్లు వెల్లడి



హైదరాబాద్ (జనంసాక్షి) : వీబీ-జీ రామ్ జీ చట్టం అమలులో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీల్లో పనుల అమలును ప్రారంభించడంపై అభినందనలు తెలిపారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు చట్టంలోని నిబంధనలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. వీబీ-జీ రామ్ జీ చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన పలు సూచనలపై స్పందిస్తూ ఈ లేఖ పంపించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.3,825.3 కోట్ల నిధుల కేటాయింపు చేసినట్లు కేంద్ర మంత్రి తన లేఖలో వెల్లడించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాల కల్పన, కూలీలకు సకాలంలో వేతనాల చెల్లింపునకు ఈ నిధులు దోహదపడతాయని తెలిపారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద తెలంగాణలో ఇప్పటివరకు 1.83 కోట్ల పనిదినాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఉపాధి కల్పనలో రాష్ట్రం సాధించిన పురోగతికి ఇది నిదర్శనమని, ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన అదనపు పనులను పరిశీలించి వీబీ-జీ రామ్ జీ పథకం కింద అనుమతించదగిన పనుల జాబితాను 375 పనులకు విస్తరించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన రాష్ట్ర గృహ నిర్మాణ పథకంతో పాటు, రాష్ట్రం సూచించిన పలు పనులను ఈ జాబితాలో చేర్చినట్లు తెలిపారు.

గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

27.6 కిలోల గంజాయి, ఒక కారు,రెండు సెల్ఫోన్లు స్వాధీనం



- ఇద్దరి వ్యక్తులు అరెస్ట్

గూడూరు, నవంబర్ 5 (జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కోబల్ తండా క్రాస్ రోడ్డు గురువారం పోలీసుల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న మారుతీ కారు టిఎస్21,టి7453 నంబరు గల కారులో ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, కారు డిక్కీలో సుమారు 27.6 కిలోల ఎండు గంజాయి లభించిందని,గంజాయి విలువ సుమారు రూ.13,82,700లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా సీఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా నుండి గంజాయిని సేకరించి, హైదరాబాద్లోని ఒక వ్యక్తికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు.ఇద్దరు నిందితులను వివరాలు గూడూరు మండలం భూపతిపేట గ్రామ శివారు బోడచక్రు తండాకు చెందిన లావుడ్య దేవి(36) లంబాడ,వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమినాబాద్ గ్రామానికి చెందిన భూక్య నవీన్(24) లంబాడా,నిందితుల వద్ద నుండి అక్రమంగా రవాణా చేస్తున్న 27.6 కిలోల ఎండు గంజాయితో పాటు, మారుతి కారు,రెండు సెల్ఫోన్లు,స్వాధీన చేసుకున్నామని తెలిపారు. నిందితులపై చట్టప్రకారం కేసు నమోదు చేసి,అరెస్ట్ చేసినట్లు తెలిపారు.గంజాయిని అక్రమంగా రవాణా చేసిన,వారు, విక్రయించిన,కొనుగోలు చేసే వారు,వినియోగించే వారు మరియు అక్రమంగా నిల్వ ఉంచే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం, నిల్వకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు,పోలీసులు,సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం డెడ్స్టోరేజ్ నుండి నీటిని తీసుకోవచ్చు

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ (జనంసాక్షి) : ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తయితే ఎంత కరువు వచ్చినా శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుండి నీటిని తీసుకొని రైతులకు సాగునీరు అందించవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం మంత్రి మాట్లాడుతూ... మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు అత్యంత కీలకమైనవని, రైతులకు సంబంధించి ఈ పదవులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, రైతులకు సేవ చేసే అవకాశం వీటి ద్వారా లభిస్తుందని అన్నారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్గొండ మార్కెట్ కు సంబంధించి రెండవ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్తును ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలో అమలు చేస్తున్నాయని, ఇది గర్వకారణం అని అన్నారు. ఎస్ఎల్బీసీ ద్వారా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా జిల్లా అంతటికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 2000 కోట్ల రూపాయలతో చేపట్టిన ఎస్ ఎల్ బి సి ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయంలో నిలిచిపోగా, ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను తిరిగి చేపట్టామని, దురదృష్టవశాత్తు మధ్యలో మళ్లీ పనులు ఆగగా ఇటీవలే పనులు ప్రారంభించి చురుకుగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. బ్రాహ్మణ వెల్లేములను కూడా తమ హయాంలోనే చేపట్టడం జరిగిందని, ఇప్పటివరకు 35000 ఎకరాలకు సాగునీరు అందించగా, లక్ష ఎకరాలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఎస్ఎల్బీసీ ద్వారా జిల్లా మొత్తం సస్యశ్యామలం చేయడానికి కంకణం కట్టుకొని పని చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులకు సేవ చేయడం అదృష్టంగా ప్రతి ఒక్కరు భావించాలని అన్నారు. ఏఎంఆర్పి కాలువల లైనింగును 450 కోట్ల రూపాయలు తో చేపట్టడం జరిగిందని, ముశంపల్లి సబ్ స్టేషన్ మంజూరు చేయించడం జరిగిందని, అలాగే రోడ్డు మంజూరు చేయించామని తెలిపారు. జిల్లాలో కాలువలు ,రిజర్వాయర్లు పూర్తయితే చుట్టుపక్కల బోర్లు రీచార్జ్ అవుతాయని అన్నారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి జిల్లా, రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి ,జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి, తదితరులు హాజరయ్యారు. కాగా నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బి. హేమలత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ గా వి .శ్రీనివాస్ గౌడ్ తో పాటు ,డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.



గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక గుస్సాడి దండారి వేడుకలు

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సిరికొండ/మావల, నవంబర్ 06 (జనంసాక్షి): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుస్సాడి దండారి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గిరిజనుల ప్రత్యేక సంస్కృతి ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో నిర్వహించిన గుస్సాడి దండారి ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరంద్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల విశిష్టమైన సంప్రదాయంలో భాగమైన గుస్సాడి దండారి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఐటీడీఏ పీవో మంద మకరంద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు వారి సాంస్కృతిక వేడుకలకు ఐటీడీఏ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గుస్సాడి దండారి వేడుకలు ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. గిరిజనుల మధ్య ఉన్న ఐక్యతకు నిదర్శనమని కొనియాడారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370